ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 3 , జూన్ 2024

ఒంగోలు అష్టదిగ్బంధం

- నగరమంతా సీసీ కెమెరాల నిఘా
- శివారు ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు
- 24గంటలపాటు హోటళ్లు, దుకాణాలు మూసివేత
- లాడ్జిలు, కల్యాణ మండపాల్లో కొత్త వ్యక్తులు ఉండకూడదని ఆదేశాలు



నగరంలోకి ప్రవేశించే ప్రధాన ద్వారం వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఒంగోలు (క్రైం), జూన్ 2 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నగర సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4న జరగనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. శివారుప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. 3వతేదీ రాత్రి నుంచి 4వ తేదీ రాత్రి వరకూ భోజన హోటళ్లు, దుకాణాలు మూసివేయాలని, లాడ్జిలు, కల్యాణ మండపాల్లో కొత్త వ్యక్తులు ఎవ్వరూ ఉండకూడదని ఆదేశించారు. ఈమేరకు మైక్‌లు పెట్టి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. నగరమంతా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ ప్రజలు గుంపులుగా చేరినా వెంటనే కంట్రోలు రూమ్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నారు. నగరంలో కొత్త వ్యక్తుల కదలికలపై కూడా నిఘా ఉంచారు.

మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్

జిల్లావ్యాప్తంగా ఈనెల 3,4,5 తేదీల్లో మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నారు. మద్యం దుకాణాలతోపాటు, బార్లు కూడా మూతపడనున్నాయి. దీంతో ఆదివారం మద్యం దుకాణాల వద్ద మందుబాబులు బారులు తీరారు. అదేసమయంలో బెల్ట్‌షాపులకు కొందరు పెద్దఎత్తున మద్యాన్ని తరలించారు.



సర్వీసు ఓట్లను బాక్సులో ఉంచి సీల్ వేస్తున్న అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

జిల్లాకు చేరిన 1,981 సర్వీసు ఓట్లు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 2 : ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని 1,981 సర్వీసు ఓట్లు జిల్లాకు చేరాయని పోస్టల్ ఓటింగ్ ప్రత్యేకాధికారి కె.ఝాన్సీ లక్ష్మి తెలిపారు. ఆదివారం వచ్చిన సర్వీసు ఓట్లను స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఆమె బాక్సులో ఉంచి సీల్ వేశారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 4వతేదీ ఉదయం 8గంటల లోపు అందిన సర్వీసు ఓట్లన్నింటినీ లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు డీఎస్ క్రాంతికుమార్, బి.రాజశేఖర్, కొమ్ము యోహాన్, గుర్రం సత్యనారాయణ, ఏడుకొండలు, రమణారెడ్డి, వై.కొండారెడ్డి, సూర్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కౌంట్‌డౌన్

మరో 24 గంటల్లో ఓట్ల లెక్కింపు



రైజ్ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో 24 గంటలే మిగిలి ఉంది. విజేతలు ఎవ్వరన్నది మంగళవారం తేలనుంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాతే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు దాని పరిధిలో ఉన్న జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, అలాగే బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు ఒంగోలు సమీపంలోని రైజ్ కాలేజీలో జరగనుంది. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14, పార్లమెంట్ స్థానానికి 14 టేబుళ్లను విడివిడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్‌లు, ఆతర్వాత ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్‌కు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. రైజ్ కళాశాల పరిసర ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించింది. ఫలితాల ప్రకటన అనంతరం అల్లర్లు జరగకుండా జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. 156 గ్రామాల్లో పోలీసు పికెట్ల ఏర్పాటుతోపాటు నాయకులు, ప్రధాన పార్టీల కార్యాలయాల వద్ద భద్రతను పెంచారు.

- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- మధ్యాహ్నం తర్వాతే ఫలితాలు
- తొలుత సంతనూతలపాడు వచ్చే అవకాశం
- ఒంగోలు పార్లమెంటు లేటు
- మొత్తం ప్రక్రియ ముగిసేది రాత్రికే
- రైజ్ కాలేజీలోనే అన్ని సెగ్మెంట్ల కౌంటింగ్
- అసెంబ్లీ, పార్లమెంట్‌కు విడివిడిగా టేబుళ్లు
- కేంద్రం వద్ద నాలుగంచెల భద్రత
- జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు
- పలు గ్రామాల్లో పోలీసు పికెట్లు
- ప్రధాన పార్టీల అభ్యర్థులు, పార్టీ కార్యాలయాల వద్ద బందోబస్తు

ఒంగోలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 2,183 కేంద్రాల్లో గత నెల 13న పోలింగ్ జరగ్గా ఈవీఎంలలో ఓట్లు నిక్షిప్తమయ్యాయి. వాటన్నింటినీ ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లలో ప్రత్యేక భద్రత మధ్య ఉంచారు. మంగళవారం కౌంటింగ్ జరగనుంది. అందుకు ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. సజావుగా లెక్కింపు ప్రక్రియ సాగడంతోపాటు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది. కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ సుమిత్ ఇందుకోసం భారీ కసరత్తు చేశారు.

తొలుత పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. 8.30 గంటలకు ఈవీఎంలలోని ఓట్ల కౌంటింగ్ చేపడతారు. ఉదయం 5.30 గంటల నుంచే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, అలాగే బాపట్ల లోక్‌సభ పరిధిలోని సంతనూతలపాడు సెగ్మెంట్ పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కూడా ఇక్కడి రైజ్ కాలేజీలోనే జరుగుతుంది. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14, పార్లమెంట్ స్థానం లెక్కింపునకు 14 టేబుళ్లను విడివిడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో టేబుల్ వద్ద గజిటెడ్ హోదా ఉండే ఒక సూపర్‌వైజర్, మరో అసిస్టెంట్, ఇంకో మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఐదు టేబుళ్లు ఏర్పాటు చేయడంతోపాటు ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బందిని నియమించారు. ప్రతి రౌండ్‌కు 14 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ఆయా నియోజకవర్గాలలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిని 14తో విభజించి అన్ని రౌండ్లుగా తేల్చుతారు.

ఉదయం 8 నుంచి కౌంటింగ్ ప్రారంభం

అభ్యర్థుల తరఫు ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్లను ఉదయం 8గంటలకు, ఈవీఎంలలో ఓట్ల లెక్కింపును 8.30 గంటలకు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సంఘం నియమించిన పరిశీలకుల పర్యవేక్షణలో సూపర్ వైజర్లు ప్రారంభిస్తారు. లెక్కింపునకు నియమించిన సిబ్బందిని ఉదయం 5.30 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు రప్పించి వారికి టేబుళ్లను కేటాయిస్తారు. ఆరు గంటలకు అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లను అనుమతిస్తారు. ఆయా నియోజకర్గాల స్ట్రాంగ్ రూమ్‌ల సీల్‌ను అభ్యర్థులు లేదా చీఫ్ ఏజెంట్ల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు తీసి లెక్కింపునకు ఈవీఎంలను పంపిస్తారు.

ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తికి 25 నిమిషాలు

సంతనూతలపాడు నియోజకవర్గంలో తక్కువగా 256, కనిగిరిలో అత్యధికంగా 297 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కనిష్ఠంగా 19 రౌండ్లు, గరిష్ఠంగా 22రౌండ్లు లెక్కింపు సాగుతుంది. ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తికి సగటున 25 నిమిషాల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో మధ్యాహ్నం మూడు గంటల తర్వాతనే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. పోలింగ్ కేంద్రాలు తక్కువగా ఉన్న సంతనూతలపాడు నియోజకవర్గ ఫలితం తొలుత వెలువడే అవకాశం కనిపిస్తోంది. అది కూడా మధ్యాహ్నం మూడు గంటల తర్వాతనే అని చెప్తున్నారు. అదేసమయంలో పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపునకు కొంత అధిక సమయం పట్టనుండగా, అభ్యర్థులు ఎక్కువ ఉన్న సెగ్మెంట్లలో రెండు ఈవీఎంలు వినియోగించడం వల్ల లెక్కింపు ఆలస్యం కానుంది.

అభ్యర్థులు ఎక్కువ మంది పోటీ చేసిన చోట్ల ఆలస్యం

జిల్లాలో ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి 25 మంది అభ్యర్థులు పోటీ చేశారు. మార్కాపురం అసెంబ్లీకి 27 మంది, ఒంగోలుకు 26 మంది, గిద్దలూరుకు 21 మంది రంగంలో నిలిచారు. వాటిలో పోస్టల్ బ్యాలెట్లు కూడా అధికంగానే ఉన్నాయి. దీంతో ఆ నియోజకవర్గాల్లో లెక్కింపు కొంత మేర ఆలస్యమై సాయంత్రం ఆరు గంటల తర్వాతనే వాటి ఫలితాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఒంగోలు పార్లమెంట్ లెక్కింపు రాత్రికి పూర్తికానుంది.

ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ పూర్తికి ఆరుగంటలు

రౌండ్‌ల వారీగా లెక్కింపు కనుక తొలుత 1నుంచి 14 వరకు కేంద్రాల ఈవీఎంలను కేటాయించిన టేబుళ్లపైకి తీసుకువస్తారు. అలా ఒక్కో రౌండ్‌కు 14 ఈవీఎంలను ప్రత్యేక సిబ్బంది ద్వారా టేబుళ్లపైకి చేర్చుతారు. అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 వంతున 112, పార్లమెంట్‌కు 112 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున 672 మంది, పోస్టల్ బ్యాలెట్‌లకు మరో 240 మంది వెరసి 912 మంది సిబ్బంది అవసరం కాగా అదనంగా 20శాతం మందిని నియమించారు. ఒక రౌండ్ కౌంటింగ్ ముగిసిన అనంతరం మరో రౌండ్ లెక్కింపు జరగనుంది. తొలి రౌండ్‌కు అర్ధగంట, అనంతరం ప్రతి రౌండ్‌కు 20నుంచి 25 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ ప్రకారం చూస్తే ఒక్కో సెగ్మెంట్ ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు కనిష్ఠంగా ఆరు గంటలు, గరిష్ఠంగా 9 గంటలు పట్టవచ్చని సమాచారం.

నియోజకవర్గాల వారీ పోలింగ్ కేంద్రాలు, రౌండ్ల వివరాలు ఇలా..			
నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు	పోటీలోఉన్న అభ్యర్థులు
వైపాలెం	265	19	14
దర్శి	282	21	11
ఎస్ఎన్‌పాడు	256	19	14
ఒంగోలు	259	19	26
కొండపి	283	21	15
మార్కాపురం	257	19	27
గిద్దలూరు	284	21	21
కనిగిరి	297	22	12

కట్టుదిట్టమైన భద్రత

ఈసారి కౌంటింగ్ గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో భద్రత చర్యలు చేపట్టారు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలో తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. లెక్కింపు జరిగే రైజ్ కళాశాల పరిసర ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించింది. ఆప్రాంతంలోని జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లింపుతో పాటు జనసంచారాన్ని నియంత్రించనుంది. లెక్కింపు జరిగే కళాశాలలో నాలుగు అంచెల చెకింగ్ వ్యవస్థ, భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. అభ్యర్థులు, అధికారులు, ఏజెంట్లు ఎవ్వరూ సెల్‌ఫోన్‌లను లోపలికి తీసుకెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. వారి వాహనాలను కూడా లోపలికి అనుమతించరు.

156 గ్రామాల్లో పోలీసు పికెట్లు

లెక్కింపు రోజున జిల్లా అంతటా 144 సెక్షన్ అమలుకు ఉత్తర్వులు ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలతో పాటు సమీపంలోని ఒంగోలు నగరంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఘర్షణలు తలెత్తే అవకాశం ఉన్నట్లు గుర్తించిన 156 గ్రామాల్లో పోలీసు పికెట్లతోపాటు 18 మంది కీలక నాయకులు, 16 చోట్ల ప్రధాన పార్టీల కార్యాలయాల వద్ద భద్రతను పెంచారు. ఇలా భారీ భద్రత, ఇతర ఏర్పాట్ల మధ్య కౌంటింగ్‌కు చేపడుతున్న యంత్రాంగం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఓట్ల లెక్కింపును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది. పోస్టల్ బ్యాలెట్లు, ఇతర కారణాలతో కొంత జాప్యం జరిగినా కనీసం ఆరు గంటల లోపు అసెంబ్లీ, రాత్రి 8గంటలకు పార్లమెంట్ స్థానం లెక్కింపు పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నారు



తుమ్మలచెరువు దర్గాలో పూజలు చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు

తుమ్మలచెరువు దర్గాలో టీడీపీ అభ్యర్థుల ప్రార్థనలు

మార్కాపురం రూరల్, జూన్ 2 : తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువులో ఉన్న ప్రఖ్యాత హజరత్ ఖాసింబాబా దర్గాలో ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నారా చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని, ఉమ్మడి జిల్లాలో టీడీపీ అభ్యర్థులంతా గెలవాలని ప్రార్థించారు. వీరిలో దామచర్ల జనార్దన్, గొట్టిపాటి రవికుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఎరిక్షన్‌బాబు, దర్శి అభ్యర్థి లక్ష్మి భర్త లలిత్‌సాగర్, నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున తదితరులు ఉన్నారు. అంతకు ముందు మార్కాపురం చేరుకున్న వారంతా అభ్యర్థి కందుల ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వెళ్లి సమావేశమయ్యారు. భవిష్యత్ ప్రణాళికపై చర్చించుకున్నారు.



కలెక్టర్‌కు వినతిప్రతం ఇచ్చిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్, ఇతర నేతలు

కౌంటింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌ను కోరిన దామచర్ల, బీఎన్
- వైసీపీ శ్రేణులు అల్లర్లు సృష్టించే అవకాశం ఉందని ఫిర్యాదు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 2 : ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ కూటమి అభ్యర్థులు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్ ఆదివారం జిల్లా ఎన్నిక అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. రాబోయే ఫలితాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించే అవకాశం ఉన్నందున వైసీపీ శ్రేణులు అల్లర్లు సృష్టించడంతోపాటు, గొడవలకు దిగే అవకాశం ఉందన్న విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో వైసీపీ ఏజెంట్‌లు గందరగోళం సృష్టించే పరిస్థితులు ఉన్న దృష్ట్యా ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అలాగే పోస్టల్ బ్యాలెట్‌లు, ఈవీఎం ఓట్ల లెక్కింపు ఒకే సమయంలో జరిగేలా చూడాలని కోరినట్లు తెలిపారు. వారి వెంట దర్శి టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్‌సాగర్, కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకుడు ఈదర మోహన్‌తోపాటు పలువురు ఉన్నారు.

టెన్త్ మూల్యాంకనంలో భారీ మార్పులు

- ఇక అంతా డిజిటల్ ఆన్‌లైన్‌లోనే..
- మూడంచెల విధానం అమలు

ఒంగోలు (విద్య), జూన్ 2 : పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీ మార్పులకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సిద్ధమయ్యారు. మాన్యువల్ స్పాట్ వాల్యుయేషన్ స్థానంలో ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థులకు నష్టం జరగకుండా ఉండేందుకు మూడంచెల విధానం అమలుకు నిర్ణయించారు. వచ్చే ఏడాది జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నుంచి దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. ప్రస్తుతం పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో గణితం సబ్జెక్టు జవాబు పత్రాలను ప్రయోగాత్మకంగా ఈకొత్త పద్ధతిలో ముల్యాంకనం చేయనున్నారు. రాష్ట్రంలో సుమారు 50వేల మంది విద్యార్థులు సప్లిమెంటరీలో గణితం పరీక్ష రాశారు. వారికి 24పేజీల జవాబు పత్రం బుక్‌లెట్ ఇచ్చారు. ఈ పత్రాలను విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కర్నూలు, తిరుపతిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కేంద్రాల్లో పార్ట్-1 రాకుండా ఇతర జవాబు పత్రం మొత్తం స్కాన్ చేస్తారు. ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించేందుకు ఇచ్చిన ట్యాబ్‌ల ద్వారా ఉపాధ్యాయులు ఈ జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. ఒక్కొక్కరికి 75జవాబు పత్రాలను కేటాయిస్తారు. ప్రతి జిల్లా నుంచి 50 మంది చొప్పున మొత్తం 1,200 మంది చురుకైన కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి జాబితాలను పంపించాలని డీఈవోలను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి ఆదేశించారు. ఉపాధ్యాయులు ట్యాబ్‌లోకి లాగిన్ అయితే తెరమీద ఒకవైపు జవాబు పత్రం, మరోవైపు మార్కులు వేసేందుకు టేబుల్ వస్తాయి. జవాబు పత్రంలో సమాధానం చూసి దానికి మార్కులు టేబుల్‌లో వేస్తారు. ఇలా ఒక ఉపాధ్యాయుడు దిద్దిన జవాబు పత్రాన్ని మరో టీచర్‌కు పంపించి మూల్యాంకనం చేయిస్తారు. ఈ ఇద్దరి మూల్యాంకనంలో పది శాతం కంటే ఎక్కువ మార్కుల తేడా వస్తే అప్పుడు మూడో టీచర్‌కు పంపి అక్కడ వచ్చిన మార్కులను ఫైనల్ చేస్తారు.



వైసీపీ నేత చదును చేసిన కుంట కట్ట

- కట్ట తొలగించి ఆక్రమణకు వైసీపీ నేత యత్నం
- అడ్డుకున్న ఎస్టీలపై అనుచరులతో కలిసి దాడి
- చోద్యంచూస్తున్న రెవెన్యూ అధికారులు

కుంట భూమిపై కన్ను

దర్శి, జూన్ 2 : వైసీపీ నేతలు భూబకాసురులుగా మారారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూములతోపాటు వాగులు, వంకలు ఆక్రమించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా దర్శి-పొదిలి రోడ్డులోని కోట్లాది రూపాయల విలువచేసే కుంట పోరంబోకు భూమిపై అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కన్నేశాడు. దాన్ని కబ్జా చేసేందుకు కుంట కట్టను సైతం తొలగించాడు. అడ్డుకున్న ఎస్టీలపై అనుచరులతో కలిసి దాడికి తెగబడ్డాడు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మిన్నకుండటం విమర్శలకు తావిస్తోంది.

రూ.కోట్ల విలువైన భూమి ఆక్రమణకు యత్నం

దర్శి రెవెన్యూలోని 1071 సర్వేనెంబర్‌లో 6.50 ఎకరాల కుంట పోరంబోకు భూమి ఉంది. బ్రిటీష్ కాలం నుంచి అక్కడ కుంట ఉంది. ఆ ప్రాంత పొలాల రైతులు సాగునీటి అవసపరాల కోసం దాన్ని ఏర్పాటు చేశారు. పొలాల దున్నకాల సమయాల్లో రైతులు అక్కడ సేద తీరేవారు. సాగర్ కాలువ వచ్చిన తర్వాత కుంట అవసరాలు తగ్గిపోయాయి. ఆప్రాంతమంతా మాగాణి అయింది. ఆ భూములకు విలువ పెరగడంతో కొంతమంది రైతులు కొంతమేర కుంట భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. మరో రెండు ఎకరాలు మిగిలి ఉండగా అందులోని కొంత భూమిలో రాజంపల్లికి చెందిన ఎస్టీలు పంటలు వేసుకుంటున్నారు. మిగిలిన దానిలో కుంట ఉంది. ఆ కుంట భూమి దర్శి-పొదిలి ప్రధాన రహదారి ఆనుకొని ఉండటంతో ప్రస్తుతం ఎకరం రూ.కోటి పలుకుతోంది. దీంతో వైసీపీ నాయకుడి కన్ను దానిపై పడింది. ఏడాదిగా ఆ కుంట భూమిని ఆక్రమించుకునేందుకు పలుసార్లు ప్రయత్నించారు. రాజంపల్లి గ్రామస్థులు అడ్డుపడటంతో ఆక్రమణలకు బ్రేకులు పడుతూ వచ్చింది. గతంలో రెవెన్యూ అధికారులు ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

రెచ్చిపోతున్న వైసీపీ నాయకుడు

అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కూడా లెక్కచేయకుండా వైసీపీ నాయకుడు రెచ్చిపోతున్నాడు. దర్శి ఎంపీపీ భర్త జి.అచ్చయ్య ఆ కుంట భూమిపై తమకు హక్కు ఉందని కొంతకాలంగా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ భూమిని సాగు చేసుకుంటున్న రాజంపల్లి గ్రామానికి చెందిన ఎస్టీలు పలుదఫాలు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారుల వద్ద కూడా ఈవిషయమై చర్చ జరిగింది. ప్రభుత్వభూమి ఆక్రమణకు గురికాకుండా అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారు. దీంతో దర్శి ఎంపీపీ భర్త అచ్చయ్య తన అనుచరులతో గురువారం రాత్రి కుంట పోరంబోకు భూమి ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అందులోభాగంగా కుంట కట్టను కొంతమేర తొలగించారు. ఆ భూమిని సాగు చేసుకుంటున్న ఎస్టీలు ఆక్రమణను అడ్డుకున్నారు. దీంతో అచ్చయ్య తన వర్గీయులతో ఎస్టీలపై దాడిచేశారు. వైసీపీ నాయకుల దాడిలో ఎస్టీ వర్గానికి చెందిన వీరాంజనేయులు, రవికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరాంజనేయులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఇంతజరిగినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు కూడా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ ఘటనతో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడ జరుగుతున్న అక్రమాలను గుర్తించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కారు, బస్సు ఢీ-ఇద్దరికి గాయాలు

కంభం, జూన్ 2 : ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు- కారు ఢీకొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు కంభం ఎస్సై షలి రాజేష్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు, అనంతపురానికి చెందిన కృష్ణారెడ్డి, రాఘవ కారులో శ్రీశైలం వెళ తున్నారు. మార్కాపురం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు జంగంగుంట్ల సమీపంలో ఎదురుగా ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలైనట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై డీఎస్పీ డ్రైవర్ దాడి

రామాపురం(చీరాలటౌన్), జూన్ 2 : చీరాల డీఎస్పీ డ్రైవర్, మరొకరు దాడి చేసి గాయపరచిన ఘటనలో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల బాలాజీ థియేటర్ సమీపానికి చెందిన మించాల శ్రీనివాసరావు ఇటీవల వాడరేవు - రామాపురం రోడ్డులో ఓ స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈక్రమంలో ఆ స్థలాన్ని ఆదివారం సాయంత్రం చదును చేస్తుండగా ప్రస్తుతం డీఎస్పీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ బట్టు రామకృష్ణ, కారంచేడుకు చెంది న కొనికి శ్రీనివాసరావు ఈ స్థలం తమదంటూ శ్రీనివాసరావుతో వాదనకు దిగారు. ఈ నేపథ్యంలో కాళ్లతో, చేతులతో దాడి చేశారు. దీంతో స్థానికుల సహాయంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

త్రిపురాంతకం, జూన్ 2: వేగంగా వెళుతున్న ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో కారు ముందుభాగం దెబ్బతిని ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని దూపాడు సమీపంలోని సాగర్ కాలువ వద్ద ఆదివారం చోటుచేసుకొంది. గుంటూరు నుంచి మార్కాపురం వెళుతున్న కారును ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని మార్కాపురం వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై పోలీసులు పోలీసులు వివరాలు సేకరించారు.

డివైడర్‌పైకి కారు.. తప్పిన ప్రమాదం

మార్టూరు, జూన్ 2 : జాతీయ రహదారిపై గుంటూరు వైపు వెళుతున్న కారు ముందు టైరు వీల్ విరిగిపోవడంతో అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం డేగరమూడి సర్వీసు రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు ఎదురుగా హైవేపై జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. అందిన సమాచారం మేరకు.. కడప నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు ముందు భాగంలో ఎడమ వైపు టైరువీల్ విరిగిపోయింది. దాంతో కారు వేగం కంట్రోలు కాక రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పైకి కారు దూసుకుపోవడమే కాకుండా మరలా కారు ఒంగోలు వైపు డివైడర్‌పైకి ఎక్కింది. ఈ కారులో ఒక వ్యక్తితో పాటు మహిళ, రెండేళ్ల పాప ఉన్నారు. వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ టీం సంఘటనా స్థలానికి వచ్చి ఎక్స్‌కవేటర్ సాయంతో కారును సరిచేశారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

కారంచేడు(పర్చూరు), జూన్ 2: మహిళ పట్ల అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తిపై ఆదివారం కారంచేడు పోలీసు స్టేషన్‌లో కేసునమోదైంది. కారంచేడు గ్రామానికి చెందిన ఓ మహిళ తప్పి పోయిన గేదెను వెతుకుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి తనపై అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలు కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శ

పంగులూరు, జూన్ 2 : కొండమంజులూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన చింతల బాపనయ్యచౌదరి కుటుంబ సభ్యులను టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పరామర్శించారు. చింతల బాపనయ్య చౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పించిన గొట్టిపాటి ఆయన మృతికి కారణాలను తెలుసుకున్నారు. రవికుమార్ వెంట నాయకులు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు పాల్గొన్నారు.

మేదరమెట్ల : ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆదివారం మేదరమెట్ల ఎస్టీ కాలనీకి చెందిన తెలుగుదేశం కార్యకర్త చేవూరి తిరుపతిరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న తిరుపతిరావును రవికుమార్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలుగుదేశం నాయకులు సింగయ్య మనుమడును పరామర్శించి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసున్నారు. ఆయన వెంట మేదరమెట్ల శ్రీనివాసరావు, బొల్లేపల్లి సుబ్బారావు, సింగమనేని వాసు, మన్నె ప్రసాద్, గ్రామపార్టీ అధ్యక్షుడు శేషయ్య వడ్లమూడి సురేంద్ర, బ్రమ్మయ్య, రాజేష్ పాల్గొన్నారు.

బల్లికురవలో భారీ వర్షం

బల్లికురవ, జూన్ 2 : గత వారం రోజుల నుంచి వడగాలులు ఎండలు ఉక్కపోతతో విలవిలలాడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఆదివారం ఉ దయం 5 గంటల నుంచి గంటపాటు పిడుగులతో కూడా భారీ వర్షం పడడంతో వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఎండలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రుతుపవనాలు సకాలంలో రావడంతో వర్షాలు ప్రారంభమయ్యాయని ప్రజలు అంటున్నారు. ఉరుములు మెరుపులు పిడుగులు భారీ శబ్దంతో రావడంతో గృహాలలో నిద్రపోతున్న ప్రజలు ఒకింత భయాందోళన చెందారు. దగ్గరలోనే పిడుగులు పడిన్నట్లు శబ్దం వచ్చినట్లు తెలిపారు. గంగమ్మ దేవాలయం సమీపంలో చెట్టుపై పిడుగు పడిందని ప్రజలు తెలిపారు. మరో వర్షం పడితే భూమిలో తేమ శాతం పెరిగి వాతావరణం చల్లబడుతుందని ప్రజలు తెలిపారు.

ప్రముఖుల కలయిక



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, రఘురామకృష్ణమరాజు, కామినేనితో బలరాం

చీరాల, జూన్ 2 : పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కార్యక్రమం సందర్భంగా పలువురు ప్రముఖులు వెళ్లారు. ముందుగా వెంకటకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రఘురామకృష్ణమరాజు, కామినేని శ్రీనివాసరావు, కరణం బలరాం మధ్య మాటామంతీ జరిగింది.

ఆంధ్రరత్న ఆశయాలను కొనసాగించాలి

చీరాల, జూన్ 2 : ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆశయాలను కొనసాగిస్తామని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు సర్విశెట్టి సుబ్బరామయ్య అన్నారు. దుగ్గిరాల జయంతి సందర్భంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కులోని గోపాలకృష్ణయ్య విగ్రహానికి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు సుబ్బరామయ్య మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో ఖ్యాతిపొందిన చీరాల, పేరాల ఉద్యమ సారథి, రామదండు రూపశిల్పి దుగ్గిరాలని కొనియాడారు. ఆయనను నేటి తరం నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివప్రసాదరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, జి.హరిప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.



దుగ్గిరాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివేకానంద సేవా సమితి ప్రతినిధులు

నేడు శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పర్చూరు, జూన్ 2: పర్చూరులోని వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ఆలయ ప్ర థమ వార్షిక మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. అందుకోసం భారీ ఏర్పాట్లను ఆలయ కమిటీ వారు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. ఉదయం 7గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించనునట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేయనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

సర్వే ఫలితాలపై వైసీపీ శ్రేణుల్లో మదనం

- ధీమాలో తెలుగు తమ్ముళ్లు

సింగరాయకొండ, జూన్ 2: నిన్న మొన్నటి వరకూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ఆపార్టీ నేతలు, మళ్లీ వైసీపీనే అధికారంలోకి వస్తుందని వైసీపీ నేతలు ఏవరి ధీమాలో వారు ఉన్నారు. శనివారం రాష్ట్ర, జాతీయ స్థాయి సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్‌లో మెజారిటీ సర్వేలు టీడీపీ కూటమి అత్యధిక సీట్లను కైవసం చేసుకొని అధికారంలోకి రాబోతున్నట్లు వెల్లడించాయి. దీంతో కూటమి నేతల్లో మరింత జోష్ పెరిగింది. కొన్ని సర్వేలు వైసీపీకి అనుకూలంగా ఇచ్చినప్పటికీ అధికారపార్టీ నేతల్లో మాత్రం మచ్చుకైనా ఉత్సాహం కనిపించడం లేదు. ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయక ముందు టీడీపీ అధికారంలోకి వస్తోందని రూపాయికి ఒకటిన్నర రూపాయి వరకు ఇచ్చి పందేలు కాశారు. ఎగ్జిట్ పోల్స్ అనంతరం బెట్టింగ్‌లకు మేం రాంరాం.. అంటూ చేతులెత్తేస్తున్నారు. సర్వేలు వైసీపీ శ్రేణులను మరింత కలవర పెడుతుంటే.. టీడీపీ కూటమి శ్రేణుల్లో మాత్రం ఉత్సాహాన్ని ఇచ్చాయి.

మండల మెజారిటీపై భారీగా బెట్టింగ్

సింగరాయకొండ మండలంలో టీడీపీకి ఆధిక్యత వస్తుందని ఆపార్టీ నాయకులు, వైసీపీకి మెజారిటీ వస్తుందని అధికారపార్టీ నేతలు భారీగా బెట్టింగ్‌లు పెట్టారు. ఇప్పటికే మండల మెజారిటీపై ఇరు పార్టీకు చెందిన నేతలు దాదాపు చేరో రూ.కోటి పందేలు కాసినట్లు సమాచారం. కాగా సింగరాయకొండ టౌన్ మెజారిటీపై కూడా వైసీపీ, టీడీపీ నేతలు పెద్దమొత్తంలోనే పందేలు కాసుకొన్నట్లు తెలుస్తోంది. ఎగ్జిట్ పోల్స్ అనంతరం సింగరాయకొండ మండలం, టౌన్ మెజారిటీపై టీడీపీ నేతలు బెట్టింగ్‌లకు ఉత్సాహం చూపుతుంటే వైసీపీ నేతలు మాత్రం దిగాలుగా వెనకడుగువేస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వేదికపై ఎన్నికల పరిశీలకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 2: కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరిగేటట్లు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాల్‌లో రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ విధులకు కేటాయించబడిన సిబ్బంది మంగళవారం ఉదయం 5గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునేలా రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు సైతం అనుమతించకూడదని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు చేయాల్సిన విధులకు సంబంధించి ముఖ్యఅంశాలపై చెక్‌లిస్టును రూపొందించి వారికి అందించాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు అరవింద్‌కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతా మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమనిబంధనలను పాటించాలన్నారు. అనంతరం ఎస్పీ గరుడ్‌సుమిత్ సునీల్ మాట్లాడతూ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో శ్రీలత, మార్కాపురం, సంతనూతలపాడు, అసెంబ్లీ సెగ్మెంట్స్ అబ్జర్వర్స్, నియోజకవర్గాల రిట్నరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఏర్పాట్లు పూర్తి

ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు వందశాతం పూర్తిగా సన్నద్ధంగా ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపుపై ఆదివారం వెలగపూడి నుంచి ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను దినేష్‌కుమార్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద అత్యంత పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీకెమెరాలతో పాటు సజావుగా కౌంటింగ్ ప్రక్రియ చేపట్టేందుకు అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. అంతకు ముందు ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి కౌంటింగ్‌కు సంబంధించి అవసరమైన శిక్షణ, రౌండ్ల వారీగా ఫలితాల ట్యాబులేషన్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, ఎన్నికల సెల్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కుమారుడిని తుపాకీతో కాల్చి చంపిన కానిస్టేబుల్ అరెస్ట్

- తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి వెల్లడి

ఒంగోలు(క్రైం), జూన్ 2: కన్న కుమారుడిని తుపాకీతో కాల్చి చంపిన ఏఆర్ కానిస్టేబుల్ కొదమల ప్రసాద్‌బాబును అరెస్టు చేసినట్లు ఒంగోలు తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి స్థానిక భాగ్యనగర్ 4వ లైన్‌లో గల వీపీపాడ్స్ రిజర్వుడ్ గోదాం వద్ద విధులలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్‌బాబు తన కుమారుడు శేషుకమల్ (20)ని తుపాకీతో కాల్చి దారుణంగా చంపాడు. వివరాలలోకి వెళితే.. మద్య సేవించిన ప్రసాద్‌బాబును కుమారుడు శేషుకమల్ వారు నివాసం ఉండే స్థానిక శ్రీనివాసకాలనీ ఒకటో లైన్‌లో నుంచి మోటార్‌సైకిల్‌పై తీసుకొచ్చి విధులు నిర్వహించే గోదాం వద్ద వదిలిపెట్టాడు. అయితే ప్రసాద్‌బాబు తన జీతం రూ20వేలు నగదును డ్రా చేసి తన వద్ద ఉంచుకున్నాడు. దీంతో ఆ నగదును మద్యం తాగిన తన తండ్రి వద్ద ఎందుకని కుమారుడు ప్రశ్నించిడంతో వారి మధ్య వివాదం జరిగింది. ఈక్రమంలో కోపోద్రేకుడైన ప్రసాద్‌బాబు తన వద్ద ఉన్న రివాల్వర్‌తో రాత్రి 10 గంటల సమయంలో కుమారుడిపై ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. దీంతో బులెట్ ఛాతీపై తగలడంతో శేషుకమల్ అక్కడికక్కడే కుప్పకూలాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే కుమారుడిపై కాల్పులు జరిపిన ప్రసాద్‌బాబు తన వద్ద ఉన్న రివాల్వర్‌తో మరలా అక్కడ విధులలో ఉన్న వారిని సైతం బెదిరించాడు. ఈ సమయంలో అక్కడ ఉన్న కానిస్టేబుళ్లు చాకచక్యంగా ప్రసాద్‌బాబు వద్ద ఉన్న ఆయుధాన్ని తీసుకొని మరో ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడ్డారు. ఈ మేరకు అదుపులోకి తీసుకున్న ప్రసాద్‌బాబును అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సీఐ భక్తవత్సలరెడ్డి వెల్లడించారు.

శవపంచనామ నిర్వహించిన తహసీల్దార్

కాగా కన్న తండ్రి చేతిలో మృతి చెందిన శేషుకమల్ మృతదేహానికి ఒంగోలు తహసీల్దార్ సుజన్ కుమార్ ఆదివారం శవపంచనామా చేశారు. రిమ్స్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- అంధకారంలో తర్లుపాడు
- ఉక్కపోతల నుంచి ప్రజలకు ఉపశమనం





తర్లుపాడులో ఓ ఇంటిపై కూలిన భారీ వృక్షం, నేలకొరిగిన విద్యుత్ స్తంభం

తర్లుపాడు, జూన్ 2: తర్లుపాడులో ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా పెనుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఎన్నడూ లేని విధంగా 20 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వృక్షాలు సైతం నేలకొరి గాయి. దీంతో తర్లుపాడు అంధకారంలో ఉంది. తర్లుపాడు లోనే 8 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పెనుగాలుల బీభత్సానికి బ్యారన్ రేకులు, చెట్లు, పాకాల వంటివి కూలి పోయాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రైల్వే గేటు వద్ద ఉన్న గోసు వెంకటేశ్వర్లు ఇంటిపై భారీ వృక్షం విరిగిపడింది. దీంతో ఆ సమయంలో బయట ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ముదిరాజ్ కాలనీ, మెయిన్ బజార్, పోలేపల్లె, ముస్లిం వీధుల్లో, ఎస్సీ పాలెంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. దీంతో తరుపాడు 24గంటల పాటు అంధకారంలో ఉంటుందని ఏఈ హనుమాన్‌నాయక్ తెలిపారు. కొత్త విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్తును పునరుద్ధించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. విద్యుత్ లేక మంచినీటికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కంభంలో వర్షం

కంభం: వారం రోజులుగా తీవ్రమైన వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన కంభం మండల ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ ఆదివారం సాయంత్రం 3 గంటల కు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. జూన్ మొదట్లోనే వర్షం పడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గాలులకు విద్యుత్ లైన్లు తెగి కింద పడడంతో అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేశారు.

చల్లబడిన వాతావరణం

గిద్దలూరు: రోహిణి కార్తె ఎండలతో వారం రోజులపాటు ప్రజలు ఇబ్బందులు పడగా ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి, చల్లటి గాలులతో సేద తీరారు. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడం, రుతుపవనాల ప్రభావంతో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా చల్లటి గాలులు వీచి వర్షం కురవడంతో ప్రజలు సేదతీరారు.

భక్తిశ్రద్ధలతో నాగవరపమ్మ కొలుపులు

చినగంజాం, జూన్ 2 : చినగంజాం మండలంలోని కడవకుదురు గ్రామంలో నాగవరపమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నక్కల వంశీకుల ఇలవేల్పు నాగవరపమ్మ అమ్మవారి కొలుపులను మే 31వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దేవర పెద్ద నక్కల పెదముత్తయ్య తెలిపారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక్కసారి నక్కల వంశీకులు అమ్మవారి కొలుపులు నిర్వహించడం అనవాయితీగా వస్తుందని తెలిపారు. కొలుపులు ముగింపు రోజైన ఆదివారం సాయంత్రం అమ్మవారికి పొట్టేళ్లు, అగుమంచి బాణం, రాత్రి కి పట్టాలెక్కుట తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహిళ భక్తులు పొంగళ్లు నెత్తన పెట్టుకొని మంగళవాయిద్యాలు, కనకతప్పెట్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొని వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నక్కల వెంకటనారాయణ, నక్కల కృష్ణ, వెంకయ్య, పాపయ్య, నక్కల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.



పొంగళ్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

చీరాలటౌన్, జూన్ 2: ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పోటీ చేసిన అభ్యర్థులకు నియమ నిబంధనలను వివరిస్తూ నోటీసులు అందజేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 144 అమలులో ఉన్నట్లు గుర్తు చేశారు. కార్యకర్తలతో సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. విజయోత్సవ లేదా ఇతర ర్యాలీలు నిర్వహించరాదన్నారు. టపాసులకు అనుమతులు లేవన్నారు. ప్రత్యర్థులను, లేదా ఏదైనా రాజకీయ పార్టీలనుద్దేసించి ప్రేరేపిత వ్యాఖ్యలు చేయరాదని సూచించారు. అభ్యర్థుల నివాస ప్రదేశాల్లో అధిక సంఖ్యలో గుమిగూడడం, మారణాయుధాలు ఉంచడం చట్టవ్యతిరేకమని డీఎస్పీ తెలిపారు.



చీరాలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

చీరాల రూరల్ పరిధిలోని అసాంఘిక శక్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపినట్లు రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో వాడరేవు, గవినివారిపాలెం, దేవినూతల, రామాపురం తదితర ప్రాంతాల్లో పోలీస్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచినట్లు వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై శివకుమార్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఎన్‌సీసీ క్యాంపులో పేస్ విద్యార్థుల ప్రతిభ



క్యాడెట్లను అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు(విద్య), జూన్ 2: ఒంగోలు రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో జరిగిన ఎన్‌సీసీ 34 బెటాలియన్ క్యాంపులో స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాల క్యాడెట్లు బహుమతులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ క్యాంపునకు జిల్లా నుంచి మొత్తం 700మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టెంట్ ఫిక్సింగ్, ఫైరింగ్, టగ్ ఆఫ్ వార్‌పోటీలు నిర్వహించారు. పేస్ కళాశాల విద్యార్థులు టెంట్ ఫిక్సింగ్ పోటీలో బాలురు కేవలం 8.34 నిమిషాల్లో టెంట్ ఫిక్స్ చేసి మొదటి స్థానంలో నిలిచారు. టగ్‌ఆఫ్‌వార్‌లో బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే. మూర్తి, డీన్ చైతన్య, ఆర్.వీరాంజనేయులు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, పృదీన్‌కృష్ణ విద్యార్థులను అభినందించారు.

రహదారి నిబంధనలు పాటించాలి

మద్దిపాడు, జూన్ 2: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. ఆదివారం సీతారాంపురం కొష్టాల్‌లో ఆయన వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అదేవిధంగా జాతీయరహదారిపై ప్రయాణించేటప్పుడు నిబంధనల ప్రకారం వాహనాన్ని నడపాలన్నారు. 18 సంవత్సరాల వయస్సులోపు వారికి వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పొల్యూషన్ సర్టిఫికెట్, బీమా కాగితాలు తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు.

లెనిన్‌కు నివాళులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 2: ఒంగోలులోని నారాయణస్వామి భవన్‌లో ఆదివారం లెనిన్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి సీఎస్.సాగర్ అధ్యక్షతన జరిగిన సభలో విరసం రాష్ట్ర నాయకులు సీఎస్ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ లెనిన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

ఒంగోలు(విద్య), జూన్ 2 : పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5వ తేదీన జిల్లాలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని పర్యావరణ పరిరక్షణ సంస్థ ఛైర్మన్ జి.వీరభద్రాచారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండుతున్న ఎండలకు కారణం మానవుడు స్వార్థంతో నరుకుతున్న చెట్లు, అడవుల నరికివేత అని తెలిసినా పాలకులు మౌనం వహిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న వాయు, నీటి, వాతావరణ కాలుష్యంతో పాటు ఆహార కల్తీ ప్రజలను దీర్ఘకాలిక, ఆకస్మిక అనారోగ్యాలకు గురిచేస్తూ ప్రాణాలను హరిస్తుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన కోరారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ విజేత కోటి ఫ్రెండ్స్

నాగులుప్పలపాడు, జూన్ 2: రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో చీరాల కోటి ఫ్రెండ్స్ జట్టు విజేతగా నిలిచింది. ఉప్పుగుండూరులో విద్యానగర్ ఆధ్వర్యంలో జేవైఎస్, రాజేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలలో భాగంగా ఆదివారం చీరాల కోటి ఫ్రెండ్స్, విద్యానగర్ సీనియర్స్ జట్ల మధ్య ఉత్కంఠంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కోటి ఫ్రెండ్స్ గెలిచింది. ప్రథమ బహుమతి రూ.40,116ని కైవసం చేసుకుంది. రెండో బహుమతి విద్యానగర్ సీనియర్స్ రూ.30,116, మూడవ బహుమతి ఉప్పుగుండూరు లెవన్ బులెట్స్ రూ.20,116, నాల్గవ బహుమతి బూరేపల్లి యూత్ రూ.10,116 అందుకొన్నాయి. విజేతలకు దాతల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌లకు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో మద్దిసాని నాగేశ్వరరావు, గద్దల ఉదయ్, గద్దె పెద సుబ్బారావు, పైనం జయబాబు, గద్దె శేషయ్య, నాగమల్లేశ్వరరావు, తెలగతోటి పృథ్వి, గుణ పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న దాతలు

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

టంగుటూరు, జూన్ 2 : టంగుటూరులోగల గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం చదవడం నాకిష్టం కార్యక్రమం జరిగింది. పలువురు చిన్నారులు హాజరై పుస్తక పఠనం చేశారు. వారు చదివిన కథలు, అంశాలను సహచర విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి విజ్ఞాన కేంద్రానికి పంపాలని కోరారు. పిల్లలు బాల్య దశ నుంచే లైబ్రరీకి రావడం అలవాటు పడితే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రంథాలయంలో పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, స్వాతంత్ర్య సమరయోధుల గాథలు, నీతి అంశాలను బోధించే చిన్నచిన్న కథలతోకూడిన పుస్తకాలు గ్రంథాలయంలో ఉంటాయని, అలాగే చిన్నారులు వారి వయసు పెరిగే కొద్ది కావాలసిన పుస్తకాలన్నీ ఉంటాయన్నారు. వీటిని చదివి విజ్ఞానవంతులు కావాలని గ్రంథపాలకుడు కోరారు. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం అన్నారు.



చదవడం నాకిష్టంలో పాల్గొన్న విద్యార్థులు

సర్వేలను ఎందుకు అనుమతిస్తున్నారు : సీపీఐ

టంగుటూరు, జూన్ 2 : మా రహస్య ఓటింగ్‌పై మీసర్వేలు ఎందుకని సీపీఐ మండల కార్యదర్శి టి.ప్రభాకర్ ఆదివారం ఓ ప్రకటనలో సర్వే సంస్థలను ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో జరిగింది రహస్య ఓటింగ్ కదా.. ఇలాంటి సర్వేలకు ఎందుకు అనుమతిస్తున్నారని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. సర్వేలంటే జ్యోతిష్యమేనని, దీనిని నమ్మటం అంటే జ్యోతిష్యం నమ్మిన్నట్లేనన్నారు. ఈసర్వేల దెబ్బకు పార్టీల అభిమానులు కకావికలం అవుతున్నారని, సర్వేల వలన జరిగే ఏవిధమైన నష్టమైనా సరే ఆ సంస్థలు భరిస్తాయా అని ప్రభాకర్ అడిగారు. నిర్దిష్ట లక్ష్యాలు లేని అనేక సంస్థలు సర్వేలు చేసి భాగ్యలక్ష్మి లక్కీ లాటరీ లా ప్రజల ముందు పెడుతున్నారని, వీరి ఫలితాల దెబ్బకు పార్టీల అభిమానులు గందరగోళ పడుతున్నారని చెప్పారు. జ్యోతిష్యం, లాటరీ ఫలితాలను పోలిన ఎగ్జిట్ పోల్స్ ఇకనైనా నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పోతుల రంగయ్యకు నివాళి

టంగుటూరు, జూన్ 2 : స్వర్గీయ పోతుల రంగయ్య గొప్ప స్నేహశీలి అని పలువురు కీర్తించారు. రంగయ్య తృతీయ వర్ధంతి టంగుటూరులోగల ఎస్ఎల్‌టీసీ ఆవరణలో శనివారం రాత్రి జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, పలువురు రంగయ్య మిత్రులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతుల సోదరులు, చిడిపోతు వెంకటేశ్వర్లు, పోలినేని వెంకటేశన్, పూనాటి వెంకటేశ్వర్లు, చదలవాడ వేణు, కసుకుర్తి శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతుల రామారావు

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు, జూన్ 2 : ఇంకొల్లులో ఆదివారం కూరపాటి సీతారావమ్మ(86) మృతి చెందగా, రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో శంకర్ కంటి వైద్యశాల వైద్యులు నేత్రాలను సేకరించారు. సహకరించిన కుటుంబ సభ్యులు రమాదేవి, శ్రీనివాసరాజు, సతీష్‌కుమార్, అనిల్‌కుమార్‌ను వారు అభినందించారు.

విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిషేధం

వెలిగండ్ల, జూన్ 2: ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతిలేదని ఎస్ఐ శివ తెలిపారు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా గ్రామ సభలతో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

పీసీపల్లి: ఎన్నికల కౌంటింగ్ అనంతరం గెలుపు సంబరాలు, విజయోత్సవ ర్యాలీలలకు అనుమతి లేదని ఎస్సై రమేష్‌బాబు అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 4న కౌంటింగ్ సందర్భంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇద్దరు వ్యక్తులకు మించి ఎక్కువమంది గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. రంగులు చల్లుకోవడం, బాణసంచా కాల్చడం వంటివి నిషేధించినట్టు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో ఇతరులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనంతో ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

పామూరులో భారీ వర్షం

పామూరు, జూన్ 2: పామూరు పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో సుమారు అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం ధాటికి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలి లేకపోవడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వైన్‌షాపుల వద్ద మందుబాబులు క్యూ



వైన్ షాపు ముందు వేచివున్న మందుబాబులు

కురిచేడు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఈనెల 3 నుంచి 5వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలను మూడురోజులపాటు మూసివేస్తున్నారు. దీంతో ఆదివారం మందుబాబులు వైన్ షాపుల ముందు క్యూ కట్టారు. దీనికితోడు పడమర వీరాయపాలెంలో చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులు ఉండటంతో వైన్‌షాపుల వద్ద రద్దీ ఏర్పడింది. వైన్ షాపుల ముందు మందుబాబుల గుంపులు చూసి ప్రజలు అవాక్కయ్యారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి

పీసీపల్లి, జూన్ 2: వడదెబ్బకు వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి మండలంలోని తలకొండపాడులో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ముప్పూరి మాలకొండయ్య(80) శనివారం మధ్యాహ్నం ఎండతీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ప్రైవేట్ వైద్యుని వద్ద చికిత్స చేయించారు. అయినా వడదెబ్బకు గురైన మాలకొండయ్య ఆ రోజు రాత్రికి మృతి చెందాడు.

గదుల నిర్మాణానికి విరాళం

పామూరు, జూన్ 2: పామూరు సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి సీఎస్‌పురం మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి సతీమణి జ్ఞాపకార్థం రూ.5,1116ల విరాళాన్ని ఆదివారం ప్రకటించారు. ఈమేరకు శిశుమందిర్ నిర్వాహకులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఎం.గంగరాజు, వాసవీమాత దేవస్థాన అధ్యక్షుడు వై.బాలకొండలరావు, రఘుపతి దరిశిమస్తాన్‌రావు, తోట రవికుమార్, గోస్టు దయాసాగర్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలతో..

టీడీపీ కూటమిలో జోష్

» వైసీపీలో అంతర్మథనం

దర్శి, జూన్ 2: ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలపై టీడీపీ కూటమి క్యాడర్ జోష్‌లో ఉన్నారు. రాష్ట్రంతో పాటు దర్శి నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధిస్తుందని అధికశాతం ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంతో టీడీపీ కూటమి అధికారంలోకి రావటం ఖాయమని భావిస్తున్నారు. అలాగే, దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజయం సాధిస్తారని అధికశాతం ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించటంతో టీడీపీ కూటమి క్యాడర్ ఆనందానికి అవదులు లేకుండా పోయింది. ఎక్కడచూసినా టీడీపీ మద్దతుదారులు ఈ విషయంపై చర్చించుకుంటున్నారు.

అదేసమయంలో ఎగ్జిట్‌పోల్స్‌పై వైసీపీ క్యాడర్ నిశితంగా పరిశీలిస్తుంది. కొద్దిమంది మాత్రమే వైసీపీ గెలుస్తుందని చెప్పటంతో వారు అంతర్మథనంలో పడ్డారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వస్తుందనే నమ్మకం వారిలో సన్నగిల్లింది. దర్శిలో వైసీపీ గెలుస్తుందని ఇప్పటి వరకు ధీమాగా ఉన్న ఆ పార్టీ క్యాడర్ ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలతో అంతర్మథనంలో పడ్డారు. ఏమి జరుగుతుందోనని ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. కొంతమంది ఎవరికి రాసిపెట్టి ఉంటే వారు గెలుస్తారని వేదాంతం చెబుతున్నారు. నిన్నమొన్నటి వరకు గెలుపుపై బల్లగుద్ది ధీమా వ్యక్తం చేసిన వైసీపీ క్రమేపీ ఫలితాలు ఎలా ఉంటాయోనని గుబులు చెందుతున్నారు.

దర్శిలో వైసీపీ అభ్యర్థి గెలుపుపై, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుపై ఆపార్టీ క్యాడర్ కోట్లాది రూపాయలు పందెలు పెట్టిన విషయం తెలిసిందే. అంతేకాక టీడీపీ కూటమి సానుభూతిపరులు పార్టీ అధికారంలోకి వస్తుందని ఎదురు పందెంపెట్టారు. ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలతో పందెం రాయుళ్లల్లో ఏం జరుగుతుందోనని ఆందోళనలు మొదలయ్యాయి. వచ్చే మంగళవారం కౌంటింగ్ జరగనున్నందున అప్పటివరకు ఈ చర్చ కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రశాంతంగా కౌంటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్, దామచర్ల జనార్దన్, విజయకుమార్

దర్శి, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని దర్శి అసెంబ్లీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్, ఒంగోలు, సంతనూతలపాడు అభ్యర్థులు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్ కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం ఒంగోలులో వారు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు. అందుకు స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఏజెంట్లు గొడవలు చేస్తే తక్షణమే బయటకు పంపుతామని తెలిపారు. ఇందుకు సంబంధించి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

ఈసీ ఆంక్షలను గౌరవించాలి!

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరగనున్న సందర్భంగా ఈసీ విధించిన ఆంక్షలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు గౌరవించాలని మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహా రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక భాగం మాత్రమేనని, ప్రతిఒక్కరూ ప్రభుత్వాధికారులకు సహకరించాలని కోరారు.

ఎన్నికల ఆంక్షలలో భాగంగా కనిగిరి ప్రాంతంలో విధించిన 144వ సెక్షన్, 30పోలీస్ యాక్టును గౌరవించి పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు. టీడీపీ కార్యకర్తలు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తారని పోలీసుశాఖ గుర్తించేలా నడుచుకోవాలని డాక్టర్ ఉగ్ర ఆకాంక్షించారు.



మార్కాపురం దర్గాలో దీపాలు వెలిగిస్తున్న డాక్టర్ ఉగ్ర

మార్కాపురంలో ఉగ్ర ప్రత్యేక పూజలు

మార్కాపురంలో హజరత్‌ఖాసీం స్వాములు దర్గాలో డాక్టర్ ఉగ్ర ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలో దీపాలు వెలిగించి ప్రార్థనలు చేశారు. రాష్ట్రానికి సంక్షేమ పాలన అందించే టీడీపీ అఖండ మెజార్టీతో సీట్లు సాధించి, చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థించారు. ప్రార్థనలు చేసినవారిలో టీడీపీ కూటమి అభ్యర్థులు దామచర్ల జనార్దన్, గొట్టిపాటి రవికుమార్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబు, తదితరులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

» సీఐ వెంకటేశ్వరరావు



పేరంగుడిపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

కనిగిరి, జూన్ 2: ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈసీ ఆంక్షల నేపథ్యంలో పోలీసుశాఖ 144వ సెక్షన్, 30 పోలీస్‌యాక్టును అమలు చేయటంలో ప్రజలు సహకరించాలని సీఐ వెంకటేశ్వరావు అన్నారు. పట్టణంలోని ప్రధాన వీదుల్లో ప్రత్యేక బలగాలు, పోలీసులతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చటం వంటివి నిషేధమని తెలిపారు. వీటిని ఉల్లంఘించిన వారిపై 30పోలీస్ యాక్టు కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీల గెలుపు, ఓటములపై చర్చలు చేయటం, ఆ క్రమంలో ఇరువర్గాలు కవ్వింపు మాటలు, వాగ్వివాదాలు చేసుకోవటం వంటి వాటిని కూడా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద పరిగణించబడతాయని తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పోలీస్ పికెటింగ్, ప్రత్యేక బలగాల పహారా ఉంటుందన్నారు. అనంతరం కనిగిరి మండలంలోని చాకిరాల, పేరంగుడిపల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ త్యాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుంటిగంగలో సుహాసినీ పూజలు

తాళ్లూరు, జూన్ 2 : పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగలో దేవదాయ, ధర్మాదాయశాఖ నూతన ఒరవడితో గంగమ్మతల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టింది. అందులోభాగంగా ఆదివారం అమ్మవారి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని సామూహిక సుహాసినీ పూజలు నిర్వహించారు. పలుగ్రామాలకు చెందిన 108 మంది ముత్తైదువలు సుహాసినీ పూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజాకార్యక్రమాలను తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సీఐ రామకోటయ్య గుంటిగంగమ్మను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకపూజారులు కామేశ్వరశర్మ, ప్రకాష్ పంతులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి



సుహాసినీ పూజల్లో పాల్గొన్న ముత్తైదువలు

కార్యకర్తలకు అండగా ఉంటాం : బాబు



చంద్రబాబును సన్మానిస్తున్న కోటపాటి జనార్దన్‌రావు

పామూరు, జూన్ 2: టీడీపీ గెలుపుకోసం అహర్నిశలు కష్టించి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని చంద్రబాబు నాయుడు తెలిపినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును ఆదివారం తాడేపల్లిలో కోటపాటి జనార్దనరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలో పరిశీలికులుగా పనిచేసిన సందర్భంగా పార్టీ గెలుపుపై చంద్రబాబుతో చర్చించినట్లు కోటపాటి తెలిపారు. పూతలపట్టు, కనిగిరి ప్రాంత అభివృద్ధిపై మాట్లాడినట్లు చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లు, పార్టీశ్రేణులు అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు నాయుడు సూచించినట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు తెలిపారు.

కొత్తపాలెంలో చోరీ

» 7సవర్ల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

తాళ్లూరు, జూన్ 2: వేసవి ఉక్కకు ఆరుబయట నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఇంటిలోకి ప్రవేశించి బంగారం, నగదు అపహరించారు. ఈఘటన శనివారం అర్ధరాత్రి మండలంలోని కొత్తపాలెంలో చోటుచేసుకుంది. ఆదివారం ఎస్సై వైవీ రమణయ్య సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. గ్రామంలోని కోటసుబ్బారెడ్డి(మన్నెన్నగారి) ఇంటిలో అర్ధరాత్రి సమయంలో దుండగులు ఇంటివెనుక చెక్క తలపు గడియలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి సేఫ్ లాకర్‌లో ఉంచిన ఏడు సవర్ల బంగారు ఆభరణాలను, కొంత నగదును అపహరించారు.

ఉదయం నిద్ర లేచిన సుబ్బారెడ్డి కుటుంబీకులు తలుపులు తీయగా ఇంటి వెనుక తలుపు తీసి ఉండటం, బీరువా తలపులు తీసి ఉండటం గమనించి చోరీ జరిగినట్లు గుర్తించారు.పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్సై రమణయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి వేలి ముద్ర నిపుణులను రప్పించి దుండగుల వేలి ముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై రమణయ్య



జ్యోతుల ప్రదర్శనలో పాల్గొన్న భక్తులు



చౌడేశ్వరీ అమ్మవారు

ఘనంగా జ్యోతుల ప్రదర్శన

కురిచేడు, జూన్ 2: మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామంలోని చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులు రెండు రోజులపాటు ఘనంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జ్యోతుల ప్రదర్శన జరిగింది. మొత్తం 49 జ్యోతుల ప్రదర్శన జరిగింది. ఈ కొలుపులలో జ్యోతుల ప్రదర్శన కీలకంగా ఉంటుంది. కొలుపులలో పాల్గొనడానికి వేలాదిగా ప్రజలు పరిసర గ్రామాల నుంచి వచ్చారు. ఆదివారం వారందరికి గ్రామస్థులు భోజన వసతి కల్పించారు. ఈసారి చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా నాగమ్మ అమ్మవారికి పూజలు



అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం

కురిచేడు, జూన్ 2: కురిచేడులోని శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమతే కాళహస్తీశ్వర ఆలయం సమీపంలో గత సంవత్సరం నాగమ్మ పుట్టవద్ద భక్తులంతా కలసి నాగమ్మ విగ్రహం ప్రతిష్ఠించి ఆలయం నిర్మించారు. ఆదివారం నాగమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ చేయించిన అనంతరం కల్యాణం నిర్వహించారు. తదనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. శివాలయం అర్చకులు కురిచేటి సుబ్బారావు ఆధ్వర్యంలో గ్రామస్థులంతా కలసి వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

నారాయణస్వామికి పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 2: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు ముందుగా దేవస్థానం ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకుమతో పూజలు చేశారు. కార్యక్రమాల్లో దేవస్థాన పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి



పోలీసులు నిర్వహిస్తున్న విన్యాసాలను తిలకిస్తున్న ఎస్పీ హైమావతి

దర్శి, జూన్ 2: ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా స్పెషల్ ఎస్పీ డి.హైమావతి సూచించారు. దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక పోలీసు దళాలు నిర్వహించిన విన్యాసాలను ఆమె తిలకించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం సమస్యాత్మక గ్రామాల్లో గొడవలు జరిగే అవకాశాలను గుర్తించి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎక్కడైనా గొడవలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందితే ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సహకరించాలి

దర్శి, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దర్శి నియోజకవర్గంలో చెదురుముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. అధికారులు కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఫలితాల అనంతరం గ్రామాల్లో గొడవలు జరగకుండా ప్రజలు సమన్వయం పాటించాలన్నారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పామూరు, జూన్ 2: పామూరులో ఓవ్యక్తి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఆదివారం సాయంత్రం స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపారు. పట్టణంలో మద్యం బాటిళ్లను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతనివద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏజెంట్ల శిక్షణ శిబిరంలో పాల్గొన్న టీడీపీ నేతలు

పామూరు, జూన్ 2 : రేణిగుంటలో ఆదివారం జరిగిన టీడీపీ జోన్ 4 పోస్టల్ బ్యాలెట్ ఏజెంట్ల శిక్షణ శిబిరంలో పామూరు పట్టణ ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, నీరుకట్టు నాయబ్‌రసూల్, కనిగిరి నియోజకవర్గం నుంచి పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. కౌంటింగ్ సందర్భంగా టీడీపీ కూటమి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారని వెంకటేష్ తెలిపారు.

గాలివాన బీభత్సం


తర్లుపాడులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

• నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు • అంధకారంలో తర్లుపాడు • వేసవి ఉక్కపోతల నుంచి ప్రజలకు ఉపశమనం

తర్లుపాడు, జూన్ 2: తర్లుపాడులో ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా పెనుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఎన్నడూ లేని విధంగా 20 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వృక్షాలు సైతం నేలకొరిగాయి. దీంతో తర్లుపాడు అంధకారంలో ఉంది. తర్లుపాడులోనే 8 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పెనుగాలుల బీభత్సానికి బ్యారన్ రేకులు, చెట్లు, పాకాల వంటివి కూలిపోయాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. రైల్వే గేటు వద్ద ఉన్న గోసు వెంకటేశ్వర్లు ఇంటిపై భారీ వృక్షం విరిగిపడింది. దీంతో ఆ సమయంలో బయట ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ముదిరాజ్ కాలనీ, మెయిన్ బజార్, పోలేపల్లె, ముస్లిం వీధుల్లో, ఎస్సీ పాలెంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. దీంతో తర్లుపాడు 24 గంటల పాటు అంధకారంలో ఉంటుందని ఏఈ హనుమాన్‌నాయక్ తెలిపారు. కొత్త విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్తును పునరుద్ధించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. విద్యుత్ లేకపోవటంతో మంచినీటికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

కంభంలో వర్షం - ఉపశమనం పొందిన ప్రజలు

కంభం : వారం రోజులుగా తీవ్రమైన వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన కంభం మండల ప్రజలకు ఉపశమనం కలిగిస్తూ ఆదివారం సాయంత్రం 3 గంటలకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. జూన్ మొదట్లోనే వర్షం పడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గాలులకు విద్యుత్‌లైన్లు తెగి కింద పడడంతో అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేశారు.

చల్లబడిన వాతావరణం

గిద్దలూరు : రోహిణి కార్తె ఎండలతో వారం రోజులపాటు ప్రజలు ఇబ్బందులు పడగా ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి, చల్లటి గాలులతో సేద తీరారు. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడం, రుతుపవనాల ప్రభావంతో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా చల్లటి గాలులు వీచి వర్షం కురవడంతో ప్రజలు సేదతీరారు. వారం పాటు ఉక్కపోతలు, అధిక ఉష్ణోగ్రతలతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు సతమతం కాగా రుతుపవనాల రాకతో చల్లటి గాలులతో ప్రజలు సేదతీరారు.


తర్లుపాడులో ఓ ఇంటిపై కూలిన భారీ వృక్షం

కారు, బస్సు ఢీ.. ఇద్దరికి గాయాలు

కంభం, జూన్ 2 : ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు- కారు ఢీ కొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు కంభం ఎస్సై పులి రాజేష్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు, అనంతపురానికి చెందిన కృష్ణారెడ్డి, రాఘవ కారులో శ్రీశైలం వెళుతున్నారు. మార్కాపురం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు జంగంగుంట్ల సమీపంలో ఎదురుగా ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలైనట్లు ఎస్సై తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కారు, ఆటో ఢీ, ఒకరికి గాయాలు

త్రిపురాంతకం జూన్ 2: వేగంగా వెళుతున్న ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో కారు ముందుభాగం దెబ్బతిని ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని దూపాడు సమీపంలోని సాగర్ కాలువ వద్ద ఆదివారం చోటుచేసుకొంది. గుంటూరు నుంచి మార్కాపురం వెళుతున్న కారును ఎదురుగా వస్తున్న ఆటో అదుపుతప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని మార్కాపురం వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై పోలీసులు పోలీసులు వివరాలు సేకరించారు.

ఎన్‌సీసీ క్యాంపులో పేస్ విద్యార్థుల ప్రతిభ


క్యాడెట్లను అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు(విద్య), జూన్ 2: ఒంగోలు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో జరిగిన ఎన్‌సీసీ 34 బెటాలియన్ క్యాంపులో స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాల క్యాడెట్లు బహుమతులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ క్యాంపునకు జిల్లా నుంచి మొత్తం 700మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టెంట్ ఫిక్సింగ్, ఫైరింగ్, టగ్ ఆఫ్ వార్‌పోటీలు నిర్వహించారు. పేస్ కళాశాల విద్యార్థులు టెంట్ ఫిక్సింగ్ పోటీలో బాలురు కేవలం 8.34 నిమిషాల్లో టెంట్ ఫిక్స్ చేసి మొదటి స్థానంలో నిలిచారు. టగ్‌ఆఫ్‌వార్‌లో బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే. మూర్తి, డీన్ చైతన్య, ఆర్.వీరాంజనేయులు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, పృ దీన్‌కృష్ణ విద్యార్థులను అభినందించారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ విజేత కోటి ఫ్రెండ్స్


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దాతలు

నాగులుప్పలపాడు, జూ న్ 2: రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో చీ రాల కోటి ఫ్రెండ్స్ జట్టు వి జేతగా నిలిచింది. ఉప్పు గుండూరులో విద్యానగర్ ఆధ్వర్యంలో జేవైఎస్, రాజే ష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ని ర్వహించిన రాష్ట్రస్థాయి టె న్నిస్‌బాల్ క్రికెట్ పోటీలలో భాగంగా ఆదివారం చీరాల కోటి ఫ్రెండ్స్, విద్యానగర్ సీనియర్స్ జట్ల మధ్య ఉత్కంఠంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కోటి ఫ్రెండ్స్ గెలి చింది. ప్రథమ బహుమతి రూ.40,116ని కైవసం చేసుకుంది. రెండో బహుమతి విద్యానగర్ సీనియర్స్ రూ.30,116, మూడవ బహుమతి ఉప్పుగుండూరు లెవన్ బులెట్స్ రూ.20,116, నాల్గవ బహుమతి బూరేపల్లి యూత్ రూ.10,116 అందుకొ న్నాయి. విజేతలకు దాతల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌లకు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో మద్దిసాని నాగేశ్వరరావు, గద్దల ఉదయ్, గద్దె పెద సుబ్బారావు, పైనం జయబా బు, గద్దె శేషయ్య, నాగమల్లేశ్వరరావు, తెలగతోటి పృథ్వి, గుణ పాల్గొన్నారు.

ఎంఈవో ఇంటిలో చోరీ

• 20వేలు నగదు, 5 సవర్ల బంగారం అపహరణ


ఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

పెద్ద దోర్నాల, జూన్ 2: త్రిపురాంతకం ఎంఈవో మల్లికార్జున ఇంట్లో దొంగలు పడి రూ.20 వేల నగదు, 5సవర్ల బంగారం అపహరించుకు పోయారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. దోర్నాలకు చెందిన త్రిపురాంతకంలో ఎంఈవోగా పని చేస్తున్న టీ మల్లికార్జుననాయక్ కుటుంబసభ్యులతో కలిసి గత నెల 28న బంధువుల ఊరికి వెళ్లారు. శనివారం సాయంత్రం తిరిగి వచ్చాడు. ఇంటి తాళం పగుల గొట్టి, బీరువా తెరిచి ఉండడంతో ఆందోళన చెందిన నాయక్ ఇంటి పరిసరాలు పరిశీలించారు. 20 వేల నగదు, 5సవర్ల బంగారం దోపిడికి గురైనట్లు గుర్తించారు. తన ఇంటికి ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు. దొంగలు వాటి తీగలు కత్తిరించారు. దీంతో వెంటనే పోలీసుస్టేషనులో పిర్యాధు చేశారు. ఎస్సై అంకమరావు ఆదివారం క్లూస్ టీంను రప్పించాడు. ఎస్సై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అపరిశుభ్రంగా ఎర్రగొండపాలెం వీధులు

ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోతున్న చెత్త

ఎర్రగొండపాలెం, జూన్ 2 : ఎర్రగొండపాలెం మేజరు పంచాయతీలో వీధుల వెంబడి వేసిన చెత్త సక్రమంగా తొలగించడం లేదు. దీంతో అక్కడ చెత్తకుప్పలు తయారు అవుతున్నాయి. ఎర్రగొడపాలెం మేజరు పంచాయతీలో 22 మంది గ్రీన్ అంబాసిడర్లు, 20 స్వీపర్లు, 8 మంది పంచాయతీ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఎర్రగొండపాలెం పంచాయతీలోని వార్డులలో చెత్తతీసుక వెళ్లే గ్రీన్ అంబాసిడర్లు రెండురోజులకు ఒక వీధికి వస్తున్నందున నివాసగృహాల వారు ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ చెత్త వేస్తున్నారు. ఎర్రగొండపాలెం శివాలయం వద్ద కోనేటి వద్ద చుట్టుపక్కల నివాస గృహాల వారు చెత్త వేస్తుండడంతో అక్కడ అది నిల్వ ఉండి రోడ్డు పక్కన నడిచేవారికి దుర్వాసన వస్తోందని పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. హిందూ శ్మశాన వాటిక రోడ్డుపక్కన, శ్రీనివాస థియేటర్ పక్కన చెత్త పడవేస్తుండడంతో పంచాయతీ రోడ్లపక్కన అపరిశుభ్రంగా ఉండడమే కాకుండా దుర్వాసన, అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లవెంబడి వేసిన చెత్తను మూడురోజులకు, నాలుగు రోజులకు తొలగించడం వలన చెత్త కుప్పల నుంచి వచ్చే చెడువాసనలతో ఆ చుట్టుపక్కల నివాస గృహాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతివార్డులో ప్రతి రోజు చెత్తబండిలో పంచాయతీ స్వీపర్లు చెత్తను బయటకు తీసుకువెళ్లి, ఊరిబయట పడవేయాలని ప్రజలు పంచాయతీ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి

రోడ్లపక్కన వేసిన చెత్తను రెండురోజులకు ఒక పర్యాయం తొలగిస్తున్నారని పంచాయతీ కార్యదర్శి రాజశేఖరరెడ్డి తెలిపారు.


కోనేటి వీధిలో రోడ్డు పక్కనే పేరుకు పోయిన చెత్త

పొదిలిలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

చోద్యంచూస్తున్న అధికారులు

పొదిలి, జూన్ 2 : మండలంలోని ఇసుక మాఫియాకు అడ్డుఅదుపులేకుండా పోతోంది. రోజురోజుకు అక్రమ ఇసుక రవాణాలో అంతే లేకుండా పోతుంది. తమను అడ్డగించేదెవ్వరో చూస్తాం అంటూ ఇష్టారాజ్యంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధికారులను మామూళ్ల మత్తులో పెట్టి రోజుకు పదుల సంఖ్యలో ఇసుక ట్రక్కులను తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. వైసీపీ నాయకుల అండ దండలతో ఈ అక్రమ రవాణా సాగుతోంది.

మండలంలో మూసివాగు ప్రాంతాలు ముఖ్యంగా తలమళ్ల, అన్నవరం, నిమ్మవరం, కొస్టాలపల్లి, ఏలూరు, సల్లూరు, ఈగలపాడు, గ్రామాలలో ఇసుక సమృద్ధిగా దొరుకుతోంది. దీంతో ఈ గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమార్కులు ఇసుకను తోడేస్తున్నారు. వాగుప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ఆవిధంగా ఇసుక వ్యాపారం అక్రమార్కులకు పాడికుండలా జోరుగా సాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం ఇక్కడ తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి. అక్రమార్కులు ఇసుకను తవ్వకొని బైట ప్రదేశాల్లో రీచ్‌లు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపణలున్నాయి. ఆ ప్రాంతాలు అధికారులకు తెలిసినా అక్కడకు వెళ్లే సాహసం చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక వేళ ఎవరైనా అధికారి వెళ్లి అడ్డగించినా, అధికార పార్టీ ముఖ్య నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో వెనక్కు తగ్గాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. దీంతో అక్రమార్కులకు అధికారుల అడ్డుకూడా లేకపోవడంతో మూసి నదిని తోడేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూసివాగు ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా దందాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మూసిలో అక్రమంగా తవ్వుతున్న ఇసుక

అధ్వానంగా సప్లై చానెల్

- వృథాగా పోతున్న నీరు
- ఐదేళ్లగా మరమ్మతులు కరువు
- అల్లుకపోయిన చిల్లకంప

పుల్లలచెరువు, జూన్ 2: మండలంలో పలు చెరువులకు నీరందించే సప్లై ఛానెల్స్ అధ్వానం గా ఉన్నాయి. ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక పోవడంతో సప్లై ఛానెల్స్ నుంచి చెరువులకు నీరు చేరడం లేదు. మండలంలోని చాపలమడుగు-త్రిపురాంతకం సప్లై చానెల్ మరి అధ్వానంగా తయారైంది. ఐదేళ్లలో ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో చిల్లకంప పెరిగింది. ఈ సప్లై ఛానెల్ ద్వారా పుల్లలచెరువు మండలంలోని చెన్నంపల్లి, త్రిపురాంతకం మండలంలోని రామసముద్రం, త్రిపురాంతకం చెరువులకు వరద నీరు చేరే విధంగా బ్రిటిష్ కాలంలోనే కాలువ ఉంది. అయితే మరమ్మతులు చేపట్టకపోవడంతో చాపలమడుగు వద్ద కాలువ తెగిపోయి నీరు వృథాగా పోతోంది. దీంతో చెరువులకు వచ్చే నీరు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించి చెరువులకు నీరు అందేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.


సప్లయ్ చానల్‌లో పేరుకుపోయిన చెత్త

కుమారుడిని కాల్చి చంపిన కానిస్టేబుల్ అరెస్టు

• తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి వెల్లడి

ఒంగోలు(క్రైం), జూన్ 2: కన్న కుమారుడినితు పాకీతో కాల్చి చంపిన ఏఆర్ కానిస్టేబుల్ కొదమల ప్రసాద్‌బాబును అరెస్టు చేసినట్లు ఒంగోలు తా లుకా సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు. శనివారం రా త్రి స్థానిక భాగ్యనగర్ 4వ లైన్‌లో గల వీవీ పాడ్స్ రిజర్వుడ్ గోదాం వద్ద విధులలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్‌బాబు తన కుమారుడు శేషుకమల్ (20)ని తుపాకీతో కాల్చి దారుణంగా చంపాడు. వివరాలలోకి వెళితే.. మద్య సేవించిన ప్రసాద్‌బాబును కుమారుడు శేషుకమల్ వారు నివాసం ఉండే స్థానిక శ్రీనివాసకాలనీ ఒకటో లైన్‌లో నుంచి మోటార్‌సైకిల్‌పై తీసుకొచ్చి విధులు నిర్వహించే గోదాం వద్ద వదిలిపెట్టాడు. అయితే ప్రసాద్‌బాబు తన జీతం రూ.20వేలు నగదును డ్రా చేసి తన వద్ద ఉంచుకున్నాడు. దీంతో ఆ నగదును మద్యం తాగిన తన తండ్రి వద్ద ఎందుకని కుమారుడు ప్రశ్నించడంతో వారి మధ్య వివాదం జరిగింది. ఈక్రమంలో కోపోద్రేకుడైన ప్రసాద్‌బాబు తన వద్ద ఉన్న రివాల్వర్‌తో రాత్రి 10 గంటల సమయంలో కుమారుడి పై ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. దీంతో బులెట్ ఛాతీపై తగలడంతో శేషుకమల్ అక్కడిక్కడే కుప్పకూలాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే కుమారుడిపై కాల్పులు జరిపిన ప్రసాద్‌బాబు తన వద్ద ఉన్న రివాల్వర్‌తో మరలా అక్కడ విధులలో ఉన్న వారిని సైతం బెదిరించాడు. ఈ సమయంలో అక్కడ ఉన్న కానిస్టేబుళ్లు చాకచక్యంగా ప్రసాద్‌బాబు వద్ద ఉన్న ఆయుధాన్ని తీసుకొని మరో ప్రమాదం జరగకుండా జాగ్రత్తపడ్డారు. ఈ మేరకు అదుపులోకి తీసుకున్న ప్రసాద్‌బాబును అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సీఐ భక్తవత్సలరెడ్డి వెల్లడించారు.

వసతులు లేని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

• పదిహేనేళ్లుగా అభివృద్ధికి నోచుకోని దైన్యం • తాత్కాలిక గదుల్లోనే నేటికీ తరగతులు • కలగానే నూతన భవన నిర్మాణం

కంభం, జూన్ 2 : వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చాయి. ఈ నెల 13వ తేదీ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు డిగ్రీ కళాశాల కూడా పునఃప్రారంభం కానున్నాయి. కానీ కంభంలో 15 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎప్పటిలాగే విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను కార్పోరేట్ సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతామన్న లక్ష్యం ఆమడదూరంలో ఉంటోంది. చాలీచాలని గదుల్లో విద్యార్థులు విద్యను అభ్యసించాల్సిన దుస్థితి ఏర్పడింది. కొంతమంది పోరాట ఫలితంగా 15 సంత్సరాలకిత్రం 1989లో కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. అన్ని వసతులు ఉండేలా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేవరకు తాత్కాలికంగా కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండే ప్రాంగణంలోనే 6 అదనపు గదులు ఉండే ప్రాంతాన్ని డిగ్రీ కళాశాలకు కేటాయించారు. తరువాత చిన్నకంభం పంచాయతీలో కొండ పక్కన డిగ్రీ కళాశాల నిర్మాణానికి 10 ఎకరాల స్థలం కేటాయించారు. అయితే విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అనుమతులు రద్దు చేశారు. పాత స్థలంలోనే 7 ఎకరాల క్రీడామైదానం ఉంది కావున అందులో 2 ఎకరాలు డిగ్రీ కళాశాల నిర్మాణానికి కలెక్టర్‌కు, విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. కానీ నేటివరకు ఎటువంటి స్పందన లేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల్లో లేకపోవడంతో ఆయా మండలాల నుంచేకాక అర్ధవీడు, బేస్తవారపేట, తురిమెళ్ల మండలాల నుంచి కూడా కంభం డిగ్రీ కళాశాలకు వస్తుంటారు. కానీ 6 గదులు ఉన్న ఈ డిగ్రీ కళాశాలలో సరైన వసతులు లేకపోవడంతో పలువురు విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో చేరుతున్నారు. కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 12 మంది అనుభవం ఉన్న రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. ఈ ఏడాది నుంచి డిగ్రీ కోర్సు పూర్తి చేయాలంటే 3 నుంచి 4 సంవత్సరాలకు ప్రభుత్వం పెంచింది. బీఎస్సీ హానర్ జువాలజీ, బీఏ హానర్స్ హిస్టరీ, బికాం కంప్యూటర్స్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు.


1935లో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల


డిగ్రీ విద్యార్థుల కోసం కేటాయించిన తరగతి గదులు

అదనపు గదుల నిర్మాణానికి నివేదికలు



కళాశాలలో గదుల కొరత గురించి కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రస్తుతం ఆరు గదులు విద్యార్థులకు సరిపోవడం లేదన్నారు. ఆరు మండలాల నుంచి విద్యార్థులు వస్తున్నారని, పక్కనే ఉన్న క్రీడామైదానంలో 2 ఎకరాలు కేటాయించాలని కలెక్టర్‌కు, విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు అందచేసినట్లు తెలిపారు.

అవీ..ఇవీ..

మహిళలు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి


మాట్లాడుతున్న హరిహరరావు

మార్కాపురం వన్ టౌన్, జూన్ 2: మహిళలు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు గోపాలుని హరిహరరావు అన్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సమరోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. ఏటా మే నెలలో హిందూ యువతులకు దుర్గా వాహిని ద్వారా మానసిక, శారీరక శిక్షణ ఇచ్చి తమను తాము రక్షించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. దేశం, ధర్మంతో పాటు కుటుంబ వ్యవస్థను చక్కగా తీర్చుదిద్దుకునే వ్యక్తిత్వాన్ని పెంపొందించేలా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో మార్కాపురం జిల్లా దుర్గా వాహిని నాయకురాలు గోళ్ల అపర్ణ, వీహెచ్‌పీ నాయకులు కోటేశ్వరరావు, ఇమ్మడిశెట్టి వీరారావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

గిద్దలూరు, జూన్ 2 : రాచర్ల మండలం అనుమలవీడు గ్రామంలోని రెండు నిరుపేద కుటుంబాలకు యూత్ సోషల్ సర్వీస్ సేవాసంస్థ నిత్యవసర వస్తువులు పంపిణీ చేసి ఆదుకొంది. కార్యక్రమంలో సేవాసంస్థ ప్రతినిధులు, దాతలు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

గిద్దలూరు, జూన్ 2 : గిద్దలూరులోని శాఖగ్రంథాలయంలో ఆదివారం సైతం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కథలు ఎలా రాయాలి..? అనే అంశంపై అవగాహన కల్పించారు. స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించారు. బిజినెస్ గేమ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఫ్యాకల్టీ రామిరెడ్డి, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

పింఛనర్లతో సమావేశం


ప్రసంగిస్తున్న బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ

గిద్దలూరు, జూన్ 2 : పట్టణంలోని రిటైర్డ్ హోంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సమావేశమయ్యారు. బ్యాంక్‌లో అందించే సేవలను వివరించారు. డిపాజిట్లపై వడ్డీ రేట్లను ఇస్తున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు లభించే రుణాలను వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రవీంద్రనాథ్‌రెడ్డి, కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 2: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అవసరం


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 2: విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు విజ్ఞానం పెంపొందించే పుస్తక పఠనం అవసరమని ఉపాధ్యాయులు ఒద్దుల రవిశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానికశాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ, పుస్తకాలు చదువడం అలవాటుగా చేసుకోవాలన్నారు. వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకుని మంచి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు పుస్తకాలు చదవడం, సమీక్షా తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా హనుమజ్జయంతి


స్వామివారికి బహూకరించిన ఒంటె వాహనం

మార్కాపురం వన్ టౌన్, జూన్ 2: పట్టణంలోని కోనేటి వీధిలో వెలసిన కుమారాంజనేయస్వా మి ఆలయంలో హనుమ జ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ఒంటె వాహనాన్ని ఇమ్మడిశెట్టి నాగేశ్వరరావు దంపతు లు సమర్పించారు. అనంతరం పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ నిర్వహించారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిషేధం

వెలిగండ్ల, జూన్ 2: ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతిలేదని ఎస్ఐ శివ తెలిపారు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా గ్రామ సభలతో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

పీసీపల్లి: ఎన్నికల కౌంటింగ్ అనంతరం గెలుపు సంబరాలు, విజయోత్సవ ర్యాలీలలకు అనుమతి లేదని ఎస్సై రమేష్‌బాబు అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 4న కౌంటింగ్ సందర్భంగా 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇద్దరు వ్యక్తులకు మించి ఎక్కువమంది గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. రంగులు చల్లుకోవడం, బాణ సంచా కాల్చడం వంటివి నిషేధించినట్లు చెప్పారు.

సామాజిక మాధ్యమాల్లో ఇతరులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనంతో ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

పామూరులో భారీ వర్షం

పామూరు, జూన్ 2: పామూరు పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో సుమారు అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం ధాటికి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలి లేకపోవడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వైన్‌షాపుల వద్ద మందుబాబులు క్యూ


వైన్ షాపు ముందు మందుబాబులు

కురిచేడు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఈనెల 3 నుంచి 5వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలను మూడురోజులపాటు మూసివేస్తున్నారు. దీంతో ఆదివారం మందుబాబులు వైన్ షాపుల ముందు క్యూ కట్టారు. దీనికితోడు పడమర వీరాయపాలెంలో చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులు ఉండటంతో వైన్‌షాపుల వద్ద రద్దీ ఏర్పడింది. వైన్ షాపుల ముందు మందుబాబుల గుంపులు చూసి ప్రజలు అవాక్కయ్యారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి

పీసీపల్లి, జూన్ 2: వడదెబ్బకు వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి మండలంలోని తలకొండపాడులో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ముప్పూరి మాలకొండయ్య(80) శనివారం మధ్యాహ్నం ఎండతీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు. ప్రైవేట్ వైద్యుని వద్ద చికిత్స చేయించినా వడదెబ్బకు గురైన మాలకొండయ్య ఆ రోజు రాత్రికి మృతి చెందాడు.

గదుల నిర్మాణానికి విరాళం

పామూరు, జూన్ 2: స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి సీఎస్‌పురం మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి సతీమణి జ్ఞాపకార్థం రూ.5,1116ల విరాళాన్ని ఆదివారం ప్రకటించారు.

ఈమేరకు శిశుమందిర్ నిర్వాహకులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఎం.గంగరాజు, వాసవీమాత దేవస్థాన అధ్యక్షుడు వై.బాలకొండలరావు, రఘుపతి దరిశిమస్తాన్‌రావు, తోట రవికుమార్, గోస్టు దయాసాగర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలతో..

టీడీపీ కూటమిలో జోష్

» వైసీపీలో అంతర్మథనం

దర్శి, జూన్ 2: ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలపై టీడీపీ కూటమి క్యాడర్ జోష్‌లో ఉన్నారు. రాష్ట్రంతో పాటు దర్శి నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధిస్తుందని అధికశాతం ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంతో టీడీపీ కూటమి అధికారంలోకి రావటం ఖాయమని భావిస్తున్నారు. అలాగే, దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజయం సాధిస్తారని అధికశాతం ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించటంతో టీడీపీ కూటమి క్యాడర్ ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఎక్కడచూసినా టీడీపీ మద్దతుదారులు ఈ విషయంపై చర్చించుకుంటున్నారు.

ఆదేసమయంలో ఎగ్జిట్‌పోల్స్‌పై వైసీపీ క్యాడర్ నిశితంగా పరిశీలిస్తుంది. కొద్దిమంది మాత్రమే వైసీపీ గెలుస్తుందని చెప్పటంతో వారు అంతర్మథనంలో పడ్డారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వస్తుందనే నమ్మకం వారిలో సన్నగిల్లింది. దర్శిలో వైసీపీ గెలుస్తుందని ఇప్పటి వరకు ధీమాగా ఉన్న ఆ పార్టీ క్యాడర్ ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలతో అంతర్మథనంలో పడ్డారు. ఏమి జరుగుతుందోనని ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. కొంతమంది ఎవరికి రాసిపెట్టి ఉంటే వారు గెలుస్తారని వేదాంతం చెబుతున్నారు. నిన్నమొన్నటి వరకు గెలుపుపై బల్లగుద్ది ధీమా వ్యక్తం చేసిన వైసీపీ క్రమేపీ ఫలితాలు ఎలా ఉంటాయోనని గుబులు చెందుతున్నారు.

దర్శిలో వైసీపీ అభ్యర్థి గెలుపుపై, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుపై ఆపార్టీ క్యాడర్ కోట్లాది రూపాయలు పందెలు పెట్టిన విషయం తెలిసిందే. అంతేకాక టీడీపీ కూటమి సానుభూతిపరులు పార్టీ అధికారంలోకి వస్తుందని ఎదురు పందెంపెట్టారు. ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలతో పందెం రాయుళ్లల్లో ఏం జరుగుతుందోనని ఆందోళనలు మొదలయ్యాయి. వచ్చే మంగళవారం కౌంటింగ్ జరగనున్నందున అప్పటివరకు ఈ చర్చ కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రశాంతంగా కౌంటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలి

దర్శి, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని దర్శి అసెంబ్లీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్, ఒంగోలు, సంతనూతలపాడు అభ్యర్థులు దామచర్ల జనార్దన్, విజయకుమార్ జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం ఒంగోలులో వారు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు. అందుకు స్పందించిన కలెక్టర్ దినేష్ కుమార్ కౌంటింగ్‌కు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎవరైనా ఏజెంట్లు గొడవలు చేస్తే తక్షణమే బయటకు పంపుతామని తెలిపారు. ఇందుకుసంబంధించి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.


కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్, దామచర్ల జనార్దన్, విజయకుమార్

ఈసీ ఆంక్షలను గౌరవించాలి!

» టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరగనున్న సందర్భంగా ఈసీ విధించిన ఆంక్షలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు గౌరవించాలని మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహా రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక భాగం మాత్రమేనని, ప్రతిఒక్కరూ ప్రభుత్వాధికారులకు సహకరించాలని కోరారు.

ఎన్నికల ఆంక్షలలో భాగంగా కనిగిరి ప్రాంతంలో విధించిన 144వ సెక్షన్, 30పోలీస్ యాక్టును గౌరవించి పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు. టీడీపీ కార్యకర్తలు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తారని పోలీసుశాఖ గుర్తించేలా నడుచుకోవాలని డాక్టర్ ఉగ్ర ఆకాంక్షించారు.


మార్కాపురం దర్గాలో దీపాలు వెలిగిస్తున్న డాక్టర్ ఉగ్ర

మార్కాపురంలో డాక్టర్ ఉగ్ర ప్రత్యేక పూజలు

మార్కాపురంలో హజరత్‌ఖాసీం స్వాములు దర్గాలో డాక్టర్ ఉగ్ర ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దర్గాలో దీపాలు వెలిగించి ప్రార్థనలు చేశారు. రాష్ట్రానికి సంక్షేమ పాలన అందించే టీడీపీ అఖండ మెజార్టీతో సీట్లు సాధించి, చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థించారు. ప్రార్థనలు చేసినవారిలో టీడీపీ కూటమి అభ్యర్థులు దామచర్ల జనార్దన్, గొట్టిపాటి రవికుమార్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబు, తదితరులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

» సీఐ వెంకటేశ్వరరావు

కనిగిరి, జూన్ 2: ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈసీ ఆంక్షల నేపథ్యంలో పోలీసుశాఖ 144వ సెక్షన్, 30 పోలీస్‌యాక్టును అమలు చేయటంలో ప్రజలు సహకరించాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రత్యేక బలగాలు, పోలీసులతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చటం వంటివి నిషేధమని తెలిపారు. వీటిని ఉల్లంఘించిన వారిపై 30పోలీస్ యాక్టు కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీల గెలుపు, ఓటములపై చర్చలు చేయటం, ఆ క్రమంలో ఇరువర్గాలు కవ్వింపు మాటలు, వాగ్వివాదాలు చేసుకోవటం వంటి వాటిని కూడా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద పరిగణించబడతాయని తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పోలీస్ పికెటింగ్, ప్రత్యేక బలగాల పహారా ఉంటుందన్నారు. అనంతరం కనిగిరి మండలంలోని చాకిరాల, పేరంగుడిపల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ త్యాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పేరంగుడిపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

గుంటిగంగలో సుహాసినీ పూజలు

తాళ్లూరు, జూన్ 2 : పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగలో దేవదాయ, ధర్మాదాయశాఖ నూతన ఒరవడితో గంగమ్మతల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టింది. అందులోభాగంగా ఆదివారం అమ్మవారి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని సామూహిక సుహాసినీ పూజలు నిర్వహించారు.

పలుగ్రామాలకు చెందిన 108 మంది ముత్తైదువలు సుహాసినీ పూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజాకార్యక్రమాలను తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సీఐ రామకోటయ్య గుంటిగంగమ్మను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకపూజారులు కామేశ్వరశర్మ, ప్రకాష్ పంతులు, తదితరులు పాల్గొన్నారు.


పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి


సుహాసినీ పూజల్లో పాల్గొన్న ముత్తైదువలు

కార్యకర్తలకు అండగా టీడీపీ


చంద్రబాబును సన్మానిస్తున్న కోటపాటి

పామూరు, జూన్ 2: టీడీపీ గెలుపుకోసం అహర్నిశలు కష్టించి కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని చంద్రబాబు తెలిపినట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును ఆదివారం తాడేపల్లిలో కోటపాటి జనార్దనరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈసందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గంలో పరిశీలికులుగా పనిచేసిన సందర్భంగా పార్టీ గెలుపుపై చంద్రబాబుతో చర్చించినట్లు కోటపాటి తెలిపారు. పూతలపట్టు, కనిగిరి ప్రాంత అభివృద్ధిపై మాట్లాడినట్లు చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఏజెంట్లు, పార్టీశ్రేణులు అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు నాయుడు సూచించినట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు తెలిపారు.

కొత్తపాలెంలో చోరీ

» 7సవర్ల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

తాళ్లూరు, జూన్ 2: వేసవి ఉక్కకు ఆరుబయట నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఇంటిలోకి ప్రవేశించి బంగారం, నగదు అపహరించారు. ఈఘటన శనివారం అర్ధరాత్రి మండలంలోని కొత్తపాలెంలో చోటుచేసుకుంది. ఆదివారం ఎస్సై వైపీ రమణయ్య సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. గ్రామంలోని కోటసుబ్బారెడ్డి(మన్నెన్నగారి) ఇంటిలో అర్ధరాత్రి సమయంలో దుండగులు ఇంటివెనుక చెక్కతలుపు గడియలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి సేఫ్ లాకర్‌లో ఉంచిన ఏడు సవర్ల బంగారు ఆభరణాలను, కొంత నగదును అపహరించారు.

ఉదయం నిద్ర లేచిన సుబ్బారెడ్డి కుటుంబీకులు తలుపులు తీయగా ఇంటి వెనుక తలుపు తీసి ఉండటం, బీరువా తలుపులు తీసి ఉండటం గమనించి చోరీ జరిగినట్లు గుర్తించారు.పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్సై రమణయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి వేలి ముద్ర నిపుణులను రప్పించి దుండగుల వేలి ముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై రమణయ్య

ఘనంగా జ్యోతుల ప్రదర్శన


చౌడేశ్వరీ అమ్మవారు

కురిచేడు, జూన్ 2: మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామంలోని చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులు రెండు రోజులపాటు ఘనంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జ్యోతుల ప్రదర్శన జరిగింది. మొత్తం 49 జ్యోతుల ప్రదర్శన జరిగింది. ఈ కొలుపులలో జ్యోతుల ప్రదర్శన కీలకంగా ఉంటుంది. కొలుపులలో పాల్గొనడానికి వేలాదిగా ప్రజలు పరిసర గ్రామాల నుంచి వచ్చారు. ఆదివా రం వారందరికి గ్రామస్థులు భోజన వసతి కల్పించారు. ఈసారి చౌడేశ్వరీ అమ్మవారి కొలుపులకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.


పడమరవీరాయపాలెంలో జ్యోతుల ప్రదర్శన

వైభవంగా నాగమ్మ అమ్మవారి వార్షికోత్సవం


నాగమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకం

కురిచేడు, జూన్ 2: కురిచేడులోని శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయం సమీపంలో గత సంవత్సరం నాగమ్మ పుట్టవద్ద భక్తులంతా కలసి నాగమ్మ విగ్రహం ప్రతిష్ఠించి ఆలయం నిర్మించారు. ఆదివారం నాగమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ చేయించిన అనంతరం కల్యాణం నిర్వహించారు. తదనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. శివాలయం అర్చకులు కురిచేటి సుబ్బారావు ఆధ్వర్యంలో గ్రామస్థులంతా కలసి వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా నారాయణస్వామి పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూన్ 2: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు ముందుగా దేవస్థానం ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకుమతో పూజలు చేశారు. కార్యక్రమాల్లో దేవస్థాన పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి


పోలీసులు నిర్వహిస్తున్న విన్యాసాలను తిలకిస్తున్న జిల్లా స్పెషల్ ఎస్పీ హైమావతి

దర్శి, జూన్ 2: ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా స్పెషల్ ఎస్పీ డి.హైమావతి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక పోలీసు దళాలు నిర్వహించిన విన్యాసాలను ఆమె తిలకించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం సమస్యాత్మక గ్రామాల్లో గొడవలు జరిగే అవకాశాలను గుర్తించి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

ఎక్కడైనా గొడవలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందితే ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

దర్శి జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని దర్శి అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దర్శి నియోజకవర్గంలో చెదురుముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. అధికారులు కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. ఫలితాల అనంతరం గ్రామాల్లో గొడవలు జరగకుండా ప్రజలు సమన్వయం పాటించాలన్నారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పామూరు, జూన్ 2: పామూరులో ఓవ్యక్తి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఆదివారం సాయంత్రం స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపారు. పట్టణంలో మద్యం బాటిళ్లను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతనివద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏజెంట్ల శిక్షణ శిబిరంలో పాల్గొన్న టీడీపీ నేతలు

పామూరు, జూన్ 2 : రేణిగుంటలో ఆదివారం జరిగిన టీడీపీ జోన్ 4 పోస్టల్ బ్యాలెట్ ఏజెంట్ల శిక్షణ శిబిరంలో పామూరు పట్టణ ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, నీరుకట్టు నాయబ్‌రసూల్, కనిగిరి నియోజకవర్గం నుంచి పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. కౌంటింగ్ సందర్భంగా టీడీపీ కూటమి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారని వెంకటేష్ తెలిపారు.





కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళసింగ్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు.

ఓట్ల లెక్కింపునకు.. సన్నద్ధం

- బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- రేపు ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం
- తొలి ఫలితం బాపట్ల.. తుది అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు
- కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచల భద్రత
- నేటి సాయంత్రం నుంచి పోలీసుల వలయంలో బాపట్ల.. ఆంక్షలు అమలు
- అభ్యర్థుల ఇళ్ల దగ్గర, పార్టీ కార్యాలయాల వద్ద పోలీసుల మోహరింపు



కౌంటింగ్ కేంద్రాల్లో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్పీ



కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే దారిలో బారీకేడ్లు

అభ్యర్థుల భవితవ్యం దాగి ఉన్న ఈవీఎంలు మంగళవారం తెరుచుకోనున్నాయి. గెలుపోటములపై అభ్యర్థుల్లో టెన్షన్ ఉండగా.. ఓటర్లలో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల అంకంలో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపునకు గడువు సమీపిస్తోంది. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అభ్యర్థుల జాతకాలు తేల్చే ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉంటూ డేగ కళ్లతో పరిశీలిస్తూ వేగంగా లెక్కలు వేసే ఏజెంట్లను ఆయా అభ్యర్థులు ఎంపిక చేసుకుని వారికి శిక్షణ ఇచ్చి పక్కాగా సిద్ధం చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లతో ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంది. జిల్లాలో 144 సెక్షన్ అమలుతో పాటు కఠినమైన ఆంక్షలతో ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. మద్యం విక్రయాలతో పాటు బాణసంచా అమ్మకాలను నిషేధించారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో ఇతరుల ప్రవేశం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పైగా కౌంటింగ్ కేంద్రం నుంచి 2 కిలోమీటర్ల వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించారు.

బాపట్ల/ బాపట్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన కౌంటింగ్ ఘట్టం మంగళవారం ఉదయం 8 గంటలకు మొదలుకానుంది. మే 13న పోలింగ్ ముగిసిన దగ్గర నుంచి ఫలితాల కోసం ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన క్షణాలకు మరో 24 గంటల్లో తెరపడనుంది. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలతో పాటు, బాపట్ల లోక్‌సభ స్థానం ఓట్ల గణనను కూడా ఇక్కడే చేపట్టనున్నారు. ఇప్పటికే కౌంటింగ్‌కు కావాల్సిన వసతులన్నీ సమకూర్చారు. సిబ్బందికి శిక్షణ తరగతులను దశలవారీగా నిర్వహించి ఎలాంటి అవకతవకలకు ఆస్కారమివ్వకుండా ప్రక్రియ పూర్తి చేయాలనే ఆదేశాలను ఇచ్చారు.

లెక్కింపునకు వెయ్యి మందికిపైగానే..

ఓట్ల లెక్కింపు కోసం పోస్టల్ బ్యాలెట్లకు, ఈవీఎంలకు సిబ్బందిని నియమించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం అదనపు ఏఆర్‌వో, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహించనున్నారు. వీరి సంఖ్య మొత్తం 300గా ఉండనుంది. ఇక ఈవీఎంల విషయానికొస్తే సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లుగా మొత్తం 700 మంది వరకు కౌంటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కానున్నారు. 2,600 మంది పోలీసు సిబ్బంది శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నారు. అదనంగా కేంద్ర బలగాలు, మొబైల్ పార్టీలు కూడా డేగ కళ్లతో పరిశీలించనున్నాయి.

తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు..

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. 8:30కు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల గణన ప్రారంభం కానుంది. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఓట్ల లెక్కింపును చేపడతారు. 202 పోలింగ్ స్టేషన్లకు గాను 15 రౌండ్ల ఓట్ల లెక్కింపుతో తొలి ఫలితంగా బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం వెల్లడి కానుంది. 16 రౌండ్లతో చీరాల, 17 రౌండ్లలో వేమూరు, 19 రౌండ్లు రేపల్లె, పర్చూరు, అద్దంకిలో 22 రౌండ్లతో ఓట్ల లెక్కింపు జరగనుంది. చివరి ఫలితంగా అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు రానున్నాయి

పోలీసు వలయంలో బాపట్ల..

బాపట్ల పట్టణం మొత్తాన్ని పోలీసులు సోమవారం సాయంత్రం నుంచే తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. బాపట్ల, చీరాలలో కూడా అదనపు పోలీసు బలగాలు మోహరించారు. బాపట్లతో పాటు చీరాలలో కూడా పోలీసు ఆంక్షలు అమలులో ఉండను న్నాయి. బాపట్లతో పాటు చీరాలలో కూడా కౌంటింగ్ రోజు ఎలాం టి దుకాణాలు తెరవకూడదని, అత్యవసర సర్వీసులు మినహా మిగిలిన వేటికీ అనుమతి లేదని, ఈ ఆదేశాలను తప్పక పాటిం చాలని పోలీసు శాఖ సూచించింది. ప్రధాన రాజకీయపార్టీల అభ్య ర్థుల ఇళ్ల దగ్గర ఇప్పటికే పోలీసు భద్రత కల్పించారు. పార్టీ కార్యాలయాల వద్ద బలగాలను మోహరించారు. సోమవారం సాయంత్రం మొదలు కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. అభ్యర్థులు, ఏజెంట్లతో పాటు పాస్‌లున్న వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతి ఉందని, పార్టీల శ్రేణులెవ్వరూ బాపట్లకు రావద్దని, విజయోత్సవ ర్యాలీలు కూడా నిషిద్ధమని ఇప్పటికే పోలీసు శాఖ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పట్టణంలోకి ప్రవేశించే సమయంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని సహేతుక కారణం లేకుండా పట్టణంలోకి అనుమతించబోమని పోలీసులు తెలిపారు. ఆంక్షలను ధిక్కరిస్తే కఠిన చర్యలుంటాయని పోలీసు శాఖ హెచ్చరించింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

సెల్‌ఫోన్‌తో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కౌంటింగ్ హాల్లోకి అనుమతించరు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా గుర్తింపు కార్డుతో రావాల్సి ఉంటుంది. ఆయా పార్టీల ఏజెంట్లు ఉదయం 7 గంటలకే కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలి. ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఉంటాయి. ఈవీఎంలను తీసుకువచ్చిన దగ్గర నుంచి లెక్కింపు పూర్తయ్యే వరకు వీడియో రికార్డింగ్ కూడా చేయనున్నారు.

బాపట్లకు చేరిన పార్టీల శ్రేణులు

బాపట్లలో కౌంటింగ్ జరుగుతున్నందున జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో పార్టీల శ్రేణులు జిల్లా కేంద్రం బాట పట్టే అవకాశం ఉంది. అనుమతిలేని వారెవరూ బయట ప్రాంతాల నుంచి బాపట్లకు రావద్దని పోలీసులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇప్పటికే పెద్ద సంఖ్యలో పార్టీల శ్రేణులు శివారులోని రిసార్టులు, లాడ్జీల్లో మకాం వేశారని సమాచారం. పోలీసులు వాటిని కూడా జల్లెడ పడుతున్నప్పటికీ సోమవారం రాత్రికి గణనీయ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. దాదాపు 8,000 మంది వరకు బాపట్లలో కౌంటింగ్ రోజైన మంగళవారం బాపట్లలో మకాం వేయనున్నారని సమాచారం. ఉదయం 11 గంటలకల్లా ఏ పార్టీది గెలుపు అనే ట్రెండ్‌పై శ్రేణులు ఓ అంచనాకు వస్తాయని, అప్పుడు వారిని నిలువరించడం పోలీసులకు సవాల్‌గా మరే అవకాశం ఉందని తెలుస్తోంది.

లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత : ఎన్నికల సాధారణ పరిశీలకులు

ఓట్లలెక్కింపు కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళసింగ్ తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఖాజాన్‌సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్‌లు ఆదివారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాల నిఘా, కేంద్ర బలగాల బందోబస్తు పరిశీలించారు. ఓట్లలెక్కింపు ప్రక్రియ ముగిసేవరకు నిఘా నిరంతరం కొనసాగాలన్నారు. లెక్కింపు కేంద్రాలకు వెళ్ళేమార్గాల వద్ద దిక్సూచి బోర్డులను, అదనంగా మరికొన్ని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో వీడియోగ్రఫి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆర్‌వోలు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సీఏ అమీర్, అభిషేక్ దూబే, డాక్టర్ కవిత యోగప్పనవ్, ఏఎస్పీ విఠలేశ్వరరావు, డీఆర్వో సత్తిబాబు, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాలి : ఎస్పీ వకుల్‌జిందాల్

కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించే ప్రతిఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద, పరిసరప్రాంతాలలో విధులు నిర్వహించే పోలీసు అధికారులతో ఆదివారం ఎస్పీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. పోలీసు అధికారులు,సిబ్బంది ప్రతిఒక్కరు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు.



కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తూ ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు మీరి ప్రవర్తించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ ఏర్పాట్లు మొత్తం పూర్తి చేశామని, భారీకేడింగ్, క్యూలైన్‌లు, క్లాక్‌రూమ్‌లు ఏర్పాటు, కంట్రోల్‌రూమ్ ఏర్పాటు పూర్తి అయ్యాయన్నారు. కౌంటింగ్ సెంటర్‌కు 200 మీటర్లు బయటకు వాహనాలు తనిఖీ చేసి పంపాలన్నారు. 100 మీటర్లు బయట అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి గుర్తింపుకార్డులు పరిశీలించి లోనికి పంపాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో ఉండే వాహనాలలో డ్రైవర్లు మాత్రమే ఉండాలన్నారు. 3వ తేది సాయంత్రం నుంచి బాపట్ల జిల్లాలో దుకాణాలు, హోటళ్ళు, రెస్టారెంట్‌లు, ఇతర వ్యాపారసముదాయాలు తెరవరాదన్నారు. లాడ్జీలు, రిసార్ట్స్, హోటళ్ళు, ఇతరప్రాంతాల్లో ఎవరూ బస చేయడానికి అనుమతిలేదన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరప్రాంతాల్లో 450 మంది పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. 95 పికెట్‌లను, 43 మొబైల్‌పెట్రోలింగ్ బృందాలు, 32 క్విక్ రియాక్షన్ టీమ్‌లు, 6 స్ట్రయికింగ్ పార్టీలు, 9 స్పెషల్ స్ట్రయికింగ్ పార్టీలు ఏర్పాటు చేశామన్నారు.

వాహనాల దారిమళ్లింపు

ఓట్ల లెక్కింపు జరిగే బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల మార్గంలో సోమవారం సాయంత్రం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే వారకు వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. వాహనాలు దారి మళ్ళింపుతో పాటు బాపట్లలో ట్రాఫిక్ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. చీరాల వైపు నుంచి బాపట్ల వచ్చే వాహనాలు ఎన్‌హెచ్-216 మీదగా సూర్యలంక రోడ్డులో నుంచి బాపట్లలోకి రావలెను. కర్లపాలెం నుంచి చీరాల వైపు వెళ్లే వాహనాలు ఎన్‌హెచ్-216 మీదగా వెళ్లాలి. గుంటూరు వైపు నుంచి చీరాల వైపు వెళ్లే వాహనాలు చీలు రోడ్డు నుంచి మార్కెట్ యార్డు మీదగా ఎన్‌హెచ్-216 హైవే, గడియారం స్తంభం మీదగా సూర్యలంక బీచ్ రోడ్డు వైపు వెళ్లి ఎన్‌హైచ్-216 మీదగా వెళ్లాలి.

పారదర్శకంగా ఓట్లలెక్కింపు : కలెక్టర్

ఓట్లలెక్కింపు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, అప్రమత్తత ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బివి.నాథ్ ఆడిటోరియంలో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జేసీ శ్రీధర్ అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు. ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించిన సమయానికి ఓట్లలెక్కింపు ప్రక్రియ ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని రంజిత్‌బాషా ఆదేశించారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వారివారి పరిధిని గుర్తుంచుకోవాలన్నారు. ఏసమస్య వచ్చిన తక్షణమే ఆర్‌వోలను సంప్రదించాలన్నారు. ఈవీఎం కంట్రోల్ యూనిట్, పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపులో సమయపాలన పాటించాలన్నారు. కళాశాల వద్ద 100మీటర్ల పరిధిలో వాహనాలకు అనుమతిలేనందున అధికారులు, సిబ్బంది ముందస్తుగా అక్కడకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సత్తిబాబు, ఆర్‌వోలు, నోడల్ ఆఫీసర్ రమణ, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో వాహనాల తనిఖీలు

గుండ్లకమ్మలో ఇష్టారాజ్యం

బ్రిడ్జికి ఇరువైపులా ఇసుక తవ్వకం ● వరద వస్తే పొంచి ఉన్న ప్రమాదం

అద్దంకి, జూన్ 2: వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గుండ్లకమ్మ నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరిగాయి. అద్దంకి ప్రాంతంలో నదిలో అధికారికంగా రీచ్ లేకపోయినా అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరిపారు. ఇతర ప్రాంతాలకు కూడా ఇసుక ఎగుమతులు చేపట్టారు. అద్దంకి - దర్శి రోడ్డులో అద్దంకి పట్టణానికి సమీపంలో నదిపై బ్రిడ్జికి రెండు వైపులా కూడా ఇసుక తవ్వకాలు జరిగాయి. బ్రిడ్జికి సంబంధించి కొన్ని ఖానాలు కుంగగా గతంలో సుమారు ఏడాది పాటు రాకపోకలు నిలిపి వేసి తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించారు. అయితే గత ఏడాదిగా ఇసుక అక్రమ రవాణాదారులు, అనధికారిక ఇసుక సీనరేజీ వసూలు దారులు మరింత బరి తెగించి బ్రిడ్జికి రెండు వైపులా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేశారు. అధికారులు కూడా కనీసం అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. తీరా ఇప్పుడు తేరుకున్న అధికారులు పరిశీలించి ఇసుక తవ్వకాలు నిలిపి వేశారు. అయితే ఇప్పటికే తవ్వకాలతో బ్రిడ్జికి రెండు వైపులా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. నదికి వరద వస్తే బ్రిడ్జి ఖానాల వద్ద కోతకు గురయ్యే అవకాశం ఉంది. శిథిలావస్థకు చేరి అంతంత మాత్రంగా ఉన్న బ్రిడ్జి మరింత ప్రమాదపు అంచుకు చేరే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టి బ్రిడ్జికి రెండు వైపులా ఏర్పడ్డ గోతులను పూడ్చి కోతకు గురికాకుండా కొంత మేర అయినా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలా కాకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తే పెనుప్రమాదమే సంభవించే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచే అవకాశం ఉంది.



గుండ్లకమ్మలో బ్రిడ్జికి ఎగువ జరిగిన ఇసుక తవ్వకాలు

ఐదేళ్లుగా.. బోరు బోరే..



- జలకళను నీరుగార్చిన ప్రభుత్వం
- 4,800 దరఖాస్తులకు ఒక్క బోరు లేదు
- రైతులను నిలువునా వంచించినా పాలకులు

బాపట్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జలకళ పథకం ద్వారా పొలాల్లో బోర్లు తవ్వించి చిన్న, సన్నకారు రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయి. ఐదేళ్ల పాలనలో పథకానికి వచ్చిన దరఖాస్తులు జిల్లావ్యాప్తంగా వేలల్లో ఉంటే ఒక్కరంటే ఒక్కరైతుకు కూడా లబ్ధి చేకూర్చని ప్రభుత్వంగా వైసీపీ ఘనత కెక్కింది. జిల్లాలో జలకళ పథకం ద్వారా బోర్లు తవ్వించుకోవడానికి 4,800 వరకు దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయి. వీటిలో నిబంధనల పేరిట వడపోతల అనంతరం లబ్ధిదారుల సంఖ్య 1900గా తేల్చారు. కనీసం వీరికైనా బోర్లు తవ్వించి పంపుసెట్టు బిగించి రైతులను ఆదుకున్నారా అంటే అదీ లేదు. పరిపాలనా పరమైన అనుమతుల పేరిట లబ్ధిదారుల సంఖ్య 1500కి పడిపోయిం ది. వీటిలో తవ్విన బోర్లు కేవలం 750 మాత్రమే. పంప్‌సెట్టు బిగించి ఉపయోగంలో ఉన్న బోర్లు ఎన్నంటే గుండుసున్నా. ఏటికేడు నిబంధనలు మారుస్తూ కాలయాపన చేయడం ఒక ఎత్తయితే రిగ్గు కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించడంలో కూడా చేతులెత్తేయడంతో జలకళ పథకం విషయంలో రైతులు నిలువునా వంచనకు గురయ్యారు. కాంట్రాక్టర్‌కు దాదాపు రూ2 కోట్లవరకు బిల్లులు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. సాగుకు నీటి విషయంలో బోర్ల ద్వారా ప్రత్యామ్నాయ మార్గం ఉన్నప్పటికీ ప్రభుత్వ మోసకారి తనం వల్ల నిండా మునిగిపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

రకరకాల పిల్లిమొగ్గలు...

ప్రభుత్వం జలకళ పథకం విషయంలో తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ఈ ఐదేళ్లలో పలుమార్లు పిల్లిమొగ్గలు వేసింది. నిబంధనల మారుస్తూ పథకం ప్రయోజనాలను రైతుకు అందించడంలో మాత్రం అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. తొలుత ప్రకటించిన మార్గదర్శకాలలో కరెంటు కనెక్షన్ ఉచితం అని చెప్పింది. రెండేళ్ల గడిచేసరికి ఆ వ్యయాన్ని లబ్ధిదారులే భరించాలని మాటమార్చింది. ఇదే కాదు బోరు తవ్వించే విస్తీర్ణం విషయంలో కూడా పలు దఫాలుగా నిబంధనలను సవరించింది. చిన్న, సన్నకారు రైతుల సంక్షేమం కోసమే జలకళ పథకం అని ఊదరగొట్టిన ప్రభుత్వం కరెంటు కనెక్షన్ల విషయంలో ఆ భారం రైతులే మోయాలని చెప్పి వారి ఆశలపై నీళ్లు చల్లింది. తొలుత ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు విద్యుత్ కనెక్షన్ కూడా ఉచితంగా ఇస్తామని అంతకన్నా ఎక్కువ పొలం ఉన్న రైతులకు మాత్రం ఒక్క బోర్ మాత్రమే తవ్విస్తామని ప్రభుత్వం నమ్మబలికింది. ఇదీ ఆచరణకు నోచుకోలేదు. ఉచితంగా కరెంటు కనెక్షన్ ఇచ్చే విషయంలో కూడా వ్యయపరిమితి విధించి రైతుల నడ్డి విరిచింది. నిబంధనల మార్పుతోనే ఐదేళ్లు కాలక్షేపం చేసిన ప్రభుత్వం అన్నదాతలకు జలకళ పథకం ఫలాలను అందకుండా చేసింది.

కార్యాలయాల చుట్టూ తిరిగి

జలకళ పథకం ద్వారా బోర్లు తవ్వించుకోవడానికి అన్నదాతలు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయారు. అరకొరగా తవ్విన బోర్లకు కరెంటు కనెక్షన్, పంపుసెట్టు బిగించే విషయంలో జాప్యంతో తవ్విన బోర్లు కూడా నిరుపయోగంగా మారాయి. గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ జలసిరి పేరిట బోర్లను క్రమం తప్పకుండా తవ్వించి తమను ఆదుకున్నారని ప్రస్తుతం ఏళ్లు గడుస్తున్నా బోర్లకు మోక్షం కలగడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.



బ్రాహ్మణపల్లిలోని గడ్డివాములో నిల్వ ఉంచిన పెట్రోల్ బాంబుల తయారీ ముడిసరుకును స్వాధీనం చేసుకున్న పోలీసులు

బ్రాహ్మణపల్లిలో బాంబుల కలకలం

రాజుపాలెం, జూన్ 2: పల్నాడు జిల్లాలో పోలింగ్ హింసాత్మక ఘటనలు ఇంకా మరిచిపోలేదు. పోలీసులు పెద్దఎత్తున తనిఖీలు చేపడుతున్నారు. హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పలువుర్ని అరెస్టు చేసి జైళ్లకు కూడా పంపారు. ఈ పరిస్థితుల్లో కూడా పెట్రో బాంబుల తయారీ సామగ్రి దొరకడంతో అటు పోలీసు అధికారులతో పాటు సామాన్య ప్రజలు కూడా బెంబేలెత్తిపోతున్నారు. రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లిలో పెట్రోల్ బాంబుల తయారీ ముడిసరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి తూర్పు దిక్కుగా ఉన్న ఓ గడ్డివాములో పెట్రోల్ బాంబులు దాచి ఉంచా రనే సమాచారం ఆదివారం పోలీసులకు అందింది. దీంతో రాజుపాలెం ఎస్ఐ షామీ ర్‌బాషా, సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు సిబ్బందితో వెళ్లి ఆ ప్రాంతంలో తనిఖీ చేశారు. పెట్రోల్ బాంబుల తయారీకి ఉపయోగించే ముడిసరుకును గుర్తించి ఉన్న తాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్పీ సోమశేఖర్, డీఎస్పీ గురునాథ బాబు అక్కడకు వచ్చి వాటిని పరిశీలించారు. బ్రహ్మణపల్లిపై ప్రత్యేక దృష్టి సారించా లని పోలీసులను ఆదేశిం చారు. గ్రామానికి చెందిన గుర్రాల జగన్మోహన్ రావుకు చెం దిన గడ్డివాములో 9 మద్యం క్వార్టర్ బాటి ళ్లు, 8 ఖాళీ బీరు బా టిళ్లు, 1 ఆఫ్ బాటిల్, పెట్రోల్ నింపిన రెం డు లీటర్ల బాటిళ్లు రెండు ఉన్నాయని ఎస్ఐ షామీర్ బాషా తెలి పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వీటితో తమకు సంబంధం లేదని గుర్రాల జగన్మోహన్‌రావు తెలిపారు. ఎవరో గిట్టనివారు ఉద్దేశపూర్వకంగా తమ గడ్డివాములో దాచి కేసులో ఇరికించాలని చూస్తున్నారని చెప్పారు.



కుంట పోరంబోకు భూమిలో కుంట కట్టను తెగకొట్టిన దృశ్యం

కుంట భూమిపై కన్ను

- కట్ట తొలగించి ఆక్రమణకు వైసీపీ నేత యత్నం
- అడ్డుకున్న ఎస్టీలపై అనుచరులతో కలిసి దాడి
- చోద్యంచూస్తున్న రెవెన్యూ అధికారులు

దర్శి, జూన్ 2 : వైసీపీ నేతలు భూబకాసురులుగా మారారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. ప్రభుత్వ భూములతోపాటు వాగులు, వంకలు ఆక్రమించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా దర్శి-పొదిలి రోడ్డులోని కోట్లాది రూపాయల విలువచేసే కుంట పోరంబోకు భూమిపై ఓ నాయకుడు కన్నేశాడు. దాన్ని కబ్జా చేసేందుకు కుంట కట్టను సైతం తొలగించాడు. అడ్డుకున్న ఎస్టీలపై అనుచరులతో కలిసి దాడికి తెగబడ్డాడు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మిన్నకుండటం విమర్శలకు తావిస్తోంది.

రూ.కోట్ల విలువైన భూమి ఆక్రమణకు యత్నం

దర్శి రెవెన్యూలోని 1071 సర్వేనెంబర్‌లో 6.50 ఎకరాలు కుంట పోరంబోకు భూమి ఉంది. బ్రిటీష్ కాలం నుంచి అక్కడ కుంట ఉంది. ఆ ప్రాంత పొలాల రైతులు సాగునీటి అవసరాల కోసం దాన్ని ఏర్పాటుచేశారు. పొలాల దున్నకాల సమయాల్లో రైతులు అక్కడ సేద తీర్చుకునేవారు. సాగర్ కాలువ వచ్చిన తర్వాత కుంట అవసరాలు తగ్గిపోయాయి. ఆప్రాంతమంతా మాగాణి అయింది. ఆ భూములకు విలువ పెరగడంతో కొంతమంది రైతులు కొంతమేర కుంట భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. మరో రెండు ఎకరాలు మిగిలి ఉండగా అందులో కొంత భూమిని రాజంపల్లికి చెందిన ఎస్టీలు సాగుచేసుకుంటున్నారు. మిగిలిన దానిలో కుంట ఉంది. ఆ కుంట భూమి దర్శి-పొదిలి ప్రధాన రహదారి ఆనుకొని ఉండటంతో ప్రస్తుతం ఎకరం రూ.కోటి పలుకుతోంది. దీంతో వైసీపీ నాయకుడి కన్ను ఆ కుంటపై పడింది. ఏడాదిగా ఆ కుంట భూమిని ఆక్రమించుకునేందుకు పలుసార్లు ప్రయత్నించారు. రాజంపల్లి గ్రామస్థులు అడ్డుపడటంతో ఆక్రమణలకు బ్రేకులు పడుతూ వచ్చింది. గతంలో రెవెన్యూ అధికారులు ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

రెచ్చిపోతున్న వైసీపీ నాయకుడు

అధికారులు హెచ్చరిక బోర్డులను కూడా లెక్కచేయకుండా వైసీపీ నాయకుడు రెచ్చిపోతున్నాడు. దర్శి ఎంపీపీ భర్త జి.అచ్చయ్య ఆ భూమిపై తమకు హక్కు ఉందని కొంతకాలంగా ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ భూమిని సాగు చేసుకుంటున్న రాజంపల్లి గ్రామానికి చెందిన ఎస్టీలు పలుదఫాలు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారుల వద్ద కూడా ఈవిషయమై చర్చ జరిగింది. ప్రభుత్వభూమి ఆక్రమణకు గురికాకుండా అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించారు. దీంతో దర్శి ఎంపీపీ భర్త అచ్చయ్య తన అనుచరులతో గురువారం రాత్రి కుంట పోరంబోకు భూమి ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అందులోభాగంగా కుంట కట్టను కొంతమేర తొలగించారు. ఆ భూమిని సాగు చేసుకుంటున్న ఎస్టీలు ఆక్రమణను అడ్డుకున్నారు. దీంతో అచ్చయ్య తన వర్గీయులతో ఎస్టీలపై దాడి చేశారు. వైసీపీ నాయకుల దాడిలో ఎస్టీ వర్గానికి చెందిన వీరాంజనేయులు, రవికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరాంజనేయులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఇంతజరిగినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు కూడా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ ఘటనతో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడ జరుగుతున్న అక్రమాలను గుర్తించి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాకు చేరిన 1,981 సర్వీసు ఓట్లు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 2 : ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని 1,981 సర్వీసు ఓట్లు జిల్లాకు చేరాయని పోస్టల్ ఓటింగ్ ప్రత్యేకాధికారి కె.ఝాన్సీ లక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఆదివారం వచ్చిన సర్వీసు ఓట్లను ఆమె బాక్సులో వేసి సీల్ వేశారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 4వతేదీ ఉదయం 8గంటల లోపు అందిన సర్వీసు ఓట్లన్నింటినీ లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు డీఎస్ క్రాంతికుమార్, బి.రాజశేఖర్, కొమ్ము యోహాన్, గుర్రం సత్యనారాయణ, ఏడుకొండలు, రమణారెడ్డి, వై.కొండారెడ్డి, సూర్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సూచనలు పాటించాలి

చీరాల, జూన్ 2 : ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఎక్కడ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అందులో భాగంగా 3వ తేదీ సోమవారం సాయంత్రం నుంచి 5వ తేదీ బుధవారం ఉదయం వరకు దుకాణాలను స్వచ్ఛందంగామూసివేస్తున్నట్లు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తులాబందు వెంకట సురేష్ తెలిపారు. వేటపాలెంలో కూడా పోలీస్ ఉత్తర్వులను పాటిస్తున్నట్లు అక్కడ వ్యాపారులు తెలిపారు. పార్టీల అభ్యర్థులు కూడా ఎక్కడ కూడా గుంపులుగుంపులుగా తమ కార్యకర్తలు, నాయకులు లేకుండా ముందస్తు సమచారం అందించాలని పోలీస్ వర్గాలు సూచించాయి. అందులో భాగంగా ఎవరు కూడా విజయోత్సవ ర్యాలీల పేరుతో హడావుడి చేయరాదన్నారు. అభ్యర్థులు భోజనాల ఏర్పాటు లాంటి కార్యక్రమాలను కూడా చేయొద్దన్నారు. వారి ఇళ్లలో కూడా వారు, వారి కుటుంబ సభ్యులు మాత్రమే ఉండాలన్నారు. లాడ్జిలు, ఇతర ఆవాస ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తుల బసకు అనుమతించరాదన్నారు. నియోజకవర్గ పరిధిలో 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఈ క్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కూడా సంయమనం పాటించాలన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, చర్యలకు పాల్పడితే శిక్షార్హులు అవుతారన్నారు. ఎన్నికల ఫలితాల వేళ భావోద్వేగాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని పోలీసులు కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

అద్దంకిటౌన్, మే 2: కుటుంబ కలహాల నేపథ్యంలో గృహిణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. జ్యూస్‌లో తలకు వేసుకునే రంగును కలిపి తాగి ఆమె ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. ఈ సంఘటన ఆదివారం పట్టణంలోని శివాలయం సమీపంలో జరిగింది. 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన కుంచాల మంజుల తన భర్తతో అద్దంకి పట్టణంలోని శి వాలయం సమీపంలో నివాసం ఉంటున్నారు. మంజులదంపతులకు బాబు ఉన్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం మంజుల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో రంగు కలిపిన జ్యూస్‌ను తాగింది. దీంతో అక్కడే పడిపోవడంతో స్థానికులు 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు 108 సిబ్బంది హరిబాబు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

కౌంటింగ్‌కు పటిష్టమైన చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 2: కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరిగేటట్లు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాల్‌లో రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ విధులకు కేటాయించబడిన సిబ్బంది మంగళవారం ఉదయం 5గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునేలా రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు సైతం అనుమతించ కూడదని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు చేయాల్సిన విధులకు సంబంధించి ముఖ్యఅంశాలపై చెక్‌లిస్టును రూపొందించి వారికి అందించాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు అరవింద్‌కుమార్ చౌరాసియా, మయూర్ కె మెహతా మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటించాలన్నారు. అనంతరం ఎస్పీ గరుడ్‌సుమిత్ సునీల్ మాట్లాడతూ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కౌంట్ డౌన్

- మరో 24 గంటల్లో ఓట్ల లెక్కింపు
- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- మధ్యాహ్నం తర్వాతే ఫలితాలు
- తొలుత సంతనూతలపాడు వచ్చే అవకాశం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ మొదలైంది. సుదీర్ఘ ఉత్కంఠకు మరో 24 గంటల్లో తెరపడనుంది. విజేతలు ఎవ్వరన్నది తేలనుంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల తర్వాతే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు దాని పరిధిలో ఉన్న జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, అలాగే బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు ఒంగోలులోని రైజ్ కాలేజీలో జరగనుంది. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14, పార్లమెంట్ స్థానానికి 14 టేబుళ్లను విడివిడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్‌లు, ఆతర్వాత ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్‌కు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. రైజ్ కళాశాల పరిసర ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించింది. ఫలితాల ప్రకటన అనంతరం అల్లర్లు జరగకుండా జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. 156 గ్రామాల్లో పోలీసు పికెట్ల ఏర్పాటుతోపాటు నాయకులు, ప్రధాన పార్టీల కార్యాలయాల వద్ద భద్రతను పెంచారు.

ఒంగోలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 2,183 కేంద్రాల్లో గత నెల 13న పోలింగ్ జరగ్గా ఈవీఎంలలో ఓట్లు నిక్షిప్తమయ్యాయి. వాటన్నింటినీ ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లలో ప్రత్యేక భద్రత మధ్య ఉంచారు. మంగళవారం కౌంటింగ్ జరగనుంది. అందుకు ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. సజావుగా లెక్కింపు ప్రక్రియ సాగడంతోపాటు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది. కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ సుమిత్ ఇందుకోసం భారీ కసరత్తు చేశారు.

తొలుత పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. 8.30 గంటలకు ఈవీఎంలలోని ఓట్ల కౌంటింగ్ చేపడతారు. ఉదయం 5.30 గంటల నుంచే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, అలాగే బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు సెగ్మెంట్ పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కూడా ఇక్కడి రైజ్ కాలేజీలోనే జరుగుతుంది. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14, పార్లమెంట్ స్థానం లెక్కింపునకు 14 టేబుళ్లను విడివిడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో టేబుల్ వద్ద గజిటెడ్ హోదా ఉండే ఒక సూపర్‌వైజర్, మరో అసిస్టెంట్, ఇంకో మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఐదు టేబుళ్ల ఏర్పాటు చేయడంతోపాటు ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బందిని నియమించారు. ప్రతి రౌండ్‌కు 14 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. ఆయా నియోజకవర్గాలలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిని 14తో విభజించి అన్ని రౌండ్లుగా తేల్చుతారు.

ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తికి 25 నిమిషాలు

సంతనూతలపాడు నియోజకవర్గంలో తక్కువగా 256, కనిగిరిలో అత్యధికంగా 297 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కనిష్ఠంగా 19 రౌండ్లు, గరిష్ఠంగా 22రౌండ్ల లెక్కింపు సాగుతుంది. ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తికి సగటున 25 నిమిషాల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో మధ్యాహ్నం మూడు గంటల తర్వాతనే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. పోలింగ్ కేంద్రాలు తక్కువగా ఉన్న సంతనూతలపాడు నియోజకవర్గ ఫలితం తొలుత వెల్లడయ్యే అవకాశం కనిపిస్తోంది. అది కూడా మధ్యాహ్నం మూడు గంటల తర్వాతనే అని చెప్తున్నారు. అదేసమయంలో పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపునకు కొంత అధిక సమయం పట్టనుండగా, అభ్యర్థులు ఎక్కువ ఉన్న సెగ్మెంట్లలో రెండు ఈవీఎంలు వినియోగించడం వల్ల లెక్కింపు ఆలస్యం కానుంది.

అభ్యర్థులు ఎక్కువ మంది పోటీ చేసిన చోట్ల ఆలస్యం

జిల్లాలో ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి 25 మంది అభ్యర్థులు పోటీ చేశారు. మార్కాపురం అసెంబ్లీకి 27 మంది, ఒంగోలుకు 26 మంది, గిద్దలూరుకు 21 మంది రంగంలో ఉన్నారు. వాటిలో పోస్టల్ బ్యాలెట్లు కూడా అధికంగానే ఉన్నాయి. దీంతో ఆ నియోజకవర్గాల్లో లెక్కింపు కొంత మేర ఆలస్యమై సాయంత్రం ఆరు గంటల తర్వాతనే వాటి ఫలితాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఒంగోలు పార్లమెంట్ లెక్కింపు రాత్రికి పూర్తికానుంది.

ఉదయం 8 నుంచి కౌంటింగ్ ప్రారంభం

అభ్యర్థుల తరపు ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్లను ఉదయం 8గంటలకు, ఈవీఎంలలో ఓట్ల లెక్కింపును 8.30 గంటలకు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సంఘం నియమించిన పరిశీలకుల పర్యవేక్షణలో సూపర్‌వైజర్లు ప్రారంభిస్తారు. లెక్కింపునకు నియమించిన సిబ్బందిని ఉదయం 5.30 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు రప్పించి వారికి టేబుళ్లను కేటాయిస్తారు. ఆరు గంటలకు అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లను అనుమతిస్తారు. ఆయా నియోజకర్గాల స్ట్రాంగ్ రూమ్‌ల సీల్‌ను అభ్యర్థులు లేదా చీఫ్ ఏజెంట్ల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు తీసి లెక్కింపునకు ఈవీఎంలను పంపిస్తారు.

ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్ పూర్తికి ఆరు గంటలు

రౌండ్‌ల వారీగా లెక్కింపు కనుక తొలుత 1నుంచి 14 వరకు కేంద్రాల ఈవీఎంలను కేటాయించిన టేబుళ్లపైకి తీసుకువస్తారు. అలా ఒక్కో రౌండ్‌కు 14 ఈవీఎంలను ప్రత్యేక సిబ్బంది ద్వారా టేబుళ్లపైకి చేర్చుతారు. అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 వంతున 112, పార్లమెంట్‌కు 112 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు వంతున 672 మంది, పోస్టల్ బ్యాలెట్‌లకు మరో 240 మంది వెరసి 912 మంది సిబ్బంది అవసరం కాగా అదనంగా 20శాతం మందిని నియమించారు. ఒక రౌండ్ కౌంటింగ్ ముగిసిన అనంతరం మరో రౌండ్ లెక్కింపు జరగనుంది. తొలి రౌండ్‌కు అర్థగంట, అనంతరం ప్రతి రౌండ్‌కు 20నుంచి 25 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ ప్రకారం చూస్తే ఒక్కో సెగ్మెంట్ ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు కనిష్ఠంగా ఆరు గంటలు, గరిష్ఠంగా 9 గంటలు పట్టవచ్చని సమాచారం.



కౌంటింగ్‌కు ఏర్పాటుచేసిన టేబుళ్లు

కట్టుదిట్టమైన భద్రత

ఈసారి కౌంటింగ్ గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో భద్రత చర్యలు చేపట్టారు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలో తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. లెక్కింపు జరిగే రైజ్ కళాశాల పరిసర ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించింది. ఆప్రాంతంలోని జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లింపుతోపాటు జనసంచారాన్ని నియంత్రించనుంది. లెక్కింపు జరిగే కళాశాలలో నాలుగు అంచెల చెకింగ్ వ్యవస్థ, భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. అభ్యర్థులు, అధికారులు, ఏజెంట్లు ఎవ్వరూ సెల్‌ఫోన్‌లను లోపలికి తీసుకురాకుండా చర్యలు తీసుకుంటున్నారు. వారి వాహనాలను కూడా లోపలికి అనుమతించరు.

156 గ్రామాల్లో పోలీసు పికెట్‌లు

లెక్కింపు రోజున జిల్లా అంతటా 144 సెక్షన్ అమలుకు ఉత్తర్వులు ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలతోపాటు సమీపంలోని ఒంగోలు నగరంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఘర్షణలు తలెత్తే అవకాశం ఉన్నట్లు గుర్తించిన 156 గ్రామాల్లో పోలీసు పికెట్ల ఏర్పాటుతోపాటు 18 మంది కీలక నాయకులు, 16 చోట్ల ప్రధాన పార్టీల కార్యాలయాల వద్ద భద్రతను పెంచారు. ఇలా భారీ భద్రత, ఇతర ఏర్పాట్ల మధ్య కౌంటింగ్‌కు చేపడుతున్న యంత్రాంగం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్లు, ఇతర కారణాలతో కొంత జాప్యం జరిగినా కనీసం ఆరు గంటల లోపు అసెంబ్లీ, రాత్రి 8గంటలకు పార్లమెంట్ స్థానం లెక్కింపు పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నారు.

కౌంటింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌ను కోరిన దామచర్ల, బీఎన్
- వైసీపీ శ్రేణులు అల్లర్లు సృష్టించే అవకాశం ఉందని ఫిర్యాదు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 2: ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ కూటమి అభ్యర్థులు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్ ఆదివారం జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. రాబోయే ఫలితాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించే అవకాశం ఉన్నందున వైసీపీ శ్రేణులు అల్లర్లు సృష్టించడంతోపాటు, గొడవలకు దిగే అవకాశం ఉందన్న విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో వైసీపీ ఏజెంట్‌లు గందరగోళం సృష్టించే పరిస్థితులు ఉన్న దృష్ట్యా ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అలాగే పోస్టల్ బ్యాలెట్‌లు, ఈవీఎం ఓట్ల లెక్కింపు ఒకే సమయంలో జరిగేలా చూడాలని కోరినట్లు చెప్పారు. వారి వెంట దర్శి టీడీపీ అభ్యర్థి భర్త డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్‌సాగర్, కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకుడు ఈదర మోహన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు అష్టదిగ్బంధం

- నగరమంతా సీసీ కెమోరాల నిఘా

ఒంగోలు (క్రైం), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నగర సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 4న జరగనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. శివారుప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. 3వతేదీ రాత్రి నుంచి 4వతేదీ రాత్రి వరకూ భోజన హోటళ్లు, దుకాణాలు మూసివేయాలని, లాడ్జిలు, కల్యాణ మండపాల్లో కొత్త వ్యక్తులు ఎవ్వరూ ఉండకూడదని ఆదేశించారు. ఈమేరకు మైక్‌లు పెట్టి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నగరమంతా సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఎక్కడ ప్రజలు గుంపులుగా చేరినా వెంటనే కంట్రోలు రూమ్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నారు. నగరంలో కొత్త వ్యక్తుల కదలికలపై కూడా నిఘా ఉంచారు.

మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్

జిల్లావ్యాప్తంగా ఈనెల 3,4,5 తేదీల్లో మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నారు. మద్యం దుకాణాలతోపాటు, బార్‌షాపులు మూతపడనున్నాయి. దీంతో ఆదివారం మద్యం దుకాణాల వద్ద మందుబాబులు బారులు తీరారు. అదేసమయంలో బెల్ట్‌షాపులకు కూడా పెద్దఎత్తున మద్యాన్ని తరలించారు.

టెన్త్ మూల్యాంకనంలో భారీ మార్పులు

- ఇక అంతా డిజిటల్ ఆన్‌లైన్‌లోనే..
- మూడంచెల విధానం అమలు

ఒంగోలు (విద్య), జూన్ 2 : పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీ మార్పులకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సిద్ధమయ్యారు. మాన్యువల్ స్పాట్ వాల్యుయేషన్ స్థానంలో ఆన్‌లైన్ మూల్యాంకాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థులకు నష్టం జరగకుండా ఉండేందుకు మూడంచెల విధానం అమలుకు నిర్ణయించారు. వచ్చే ఏడాది జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నుంచి దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. ప్రస్తుతం పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో గణితం సబ్జెక్టు జవాబు పత్రాలను ప్రయోగాత్మకంగా ఈకొత్త పద్ధతిలో మూల్యాంకనం చేయనున్నారు. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది విద్యార్థులు సప్లిమెంటరీలో గణితం పరీక్ష రాశారు. వారికి 24పేజీల జవాబు పత్రం బుక్‌లెట్ ఇచ్చారు. ఈ పత్రాలను విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కర్నూలు, తిరుపతిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కేంద్రాల్లో పార్ట్-1 రాకుండా ఇతర జవాబు పత్రం మొత్తం స్కాన్ చేస్తారు.

ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించేందుకు ఇచ్చిన ట్యాబ్‌ల ద్వారా ఉపాధ్యాయులు ఈ జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. ఒక్కొక్కరికి 75జవాబు పత్రాలను కేటాయిస్తారు. ప్రతి జిల్లా నుంచి 50 మంది చొప్పున మొత్తం 1,200 మంది చురుకైన కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులను ఎంపికచేసి జాబితాలను పంపించాలని డీఈవోలను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి ఆదేశించారు. ఉపాధ్యాయులు ట్యాబ్‌లోకి లాగిన్ అయితే తెరమీద ఒకవైపు జవాబు పత్రం, మరోవైపు మార్కులు వేసేందుకు టేబుల్ వస్తాయి. జవాబు పత్రంలో సమాధానం చూసి దానికి మార్కులు టేబుల్‌లో వేస్తారు. ఇలా ఒక ఉపాధ్యాయుడు దిద్దిన జవాబు పత్రాన్ని మరో టీచర్‌కు పంపించి మూల్యాంకనం చేయిస్తారు. ఈ ఇద్దరి మూల్యాంకనంలో పదిశాతం కంటే ఎక్కువ మార్కుల తేడా వస్తే అప్పుడు మూడో టీచర్‌కు పంపి అక్కడ వచ్చిన మార్కులను ఫైనల్ చేస్తారు.

కందుల ఇంట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల సమావేశం

మార్కాపురం రూరల్, జూన్ 2: ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఆది వారం సాయంత్రం మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. కందుల ఆహ్వానం మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ నేతలు జవహర్‌నగర్‌లోని కందుల స్వగృహానికి విచ్చేసి ఉమ్మడి జిల్లా రాజకీయాలపై జిల్లా అభివృద్ధిపై భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కనిగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోకొరెడ్డి, ఎర్రగొండపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు, దర్శి అభ్యర్థి లక్ష్మీ లలిత్ సాగర్ ఒంగోలు టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి, టీడీపీ వాణిజ్య విభాగం నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున, టీడీపీ నాయకులు ఉన్నారు.



మార్కాపురంలోని కందుల నివాసంలో సమావేశమైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు

తుమ్మలచెరువు దర్గాలో ప్రత్యేక పూజలు

తర్లుపాడు మండలంలోని తుమ్మచెరువులో ప్రఖ్యాత హజరత్ ఖాసీం బాబా దర్గాలో జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని, ప్రకాశం ఉమ్మడి జిల్లాలో టీడీపీ అభ్యర్థులు ప్రతి ఒక్కరూ గెలవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

లారీ ఢీకొని పంచాయతీ కార్మికుడు మృతి



పిచ్చయ్య (ఫైల్)

బల్లికురవ, జూన్ 2: మండల పరిధిలోని మేదరమెట్ల నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు గ్రామ సెంటర్‌లో ఆదివారం లారీ ఢీకొని పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న పందిరి పిచ్చయ్య(46) మృతి చెందారు. నామ్ రోడ్డు మరమ్మతు పనులు చేస్తూ ట్రాఫిక్ ఒక వైపుకు మళ్లించడం వలనే ఈ ప్రమాదం జరిగిందని రోడ్డు క్రాస్ వద్ద రక్షణ చర్యలు చేపట్టలేదని బాధిత బంధువులు ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ గంట పాటు నిలిచిపోయింది. మండలంలోని కొప్పెరపాడు పంచాయతీ కార్యాలయంలో చెత్త సేకరణ కార్మికుడుగా పనిచేసే పందిరి పిచ్చయ్య ఆదివారం పక్కనే ఉన్న ఎస్టీ కాలనీలో చెత్త సేకరణకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న లారీ కార్మికుడిని ఢీకొట్టి అతని ఛాతిబాగంపై గుండా ముందు టైర్లు వెళ్లాయి. ఈప్రమాదంలో కార్మికుడు అక్కడిక్కడే మృతి చెందాడు. నామ్ రోడ్డు కొప్పెరపాడు వద్ద మరమ్మతులు చేస్తూ రెండు వైపులా వచ్చే ట్రాఫిక్‌ను ఒక వైపుకు మళ్లించారు. దీంతోపాటు సరైన రక్షణ చర్యలు చేపట్టకుండా ట్రాఫిక్ మళ్లించడంవల్లే ప్రమాదం జరిగి కార్మికుడు మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తూ నామ్‌రోడ్డుపై ఆందోళనకు దిగారు. సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు, బల్లికురవ ఎస్‌ఐ రవిశంకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరి బంధువులతో మాట్లాడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి రోడ్డుపై చేస్తున్న ఆందోళనను విరమించేలా చర్యలు చేపట్టారు. పిచ్చయ్య భార్య వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన లారీని, డ్రైవర్‌ను ఆదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.



నామ్ రోడ్డుపై బంధువుల ఆందోళన

పిచ్చయ్య మృతదేహానికి గొట్టిపాటి నివాళి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొప్పెరపాడు పంచాయతీ కార్మికుడు పందిరి పిచ్చయ్య మృతదేహానికి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పరిశీలించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదర్చానిన గొట్టిపాటి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అలానే అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామంలో కల్లూరి లక్ష్మణరావు దశ దిన కర్మకు ఎమ్మెల్యే హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అందరి దృష్టి చీరాల పైనే..!

- ఇక్కడి తీర్పు విలక్షణం
- రేపు బహిర్గతం కానున్న ఫలితాలు

చీరాల, జూన్ 2 : చీరాల ఓటరు తీర్పు విలక్షణం. గత ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనం. తాజాగా గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసిన పార్టీల అభ్యర్థుల నేపథ్యం మరో కారణం. 15 మంది ఎన్నికల బరిలో నిలిచినప్పటికీ టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ మధ్య ప్రధాన పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావించారు. పోలింగ్ అనంతరం టీడీపీ, వైసీపీ మధ్య ప్రధాన పోటీ నడిచిందని పోలింగ్ సరళిని బట్టి రాజకీయ వర్గాలు ఒక అంచనాకు వచ్చాయి. ఇదిలావుంటే ప్రకాశం, బాపట్ల జిల్లాలతో పాటు ఇటు ఆంధ్రా అటు తెలంగాణలోని పలు జిల్లాల్లో చీరాల నియోజవకర్గ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆయా ప్రాంతాల రాజకీయ వర్గాలలో జోరుగా చర్చసాగుతోంది. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల తరఫున పోటీచేసిన అభ్యర్థ నేపథ్యం అందుకు కారణం.

చీరాల నియోజకవర్గంలో మొత్తం 2,02,711 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,70,500 ఓట్లు పోలయ్యాయి. (సాధారణ పోలింగ్, పోస్టల్ బ్యాలెట్లు, హోమ్ బ్యాలెట్లు కలిపి). గతంతో పోలిస్తే పోలింగ్ శాతం పెరిగింది. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య, వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ బరిలో నిలిచారు. వీరి రాజకీయ నేపథ్యం విలక్షణం. దీంతో ప్రస్తుతం చీరాల నియోజవకర్గ ఎన్నికల ఫలితాలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

గతంలో జరిగిన ఎన్నికల్లో..

2009 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ఆమంచి కృష్ణమోహన్‌కు 56,600 ఓట్లు పోలయ్యాయి. 2014 ఎన్నికలో ఆమంచి స్వతంత్ర అభ్యర్థిగా (నవోదయం పార్టీ) బరిలో నిలిచారు. టీడీపీ తరఫున పోతుల సునీత, వైసీపీ తరఫున యడం బాలాజీ పోటీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆమంచికి 57,544 పోలయ్యాయి. ఆ ఎన్నికలలో టీడీపీకి 47,209 ఓట్లు, వైసీ



పీకి 40,995 ఓట్లు పోలయ్యాయి. తరువాత ఆమంచి టీడీపీలో చేరారు. తరువాత 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆమంచి వైసీపీలో చేరారు. ఈ క్రమంలో కరణం బలరాంను టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన కరణంకు 83,163 ఓట్లు పోలయ్యాయి. వైసీపీ తరఫున పోటీచేసిన ఆమంచి కృష్ణమోహన్‌కు 65,251 ఓట్లు పోలయ్యాయి. టీడీపీకి సుమారు 18వేల మెజార్టీ వచ్చింది. తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో బలరాం వైసీపీకి మద్దతు తెలిపారు. ఆక్రమంలో టీడీపీ అధిష్ఠానం తొలుత యడం బాలాజీని, తరువాత మద్దులూరి మాలకొండయ్యను టీడీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. ఆ తరువాత నెల కొన్న పరిణామాల్లో బలరాం తనయుడు వెంకటేష్ వైసీపీ అభ్యర్థిగా, టీడీపీ అభ్యర్థిగా కొండయ్య, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమంచి బరిలో నిలిచారు.

చీరాలపై అంత ఆసక్తి ఎందుకు?

చీరాల నియోజవర్గంలో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన కొండయ్య, వెంకటేష్, కృష్ణమోహన్ రాజకీయ నేపథ్యం విలక్షం. వారి ముగ్గురికీ చీరాలతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఇతర నియోజకర్గాల్లోను అనుబంధం ఉంది. గత రెండు పర్యాయాలు సార్వత్రిక ఎన్నికల తరువాత జరిగిన పరిణామాల క్రమంలో చీరాల రాజకీయం ఎప్పటికప్పుడు రసకందాయంగానే కొనసాగుతోంది. స్థానికంగా కొనసాగిన రాజకీయ మార్పులు, చేర్పులు, వర్గపోరు అందుకు కారణం.

ఫలితం మిశ్రమమా.. సంపూర్ణమా..?

2014, 2019 ఎన్నికల్లో స్థానికంగా గెలిచిన అభ్యర్థులు తరువాత రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి మద్దతు తెలిపారు. దీంతో నియోజకవర్గంలో ఆయా పార్టీలకన్నా తటస్థుల సంఖ్య పెరిగింది. తాము ఓటు వేసిన అభ్యర్థులు గెలిచిన తర్వాత వేరే పార్టీలకు మద్దతు తెలపడంతో వారితో ప్రయాణం చేసిన వారికన్నా తటస్థులుగా నిలిచినవారి సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో పాటు మహిళల పోలింగ్ శాతం పెరిగింది. ఈ ఇద్దరిపైనే అభ్యర్థుల గెలుపు, ఓటములు ఆధారపడినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఎగ్జిట్‌పోల్స్ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ అభ్యర్థి కొండయ్య గెలుపొంది, అటు రాష్ట్రంలోను, ఇటు నియోజకర్గంలోను ఒకే గొడుగు కింద ప్రభుత్వం సాగుతుందా... లేదంటే గత రెండు ఎన్నికల్లో మాదిరిగా రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పరిచే పార్టీ కాకుండా వైసీపీ అభ్యర్థి వెంకటేష్ గెలుపొంది గత రెండు పర్యాయాల ఎన్నికల్లో నెలకొన్న మిశ్రమ ఫలితం, అస్థిరత్వం కొనసాగుతుందో వేచిచూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలో తాజాగా చీరాల ఫలితాలపై పలు ప్రాంతాల్లో బెట్టింగ్‌లు పెరిగాయి.

కూటమి ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ

చీరాల నియోజకవర్గంలో టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు భారీ మెజార్టీ రానుందని పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జరిగిన క్రాస్ ఓటింగ్ అందుకు కారణంగా వారు వివరిస్తున్నారు. మొత్తమ్మీద ఈవీఎంలలో నిక్షిప్తమైన ఆయా పార్టీల అభ్యర్థుల భవిత్యం, గెలుపు, ఓటములు రేపు బహిర్గతం కానున్నాయి. దీంతో ఉత్కంఠకు తెరపడనుంది.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, రఘురామకృష్ణమరాజు, కామినేనితో బలరాం

ప్రముఖుల కలయిక

చీరాల, జూన్ 2 : పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నియోజవకర్గ మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కార్యక్రమం సందర్భంగా పలువురు ప్రముఖులు వెళ్లారు. ముందుగా వెంకటకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రఘురామకృష్ణమరాజు, కామినేని శ్రీనివాసరావు, కరణం బలరామకృష్ణమూర్తి మధ్య మాటామంతీ జరిగింది.

బల్లికురవలో పిడుగులతో భారీ వర్షం

బల్లికురవ, జూన్ 2 : గత వారం రోజుల నుంచి వడగాలులు ఎండలు ఉక్కపోతతో విలవిలలాడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి గంటపాటు పిడుగులతో కూడా భారీ వర్షం పడడంతో వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఎండలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రుతుపవనాలు సకాలంలో రావడంతో వర్షాలు ప్రారంభమయ్యాయని ప్రజలు అంటున్నారు. ఉరుములు మెరుపులు పిడుగులు భారీ శబ్దంతో రావడంతో గృహాలలో నిద్రపోతున్న ప్రజలు ఒకింత భయాందోళన చెందారు. దగ్గరలోనే పిడుగులు పడిన్నట్లు శబ్దం వచ్చినట్లు తెలిపారు. గంగమ్మ దేవాలయం సమీపంలో చెట్టుపై పిడుగు పడిందని ప్రజలు తెలిపారు. మరో వర్షం పడితే భూమిలో తేమ శాతం పెరిగి వాతావరణం చల్లబడుతుందని ప్రజలు తెలిపారు.

ఆంధ్రరత్న ఆశయాలను కొనసాగిస్తాం

వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు సుబ్బరామయ్య



దుగ్గిరాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివేకానంద సేవా సమితి ప్రతినిధులు

చీరాల, జూన్ 2 : ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆశయాలను కొనసాగిస్తామని వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు సర్విశెట్టి సుబ్బరామయ్య అన్నారు. దుగ్గిరాల జయంతి సందర్భంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కులోని గోపాలకృష్ణయ్య విగ్రహానికి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు సుబ్బరామయ్య మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో ఖ్యాతిపొందిన చీరాల, పేరాల ఉద్యమ సారథి, రామదండు రూపశిల్పి దుగ్గిరాలని కొనియాడారు. ఆయనను నేటి తరం నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మువ్వల శివప్రసాదరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కోట వెంకటేశ్వరరెడ్డి, జి.హరిప్రసాద్, ఎస్.సుధీర్ పాల్గొన్నారు.



నేలపై నిద్రిస్తున్న వృద్ధురాలికి తోడుగా ఉన్న కుక్క

శునక విశ్వాసం

- యజమానితో పాటే నేలపై నిద్ర
- కొన్నాళ్లుగా వృద్ధురాలిని అంటిపెట్టుకొని ఉంటున్న కుక్క

మార్టూరు, జూన్ 2 : పై ఫొటోలో మూడు చక్రాల సైకిల్ దాని పక్కనే నేలపై నిద్రిస్తున్న వృద్ధురాలు, ఆమెకు దగ్గరలోనే నిద్రిస్తున్న శునకం. అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ సన్నివేశం ఆదివారం మధ్యాహ్నం మండలంలోని ఇసుకదర్శి అండర్ పాస్‌లో కనిపించింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన ఉన్నత సామాజికవర్గానికి చెందిన వృద్ధురాలి రుక్కమ్మకు కుటుంబ సభ్యులెవరూ లేరు. పైగా ఆమె మానసికస్థితి సరిగాలేదని, ఆర్థిక పరిస్థితి కూడా బాగులేదని గ్రామస్థులు చెప్తున్నారు. దివ్యాంగురాలు కాకపోయినప్పటికీ నడవడానికి కాళ్లు సక్రమంగా సహకరించక పాత మూడు చక్రాల సైకిల్‌పై జొన్నతాళి, మార్టూరు సెంటర్‌కు అడపాదడపా వస్తుంటుంది. ఎవరైనా రుణమో ఫణమో ఇస్తే తీసుకుంటుంది. తనవద్ద ఉన్న శునకానికి కూడా కొంత ఆహారం పెడుతుంది. దీంతో విశ్వాసం పెంచుకున్న శునకం ఆమెతోపాటు తిరుగుతూ ఆమెకు రక్షణగా ఉంటోంది. మూడు చక్రాల సైకిల్‌పై వెళ్తున్నప్పుడు కుక్కను కూడా సైకిల్‌కు గొలుసుతో కట్టేసి ఉండడంతో ఆమెతోపాటు తిరుగుతుంటుంది. ఆదివారం ఇసుకదర్శి గ్రామం నుంచి బయటకు వచ్చినపుడు ఎండ వేడిమిని తట్టుకోలేక ఆ వృద్ధురాలు అండర్ పాస్‌లోనే నేలపై నిద్రపోతుండగా శునకం కూడా అక్కడే ఆమెతో నిద్రపోతున్న దృశ్యం అందరినీ ఆశ్చర్యపరిచింది. మూగజీవి శునకానికి ఉన్న విశ్వాసం.. మనుషులకు లేదేంటి అని జనాలు అనుకుంటూ వెళ్లడం విశేషం.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు

- గ్రామాలపై నిఘా
- అభ్యర్థులు నియమ నిబంధనలు పాటించాలి
- చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్





చీరాలలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు..బల్లికురవలో మాట్లాడుతున్న సీఐ

చీరాలటౌన్, జూన్ 2 : ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పోటీ చేసిన అభ్యర్థులకు నియమ నిబంధనలను వివరిస్తూ నోటీసులు అందజేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 144 అమలులో ఉన్నట్లు గుర్తు చేశారు. కార్యకర్తలతో సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. విజయోత్సవ లేదా ఇతర ర్యాలీలు నిర్వహించరాదన్నారు. టపాసులకు అనుమతులు లేవన్నారు. ప్రత్యర్థులను, లేదా ఏదైనా రాజకీయ పార్టీలనుద్దేసించి ప్రేరేపిత వ్యాఖ్యలు చేయరాదని సూచించారు. అభ్యర్థుల నివాస ప్రదేశాల్లో అధిక సంఖ్యలో గుమిగూడడం, మారణాయుధాలు ఉంచడం చట్టవ్యతిరేకమని డీఎస్పీ తెలిపారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

చీరాల రూరల్ పరిధిలోని అసాంఘిక శక్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపినట్లు రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో రూరల్ పరిధిలోని వాడరేవు, గవినివారిపాలెం, దేవినూతల, రామాపురం తదితర ప్రాంతాల్లో పోలీస్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచినట్లు వివరించారు. ఏదైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై మర్రి శివకుమార్, ప్రత్యేక పోలీసు బృందాలు పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ : కౌంటింగ్ సందర్భంగా అన్ని గ్రామాలలో దుకాణాల మూసి వేయాలని, నలుగురు ఒక చోట గుమికూడి ఉండరాదని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో పలు గ్రామాల ప్రజలు, దుకాణ యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. అభ్యర్థుల గెలుపు ఓటమిలపై పెద్ద ఎత్తున బెట్టింగులు పెట్టిన్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎవరూ బెట్టింగ్‌లు పెట్టవదన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిషేధమన్నారు. ఎన్నికల నిబంధనలు, పోలీసుల సూచనల మేరకు ప్రజలు, ఆయా పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం ఫ్యాక్షన్ గ్రామం వేమవరం గ్రామంలో పోలీస్ కవాతు నిర్వహించి, ఎస్టీ కాలనీలో ప్రతి ఇంట్లో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో బల్లికురవ, సంతమాగులూరు ఎస్ఐలు రవిశంకర్‌రెడ్డి, సురేష్, ఏఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

దుకాణాలను మూసేయండి

పంగులూరు : ఎన్నికల ఫలితాల లెక్కింపు సందర్భంగా గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయాలని ఎస్ఐ కేకే తిరుపతిరావు సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన ఎస్ఐ కౌంటింగ్ సందర్భంగా చేపడుతున్న చర్యలను వివరించారు. మూడవ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 5వ తేదీ రాత్రి 12 గంటల వరకు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రామాలలోని కిరాణాషాపులు, బడ్డీకొట్లు, టీ దుకాణాలతో పాటు హోటళ్లు, రెస్టారెంట్లను మూసివేసి సహకరించాలని ఎస్ఐ కోరారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సందర్భంగా ప్రజలెవరూ గుంపులుగా గుమికూడరాదని, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం చేయరాదని కోరారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టడంపై నిషేధం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవు

మార్టూరు : ఎన్నికల లెక్కింపు జరుగుతున్న సందర్భంగా గ్రామాలలో ఎవరైనా ఏ పార్టీవారైనా గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనున్న దృష్ట్యా మండలంలోని గ్రామాలలో శాంతియుతమైన వాతావరణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆదివారం రాత్రి రాజుపాలెం గ్రామంలో సీఐ గ్రామస్థులతో మాట్లాడారు. అనంతరం మార్టూరులో విలేకరులతో మాట్లాడుతూ లెక్కింపు రోజున కోనంకి గ్రామంలో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని గ్రామంలో పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నామన్నారు. ద్రోణాదుల, ఇసుకదర్శి, కోనంకి, నాగరాజుపల్లిరాజుపాలెం గ్రామాలలో పోలీస్ పర్యవేక్షణకొనసాగుతున్నదన్నారు. బుధవారం కూడా గ్రామాలలో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. మార్టూరులోని లాడ్జిలలో కొత్తవారికి గదులను అద్దెకు ఇవ్వవద్దని లాడ్జి యజమానులకు నోటీసులను ఇచ్చామన్నారు.పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

పర్చూరు, జూన్ 2 : శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు త ప్పవని మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శీతారామయ్య హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉందని ప్రజలు ఎవ రూ నిబంధనలు అతిక్రమించవద్దని ఆదివారం ప్రకటనలో తెలిపారు. శాంతియుతంగా కౌంటింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రతిభావంతులకు బహుమతులు

మేదరమెట్ల , జూన్ 2 : కంప్యూటర్ విద్యలో వేసవి శిక్షణను కిరణ్ జ్యోతి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కిరణ్ జ్యోతి ఫౌండేషన్ పరీక్షలు నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్ తెలిపారు. 12 సంవత్సరాలు పైబడిన విద్యార్థులలో ఏ బాలాజీ బద్రీనాథ్, కే కావ్య ద్వితీయ, కే సృజన తృతీయ బహుమతిని సాధించినట్లు తెలిపారు. 12 ఏళ్ల లోపు విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో ప్రథమ బహుమతిని సీహెచ్ హాసిని, ద్వితీయ బహుమతికి బేబీ హాసిని, తృతీయ బహుమతిని నివేదిక సాధించినట్లు తెలిపారు. దివంగత పాతూరి పోతురాజు స్మారక స్కాలర్‌షిప్‌ను బీఎస్సీ సెకెండియర్ చదువుతున్న జంపు హర్షితకు రూ.20వేలను అందించారు. హర్షిత ఎమ్మెస్సీ పూర్తి చేసేవరకు స్కాలర్‌షిప్‌ను అందిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఊటుకూరి ప్రసాద్‌రావు, మద్ది లక్ష్మయ్య కంపెనీ హెచ్ ఆర్ హెడ్ బాబురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న పేద విద్యార్థులందరికీ ఉన్నత విద్యను పూర్తి చేయడనికి అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించడానికి కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ ముందుంటుందని తెలిపారు.



విద్యార్థినికి స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్న ఊటుకూరి

భక్తిశ్రద్ధలతో నాగవరపమ్మ అమ్మవారి కొలుపులు

చినగంజాం, జూన్ 2 : మండలంలోని కడవకుదురు గ్రామంలో నాగవరపమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నక్కల వంశీకుల ఇలవేల్పు నాగవర పమ్మ అమ్మవారి కొలుపులను మే 31వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దేవర పెద్ద నక్కల పెదముత్తయ్య తెలిపారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక్కసారి నక్కల వంశీకులు అమ్మవారి కొలుపులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కొలుపులు ముగింపు రోజైన ఆదివారం సాయంత్రం అమ్మవారికి పొట్టేళ్లు, అగుమంచి బాణం, రాత్రి కి పట్టాలెక్కుట తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పొంగళ్లు నెత్తిన పెట్టుకొని మంగళవాయిద్యాలు, కనకతప్పెట్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొని వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నక్కల వెంకటనారాయణ, నక్కల కృష్ణ, వెంకయ్య, పాపయ్య, నక్కల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఊరేగింపుగా పొంగళ్లు తీసుకెళ్తున్న భక్తులు



శ్రీ అభయాంజనేయస్వామి

నేడు శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

పర్చూరు, జూన్ 2: పర్చూరులోని వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన 92 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ఆలయ ప్ర థమ వార్షిక మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. అందుకోసం భారీ ఏర్పాట్లను ఆలయ కమిటీ వారు శరవేగంగా చేస్తున్నారు. వార్షిక వేడుకల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. ఉదయం 7గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించనునట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.



బాపనయ్యచౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొట్టిపాటి

గొట్టిపాటి పరామర్శ

పంగులూరు, జూన్ 2 : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన చింతల బాపనయ్యచౌదరి కుటుంబ సభ్యులను టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పరామర్శించారు. చింతల బాపనయ్య చౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పించిన గొట్టిపాటి ఆయన మృతికి కారణాలను తెలుసుకున్నారు. రవికుమార్ వెంట నాయకులు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు పాల్గొన్నారు.

మేదరమెట్లలో..

మేదరమెట్ల : ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆదివారం మేదరమెట్ల ఎస్టీ కాలనీకి చెందిన తెలుగుదేశం కార్యకర్త చేవూరి తిరుపతిరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న తిరుపతిరావును రవికుమార్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలుగుదేశం నాయకులు సింగయ్య మనుమడును పరామర్శించి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసున్నారు. అయన వెంట మేదరమెట్ల శ్రీనివాసరావు, బొల్లేపల్లి సుబ్బారావు, సింగమనేని వాసు, మన్నె ప్రసాద్, గ్రామపార్టీ అధ్యక్షుడు శేషయ్య వడ్లమూడి సురేంద్ర, బ్రమ్మయ్య, రాజేష్ పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు, జూన్ 2 : ఇంకొల్లులో ఆదివారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన కూరపాటి సీతారావమ్మ(86) మృతి చెందగా, రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ కంటి వైద్యశాల వైద్యులు చైతన్య, అనిత సీతారావమ్మ నుంచి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులు రమాదేవి, శ్రీనివాసరాజు, సతీష్‌కుమార్, అనిల్‌కుమార్‌ను అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు అభినందించారు.

విద్యుత్ శాఖ ప్రైవేటీకరణకు బీజేపీ కుట్ర

రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకుడు కృష్ణయ్య

ఇంకొల్లు, జూన్ 2 : దేశవ్యాప్తంగా వివిధ రూపాలలో రూ.70 లక్షల కోట్ల ఆస్తులున్న విద్యుత్ శాఖను రూ.7లక్షల కోట్ల అప్పుల సాకు చూపి ప్రైవేటీకరించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేలి కృష్ణయ్య అన్నారు. గంగవరంలో ఆదివారం నిర్వహించిన రైతుసంఘ సమావేశంలో రైతు సమస్యలపై అయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌ఓల అధికార వైసీపీ స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. రైతులంతా అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలన్నారు. దేశవ్యాప్తంగా రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం బాపట్ల జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి కారు.. తప్పిన ప్రమాదం



డివైడర్‌పైకి ఎక్కిన కారు

మార్టూరు, జూన్ 2 : జాతీయ రహదారిపై గుంటూరు వైపు వెళుతున్న కారు ముందు టైరు వీల్ విరిగిపోవడంతో అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం డేగరమూడి సర్వీసు రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు ఎదురుగా హైవేపై జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. అందిన సమాచారం మేరకు.. కడప నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు ముందు భాగంలో ఎడమ వైపు టైరువీల్ విరిగిపోయింది. దాంతో కారు వేగం కంట్రోలు కాక రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పైకి కారు దూసుకుపోవడమే కాకుండా మరలా కారు ఒంగోలు వైపు డివైడర్‌పైకి ఎక్కింది. ఈ కారులో ఒక వ్యక్తితో పాటు మహిళ, రెండేళ్ల అమ్మాయి ఉన్నారు. వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ టీం సంఘటనా స్థలానికి వచ్చి ఎక్స్‌కవేటర్ సాయంతో కారును సరిచేశారు.

వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం ఏర్పాటు చేసిన దాతలు


మార్టూరు, జూన్ 2 : రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు ఆదివారం కొణిదెన రోడ్, విజయ్‌నగర్ కాలనీలో ఉన్న వెంకయ్య ఆశ్రమంలో వృద్ధులకు, పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. వృద్ధ మహిళలకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు రావి అంకమ్మచౌదరి, శ్రీనివాసరావు, కొర్రపాటికాజారావు తాళ్లూరి సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, కొర్రపాటి వేణు, మాదాల సాంబశివరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డీఎస్పీ డ్రైవర్ దాడిలో వ్యక్తికి గాయాలు

రామాపురం(చీరాలటౌన్), జూన్ 2 : చీరాల డీఎస్పీ డ్రైవర్, మరొకరు దాడి చేసి గాయపరచిన ఘటనలో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల బాలాజీ థియేటర్ సమీపానికి చెందిన మించాల శ్రీనివాసరావు ఇటీవల వాడరేవు - రామాపురం రోడ్డులో ఓ స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈక్రమంలో ఆ స్థలాన్ని ఆదివారం సాయంత్రం చదును చేస్తుండగా ప్రస్తుతం డీఎస్పీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ బట్టు రామకృష్ణ, కారంచేడుకు చెందిన కొనికి శ్రీనివాసరావు ఈ స్థలం తమదంటూ శ్రీనివాసరావుతో వాదనకు దిగారు. ఈ నేపథ్యంలో కాళ్లతో, చేతులతో దాడి చేశారు. దీంతో స్థానికుల సహాయంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

కారంచేడు(పర్చూరు), జూన్ 2: మహిళ పట్ల అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తిపై ఆదివారం కారంచేడు పోలీసు స్టేషన్‌లో కేసునమోదైంది. కారంచేడు గ్రామానికి చెందిన ఓ మహిళ తప్పి పోయిన గేదెను వెతుకుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి తనపై అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలు కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.



ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	39.8	38.0	38.0	39.0	37.0
కనిష్ఠం	29.3	28.0	28.0	27.0	29.0

అందరికీ అగ్నిపరీక్షే!

- జిల్లా రాజకీయాలను శాసించిన కుటుంబాలకు..
- పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు..
- యువకులు, ఎన్‌ఆర్‌ఐల భవిష్యత్‌కు ఈ ఎన్నికల ఫలితాలే కీలకం
- మనుగడ సాగించాలంటే విజయం సాధించాల్సిందే!

రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న నెల్లూరు జిల్లాలో సంధికాలం వచ్చింది. కొన్ని దశాబ్దాలపాటు జిల్లా, రాష్ట్ర రాజకీయాలను శాసించిన బలమైన రాజకీయ కుటుంబాల వారసత్వం కొనసాగింపునకు ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. అలాగే జిల్లా రాజకీయ చిత్రపటంలోకి కొత్తగా దూసుకొచ్చిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, యువకులు, ఎన్‌ఆర్‌ఐల రాజకీయ భవిష్యత్ నిర్దేశానికి ఈ ఎన్నికల ఫలితాలు కొలమానం కానున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే 2024 ఎన్నికల ఫలితాలు జిల్లా రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలకడంతోపాటు, కొత్త తరానికి బాటలు వేయనున్నాయి. ప్రధాన పార్టీల నుంచి ప్రస్తుతం పోటీ చేసిన అత్యధికులకు ఈ ఎన్నికల ఫలితాలు అగ్నిపరీక్షగా మారనున్నాయి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

● ఆనం రామనారాయణరెడ్డి



కొన్ని దశాబ్దాలపాటు జిల్లా రాజకీయాలను శాసించిన కుటుంబాల్లో ఆనం కుటుంబం ఒకటి. కుటుంబ పెద్దగా ప్రస్తుతం ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మకూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఆనం కుటుంబం రాజకీయంగా తలోదారి ఎంచుకోవడం, రామనారాయణరెడ్డిని వెంటాడుతున్న వయోభారం.. తదితర కారణాల నేపథ్యంలో 2024 ఎన్నికలు రామనారాయణరెడ్డికి అత్యంత కీలకమైనవి. రాష్ట్ర రాజకీయాల్లో గుర్తింపు పొందిన ఆనం కుటుంబం నుంచి తదనంతర రాజకీయ వారసత్వానికి ఈ ఎన్నికల్లో ఆనం గెలుపు అనివార్యం.

● సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



వ్యక్తిగత చరిష్మానే రాజకీయ చరిత్రగా ఎదిగిన నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా పార్టీ అధినాయకత్వం ఆదేశాలే శాసనాలుగా పనిచేశారు. 2024 ఎన్నికల్లో రాష్ట్ర పార్టీ కొంత మంది సీనియర్లకు టికెట్ల విషయాన్ని పెండింగ్‌లో ఉంచింది. ఈ క్రమంలో సోమిరెడ్డి స్థానంలో ఆయన కోడలు పేరు పరిశీలనకు వచ్చినా సోమిరెడ్డి నిబద్ధత, ప్రజల్లో ఉన్న పట్టు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని చివరి నిమిషంలో టికెట్టు ఇచ్చింది. సోమిరెడ్డికి ఈ ఎన్నికలు అగ్నిపరీక్షే. ఇప్పటికే పలు సార్లు పరాజయం పాలైన క్రమంలో ఈ ఎన్నికల్లో గెలుపు వ్యక్తిగతంగా ఆయనకే కాకుండా ఆయన కుటుంబానికి కూడా అవసరం. సోమిరెడ్డి వారసత్వం రాజకీయాల్లో కొనసాగాలంటే ఈసారి ఆయన గెలిచి తీరాల్సిందే.

● మేకపాటి కుటుంబీకులు





జిల్లాలో బలమైన రాజకీయ కుటుంబాల్లో మేకపాటి కుటుంబం ఒకటి. వీరి కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు ఏక కాలంలో ఎంపీ, ఎమ్మెల్యేలుగా కొనసాగారు. అలాంటి కుటుంబానికి రాజకీయంగా నిలదొక్కుకోవా లంటే ఈ ఎన్నికల్లో గెలుపు అనివార్యం అయింది. ఉదయగిరి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబంతోనూ, వైసీపీతోనూ తెగదెంపులు చేసుకున్నారు. ఆయన స్థానంలో మరో తమ్ముడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని అభ్యర్థిగా చేశారు. తొలిసారిగా అసెంబ్లీకి తలపడిన ఈయన గెలవని పక్షంలో రాజకీయాల నుంచి దూరం జరగాల్సిన పరిస్థితి రావచ్చు. ఈ ఎన్నికల్లోనే ఈ స్థానం నుంచి టికెట్‌కు పెద్ద ఎత్తున పోటీ ఎదురయ్యింది. ఇక ఆత్మకూరు నుంచి రెండో సారి పోటీ చేస్తున్న విక్రమ్‌రెడ్డికి ఈ ఎన్నికలు ఓ సవాలే. అన్న గౌతంరెడ్డి మరణం కారణంగా జరిగిన ఉపఎన్నికల్లో ఆయన గెలిచారు. ఈ గెలుపు ఆయన సమర్థతకు కొలమానంగా తీసుకోలేం. ఈ ఎన్నికల్లో గెలుపే ఆయన్ను నాయకుడిగా నిలబెడుతుంది. ఈ విషయాల్లో తేడా వస్తే ఇప్పటికే ఎంపీ స్థానాన్ని చేజార్చుకున్న మేకపాటి కుటుంబం భవిష్యత్తులో ఉదయగిరి, ఆత్మకూరు విషయాల్లో కూడా రాజీపడాల్సిన పరిస్థితి వస్తుంది.

● పొంగూరు నారాయణ



శక్తిమంతుడు, పనిరాక్షసుడు, అభివృద్ధి కారకుడిగా పొంగూరు నారాయణకు పేరుంది. టీడీపీలో నంబర్-2గా గుర్తింపు ఉంది. అయితే వీటికంటే ఈ ఎన్నికల్లో ఆయన గెలుపు, ఆయన సాధించే భారీ మెజారిటీలు ఆయనకు అత్యంత కీలకం కానున్నాయి. టీడీపీ అంతర్గత కార్యకలాపాల్లో అత్యంత కీలకంగా వ్యవహరించినా, చంద్రబాబుకు అత్యంత విశ్వసనీయుడిగా ఉన్నా ఈయన అభ్యర్థిత్వాన్ని పార్టీలోని కొంత మంది సీనియర్ నాయకులే వ్యతిరేకించారు. కార్పొరేట్లకు టికెట్లు ఇవ్వడం ఏమిటి అని పరోక్షంగా చంద్రబాబును దెప్పిపొడిచారు. దీనికి కారణం గత ఎన్నికల్లో ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోవడమే. గత ఎన్నికలకు ముందు మంత్రి హోదాలో నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడిగా ప్రజలు గుర్తించినా వైసీపీ గాలిలో ఓటమి పాలయ్యారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకుండానే మంత్రి వర్గంలోకి వచ్చే అవకాశం ఉన్నా తన సత్తా చాటుకోవడం కోసం పట్టుబట్టి ఎన్నికల బరిలో దిగారు. పరిస్థితులు కూడా ఈయనకు బాగా కలిసొచ్చాయి. ఆయన గెలుపు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవు. కానీ మెజారిటీపైనే అందరూ లెక్కలు వేసుకొంటున్నారు. భారీ మెజారిటీ సాధించినప్పుడే ఈయన గెలుపునకు విలువ ఉంటుంది.

● వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు





ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలకు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. వైసీపీలో జగన్ ముఖ్యుల్లో ఒకరిగా ఉండి, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతూ ఆత్మగౌరవం నినాదంతో ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. నెల్లూరు ఎంపీ స్థానానికి ఆయన, కోవూరు అభ్యర్థిగా ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి పోటీ చేశారు. టీడీపీలోకి చివరి నిమిషంలో వచ్చినా రెండు టికెట్‌లు ఇచ్చి రాష్ట్ర పార్టీ వీరిని గౌరవించింది. అంతేకాక వారిని జిల్లా టీడీపీ నాయకులు నెత్తినపెట్టుకున్నారు. ఈ గౌరవాభిమానాలు కొనసాగాలంటే ఈ ఎన్నికల్లో వీరి గెలుపుతో పాటు భారీ మెజారిటీలు అనివార్యం.

● దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



అసెంబ్లీకి పోటీ చేయాలనే ఓ దశాబ్దపు కలను ఎట్టకేలకు సాకారం చేసుకొని కావలి నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి. కావలి నియోజకవర్గం రాష్ట్ర ప్రజల దృష్టిని ఆకర్షించింది. అక్కడ వైసీపీ నాయకుల అరాచకాలపై ప్రజలు ఎలా స్పందిస్తారనేది కావలి ఫలితాలపై సర్వత్రా చర్చ జరుగుతూనే ఉంది. హోరాహోరీ జరిగిన ఈ ఎన్నికల సమరంలో విజయం సాధించడం దగుమాటికి అనివార్యం.

● కాకర్ల సురేష్



ఎన్‌ఆర్‌ఐగా స్థిరపడి విలాసవంతమైన జీవితం గడుపుతున్న కాకర్ల సురేష్ పురిటిగడ్డకు సేవ చేయాలనే లక్ష్యంతో ఉదయగిరికి తిరిగొచ్చాడు. తన సేవా కార్యక్రమాలతో టీడీపీ అధినేతలను మెప్పించి, సుదీర్ఘ కాలం ఉదయగిరి టీడీపీకి నాయకత్వం వహించిన బొల్లినేని కుటుంబాన్ని కాదని టికెట్ సాధించుకున్నారు. ఈ కష్టానికి ఫలితం దక్కాలంటే అతడి గెలుపు అనివార్యం. విజయం ఒక్కటే ఈయన రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుంది.

● ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరులో వేళ్లూనుకున్న టీడీపీ కుటుంబాలను కాదని ఇంటూరి నాగేశ్వరరావు టికెట్ సాధించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆశతో రెండున్నరేళ్లకు ముందే వ్యాపారాలను పక్కన పెట్టి పూర్తి కాలం ప్రజల మధ్య గడిపారు. అయితే బీఫాం తీసుకునే వరకు పార్టీ నాయకులతో అంతర్గతంగా పోటీపడుతూనే వచ్చారు. ఎట్టకేలకు టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. ఇప్పుడు ఆయన రాజకీయ భవిష్యత్తును ఈ ఫలితాలే నిర్దేశించనున్నాయి. రాజకీయాల కొనసాగింపునకు ఇంటూరికి గెలుపు అనివార్యం.

- ఎన్నికల తుది ఘట్టానికి ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- విధుల్లో 3,600 మంది సిబ్బంది
- ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు
- అత్యధికంగా కోవూరు, ఉదయగిరిలో 24 రౌండ్లు
- తొలి ఫలితం నెల్లూరు సిటీదే..!
- నేటి నుంచి 144 సెక్షన్



రేపే ఓట్ల లెక్కింపు

నెల్లూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా... అని అందరూ వేయికళ్లతో ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది..! దాదాపు రెండున్నర నెలల సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన తుది ఘట్టం ఓట్ల లెక్కింపునకు సమయం ఆసన్నమైంది. అందుకు ఇక 24 గంటలు మాత్రమే మిగిలింది. మంగళవారం (రేపు) కౌంటింగ్ జరుగుతుంది. ఇందుకు నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిలుస్తోంది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 115 మంది, నెల్లూరు పార్లమెంటుకు 14 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, ఎవరి భవితవ్యం ఏమిటన్నది మరో కొన్ని గంటల్లోనే తేలిపోనున్నది. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. గతనెల 13న పోలింగ్ జరగ్గా కౌంటింగ్‌కు ఇరవై రోజుల సమయం ఉండింది. ఈ సమయాన్ని అధికార యంత్రాంగం సద్వినియోగం చేసుకుంది. జిల్లా ఎన్నికల అధికారి ఎం హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌లు నిరంతరం కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్తూ అక్కడి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. దాదాపుగా అధికార యంత్రాంగం మొత్తం కౌంటింగ్ కేంద్రం వద్దనే పాగా వేసింది. పార్కింగ్ దగ్గర నుంచి స్ట్రాంగ్ రూంల వరకు ప్రతి చోటా ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లకు సంబంధించి అవగాహనను కూడా అన్ని రాజకీయ పార్టీలకు కల్పిస్తున్నారు. కచ్చితంగా మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అయ్యేలా అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే కౌంటింగ్ విధుల్లో ఉన్న సిబ్బందిని ఉదయం ఐదు గంటల కల్లా కేంద్రానికి చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది అంతా చేరుకున్నాక అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో సిబ్బంది ఫైనల్ ర్యాండమైజేషన్ చేస్తారు. అక్కడికక్కడే ఏ టేబుల్ వద్ద విధులు నిర్వహించాలన్నది వారికి సూచిస్తారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. కౌంటింగ్ విధుల్లో ప్రత్యక్షంగా 1,100 మంది, పరోక్షంగా మరో 2500 మంది పాల్గొంటున్నారు.

● ఆలస్యంగా కోవూరు,ఉదయగిరి ఫలితాలు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రారంభమవుతుంది. జిల్లాలో మొత్తం 25,846 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. నెల్లూరు పార్లమెంటుతోపాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొదటి అర్ధగంట వీటి లెక్కింపు పూర్తవగానే ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ప్రతి ఇరవై నిముషాలకు ఒక రౌండ్ ఫలితాలను పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కోవూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో అత్యధికంగా పోలింగ్ స్టేషన్లు ఉండడంతో వాటిలో ఓట్ల లెక్కింపునకు ఎక్కువ రౌండ్లు అవసరమవుతున్నాయి. ఈ రెండు చోట్లా అత్యధికంగా 24 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. ఇక అత్యల్పంగా నెల్లూరు సిటీలో 18 రౌండ్లలోనే ఫలితం తేలిపోనుంది. ఎటువంటి అభ్యంతరాలు, రీ కౌంటింగ్‌లు జరగకపోతే జిల్లాలో అధికారికంగా వెల్లడయ్యే తొలి ఫలితం నెల్లూరు సిటీదే. సాయంత్రం నాలుగు గంటల కల్లా కౌంటింగ్ పూర్తి చేయాలని ఎన్నికల అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా కౌంటింగ్ నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఇక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడ గుంపులు గుంపులుగా ఉండడాన్ని నిషేధించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లోకి రానున్నది.

కౌంటింగ్‌కు సంబంధించిన వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాల సంఖ్య	రౌండ్లు	పోలైన ఓట్లు	పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	కౌంటింగ్ పూర్తి
కందుకూరు	271	20	203637	2689	మధ్యాహ్నం 3
కావలి	314	23	198066	3635	సాయంత్రం 4
ఆత్మకూరు	278	20	179829	3131	మధ్యాహ్నం 3
కోవూరు	324	24	211976	3210	సాయంత్రం 4
నెల్లూరు సిటీ	248	18	171763	3071	మధ్యాహ్నం 2
నెల్లూరు రూరల్	285	21	190324	5405	మధ్యాహ్నం 3
సర్వేపల్లి	284	21	194618	1878	మధ్యాహ్నం 3
ఉదయగిరి	323	24	197970	2827	సాయంత్రం 4

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కౌంటింగ్ కేంద్రం వద్ద షామియానాలు, మంచినీటి వసతి, ఇతర ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. ఆదివారం కలెక్టర్ హరినారాయణన్ ప్రియదర్శిని కాలేజీని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బందికి, అధికారులకు, జర్నలిస్టులకు అల్పాహారం, భోజనం, ఇతర ఏర్పాట్లన్నీ సవ్యంగా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.





నెల్లూరు : ప్రియదర్శిని కాలేజీలో కౌంటింగ్ ఏర్పాట్లు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● కౌంటింగ్ ఏజెంట్లతో ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్



పాల్గొన్న ఏజెంట్లు

నెల్లూరు(క్రైం), జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ రోజు ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనాసరే ఉపేక్షించేదిలేదని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ హెచ్చరించారు. నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం నెల్లూరు నగరం, రూరల్ ఏజెంట్లతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు వ్యవహరించాల్సిన తీరు, ఎన్నికల నిబంధనలను ఎస్పీ వివరించారు. గొడవలు, విద్వేషాలు, అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టు పక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే ఏజెంట్లు సంబంధిత అధికారుల నుంచి జారీ చేయబడిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకువెళ్లాలని, అలాగే మొబైల్స్, ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగిరెట్లు, పెన్, పేపర్ ఎట్టి పరిస్థితుల్లో తీసుకురాకూడదన్నారు. కౌంటింగ్ కేంద్రానికి పోటీలోని అభ్యర్థులు, వారి ఏజెంట్లు మినహా ఇతరులు ఎవరూ రావడానికి అనుమతి లేదన్నారు. ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లాక కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు బయటకు రావడానికి వీలు లేదని, ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ముందుగానే మందులు వెంట తెచ్చుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా, ఫలితాలు వచ్చిన అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు పోలీసులకు సహకరించాలన్నారు.



నెల్లూరు నగరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర

ప్రశాంతంగా హనుమాన్ శోభాయాత్ర

● కదంతొక్కిన యువత, మహిళలు ● కాషాయ జెండాల రెపరెపలు

● అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 2 : హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నెల్లూరు నగరంలో హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ యాత్రలో బైక్‌లపై మహిళలు, యువతులు, చిన్నారులు కాషాయ జెండాలతో కదంతొక్కారు. ఏసీ స్టేడియం నుంచి వేలాది మందితో ప్రారంభమైన యాత్ర కేవీఆర్ పెట్రోలు బంకు, ఏసీ మార్కెట్, వీఆర్సీ, గాంధీబొమ్మ, సుందరయ్య విగ్రహం, బోసుబొమ్మ, స్టోన్‌హౌస్‌పేట, తడికల బజారు సెంటర్‌ల మీదుగా ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్‌కు చేరింది. యాత్ర ముందుభాగాన శ్రీరామచంద్రమూర్తి, రామభక్త హనుమాన్‌ల భారీ విగ్రహాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. హనుమాన్ వేషధారణలో చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. తీన్‌మార్, డీజే సౌండ్ భక్తిగీతాలతో యాత్ర సాగింది. శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో యాత్రకు హారతులు ఇచ్చారు. పలు సెంటర్లలో ప్రజలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. జిల్లా కోర్టు వద్ద ముస్లిం యువత మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్ మైదానంలో అయోధ్య నుంచి తెచ్చిన విగ్రహాలతో శ్రీరామదర్బార్ అలంకారం, దర్శనం, పూజల అనంతరం ప్రసాదాల వితరణ జరిగింది. ఈ యాత్రకు పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. కాగా స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద అర్బన్ ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు పండ్ల రసాల చలివేంద్రం ఏర్పాటు చేసి శోభాయాత్ర భక్తుల దాహార్తి తీర్చారు. బిస్కెట్లు అందచేశారు. ఈ కార్యక్రమాలను అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, కమిటీసభ్యులు పర్యవేక్షించారు.

హంసపై కామాక్షితాయి విహారం



బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 2: మండలంలోని జొన్నవాడ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి హంసవాహ నంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లు తిరచా ఉత్సవంపై ఊరేగారు. ఆలయానికి వచ్చిన భక్తులకు భోజనవసతి కల్పించారు. రాత్రికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి వీ. గిరికృష్ణ ఉత్సవాలను పర్యవేక్షించారు. కాగా కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి రావణసేవ నిర్వహించనున్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

- ఓట్ల లెక్కింపుపైనే అందరి దృష్టి
- అభ్యర్థులలో ఉత్కంఠ
- ఫలితాలపై ఆసక్తిచూపుతున్న జనం
- శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసుల బందోబస్తు

ఆత్మకూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. ఫలితాలు వెలువడే మంగళవారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు సర్వే సంస్థలు చేపట్టిన ఎగ్జిట్‌పోల్స్ వెలువడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. మరోవైపు ఎలాంటి ఫలితాలు అందిస్తాయనే విషయమై ప్రధాన పార్టీ అభ్యర్థులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ప్రధాన పార్టీ నాయకులు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ధీమా..

ఆత్మకూరులో తెలుగుదేశం అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయం తథ్యమని పార్టీ శ్రేణులు నమ్మకంతో ఉన్నారు. మండలా లు.. గ్రామాల వారీగా.. తమకు వచ్చే ఆధిక్యతను లెక్కకట్టి 10వేల పైబడి ఓట్ల ఆధిక్యతతో విజయం సాధిస్తామని విశ్లేషిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, టీడీపీ సూపర్ సిక్స్, ఉమ్మడి మెనిఫెస్టో తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు చెబుతున్నారు. చేజర్ల మండలంలో అత్యధిక మెజార్టీ, సంగం, ఆత్మకూరు మండలాల్లో ఆధిక్యత వచ్చే పరిస్థితి ఉందని వారు లెక్కలు వేస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి మేకపాటి సొంత మండలం మర్రిపాడు మండలంలో ఎప్పుడూ లేనివిధంగా ఎదురు గాలివీస్తోంది. అనూహ్యంగా టీడీపీకి సానుకూల పవనాలు వీచాయని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, ఏఎస్‌పేట మండలంలో సైతం టీడీపీకి స్వల్ప మెజార్టీ లభించే అవకాశాలున్నాయని పార్టీ నేతలు గ్రామాల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో సైతం టీడీపీ పుంజుకోవడంతో వైసీపీ ఆధిక్యతకు గండిపడిందని చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తెలుగుదేశం వారు విజయం తమదేనని ధీమాగా చెబుతున్నారు.

గెలుపుపై వైసీపీ ఆశలు..

వైసీపీ నేతలు సైతం గెలుపు తమదేననే ధీమాను వ్యక్తపరుస్తూ లెక్కలు కట్టే పనిలో పడ్డారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి సైతం గెలుస్తామనని చెబుతున్నారు. అనంత సాగరం, మర్రిపాడు మండలాల్లో, ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో వైసీపీ అత్యధిక మెజార్టీ రావడంతో పాటు ఏఎస్‌పేట, సంగం మండలాలతో పాటు ఆత్మకూరు రూరల్‌లో తమకు స్వల్ప ఆధిక్యత వస్తుందని చర్చించుకుంటున్నారు. ఓటింగ్ సరళిని బట్టి తాము 5నుంచి 10వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి తీరుతామని విశ్లేషిస్తున్నారు. రెండు పార్టీల గ్రామస్థాయి నాయకులు పోలింగ్ సరళిని బట్టి తమ పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పోలయ్యా యని చెబుతున్నారు. ఓటర్లు మాత్రం తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేసి మౌనంగా చూస్తున్నారు. మరో కొన్ని గంటల్లో సస్పెన్స్‌కు తెరపడనుంది.


ఆర్టీసీ బస్సండి.. కాస్త నెట్టండి !



బస్సును నెడుతున్న ప్రయాణికులు

ఉదయగిరి రూరల్, జూన్ 2: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం సీతారామపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు స్టార్ట్ కాకపోవడంతో కండక్టర్ అవస్థలు అన్నీఇన్నీ కావు. బస్టాండ్ సెంటర్‌లోని ప్రయాణికులు, స్థానికులతో బాబు కాస్త చేయి వేసి నెట్టండంటూ ప్రాధేయపడాల్సిన దుస్థితి నెలకొంది. బస్సుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోనే ఈ పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణికులు వాపోయారు.

పడమటిపాలెం సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడి మృతి



దయాకర్‌రెడ్డి (ఫైల్)

సంగం, జూన్ 2: తరుణవాయి సీనియర్ నాయకుడు, పడమటిపాలెం సాగునీటి సంఘం మాజీ అధ్య క్షుడుతుంగా దయాకర్‌రెడ్డి (78) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తెల్లవారుజాములన మృతి చెందారు. ఈయన గతంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన మరణానంతరం ఆనం రామనారాయణరెడ్డి అనుచరుడిగా ఉన్నారు. ఆ తరువాత వైసీపీలో చేరి పార్టీలో కొనసాగుతున్నారు.

నాగారపమ్మదేవికి పూజలు

సంగం, జూన్ 2: కోలగట్ల నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలంతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగల్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న ఆలయ నిర్వాహకులకు భక్తులకు అన్నదానం చేశారు.

రెండుచోట్ల పిడుగులు



లింగసముద్రం పొలాల్లో ఇన్సులేటర్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

లింగసముద్రం: మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి రెండు చోట్ల పిడుగులు పడ్డాయి. దీంతో విద్యుత్ ఇన్సులేటర్లు పగిలి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక కేజీబీవీ సమీపంలోనూ, జంగంరెడ్డిపాలెం వద్ద ఉన్న పశువైద్యశాల వెనుక వైపు, అలాగే దేవుని మాన్యం పొలాల్లో పిడుగులు పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కపోతకు అల్లాడి పోయారు. మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్, సిబ్బంది సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు ఎండలు, వేడి గాలుల నుంచి ఉపశమనం పొందారు.

సోమశిలకు 245 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 2: సోమశిల డ్యాం పరిసర ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి 245 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 7.387 టీఎంసీల నీరు నిల్వ ఉండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

భగవద్గీతతో అత్యున్నత జ్ఞానం

వింజమూరు, జూన్ 2: ఈ భూమి మీద అత్యున్నతమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించే ఏకైక గ్రంథమే భగవద్గీత అని దీన్ని సంపూర్ణంగా చదివి, ధ్యానం చేసినచో ప్రరిపూర్ణ మనిషిగా ఎదిగి వారి జీవిత లక్ష్యాన్ని సాధించవచ్చని గీతా ప్రబోధక్ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ షేక్ నజీర్‌బాషా తెలిపారు. శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. భగవద్గీత చదివి పాటించిన వారు పనిచేసే రంగాల్లో అద్భుతంగా రాణించగలుతారని చెప్పారు. అనంతరం గీతా ప్రబోధక్ ట్రస్ట్ సభ్యులు 12 మంది పాల్గొని గీత గొప్పతనాన్ని గూర్చి, వారి అనుభవాలు, శ్లోకాలతో అద్భుతంగా వివరించారు. ప్రతి ఒక్కరికి భగవద్గీత గ్రంథాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపిలగుంట, అయ్యప్పరెడ్డిపాలెం, కలిగిరి, దుత్తలూరు, వింజమూరు ప్రాంతాల నుంచి 100 మంది ధ్యానులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం

వింజమూరు, జూన్ 2: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జిల్లా అడిషనల్ ఎస్పీ ఉమామహేశ్వరరావు అన్ని పార్టీల సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల గురించి సోషల్ మీడియాలో ఎలాంటి వ్యాఖ్యలు ప్రచురించకుండా సమన్వయం పాటించాలని సూచించారు. స్థానిక ఎస్ఐ కోటిరెడ్డి, మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం



సంగంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



జంగాలదొరువులో ఆంజనేయస్వామి గ్రామోత్సవం

సంగం, జూన్ 2: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలకేంద్రంతో పాటు జంగాలదొరువులో ఆదివారం తెల్లవారు జామున గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన వీరాంజనేయస్వామి ఉత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): వెంకటంపేటలో మూడురోజులుగా జరుగుతున్న వీరాంజనేయస్వామి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు స్వామివారిని పూలతో అలంకరించి ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు వారుకడవతో నీరుపోసి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు 14 కేజీల లడ్డూ ప్రసాదాన్ని స్వామికి అందజేశారు.

ప్రవేశాలకు వేళాయె... వసతులు కరువాయె !



అద్దె భవనంలో కొనసాగుతున్న ఆత్మకూరు బీసీ బాలుర కాలేజీ హాస్టల్

ఆత్మకూరు, జూన్ 2: పట్టణంలోని బీసీ బాలుర, బీసీ బాలికల కాలేజి హాస్టళ్లతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్ ఉన్నాయి. అయితే బీసీ బాలుర కాలేజి వసతిగృహం పదేళ్లుగా అద్దెభవనంలోనే కొనసాగుతోంది. గత విద్యాసంవత్సరం ఆ హాస్టల్‌లో 100మంది చేరారు. వారికి సరైన వసతులు లేక అవస్థలు పడ్డారు. సరిపడా గదులు లేక ఇరుకుగదుల్లోనే కాలం వెల్లదీశారు. ఇక బీసీ బాలికల కాలేజి వసతిగృహం సైతం అద్దెభవనంలోనే నడుస్తోంది. ఈ విద్యా సంవత్సరం కళాశాలలు ప్రారంభమయ్యాయి. హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వ కాలేజి వసతిగృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

ప్రభుత్వ భూమి ఆక్రమణ అడ్డగింపు



ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

అనంతసాగరం, జూన్ 2: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారం గ్రామ శివారులో ఆదివారం గుట్టు చప్పుడుగా సర్వే నెంబరు 555తో పాటు ఇతర సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమి ఆక్రమించి ఆ భూమిలోని మొక్కలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకొని పనులు నిలిపివేశారు. ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌ను నిలదీశారు. రెవెన్యూ అధికారుల ఆదేశాలతో చదును చేస్తున్నట్లు చెప్పాడు. ఈ విషయాన్ని వారు అధికారులకు ఫిర్యాదు చేయగా తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, అసలు విషయం తమకు తెలిదన్నారు. ఎన్నికల కౌంటింగ్ హడావుడిలో యంత్రాంగం వుండడంతో ఆక్రమణదారులు బరితెగించినట్లు తెలుస్తోంది.

ఉదయగిరిలో వసతుల కరువు

ఉదయగిరి రూరల్, జూన్ 2: పేరు గొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా ఉంది నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పరిస్థితి. పట్టణం రోజురోజుకు విస్తరిస్తున్నా వసతుల కల్పన మాత్రం శూన్యం. దశాబ్దాల కిందట నిర్మించిన మురుగునీటి పారుదల వ్యవస్థ నేటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం పట్టణంలో 3,814 నివాసాలుండగా 15,870మంది జనాభా నివసిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగంతా రహదారులపైకి చేరుతోంది. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో సిమెంట్ రోడ్లు కుంగి, గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

- డ్రైనేజీ వ్యవస్థ దారుణం

పట్టణంలోని శ్రీనగర్‌కాలనీ, దిలావర్ భాయ్‌వీధి, సుద్ధబావివీధి, యాదవపాళెం, సినిమాహాలు వీధి, నాగులబావివీధి, వాయుగండ్లవారి వీధి, అగ్రహారం డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉండడంతో దోమలకు నిలయంగా మారి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. సుద్ధబావివీధిలో మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఈ సమస్యను పంచాయతీ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. పట్టణంలోని ఏ వీధిలో చూసినా ఏదో ఒక సమస్య ఉంటుంది. వర్షం కురిస్తే డ్రైనేజీలు పొంగడంతో రహదారులు, బస్టాండ్ ప్రాంతాలు వాగులు, చెరు వులను తలపిస్తాయి.



నాగులబావివీధిలో కుంగిన సిమెంట్‌రోడ్డు

- ప్రతిపాదనలకే పరిమితం

వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలినాళ్లలో ఉదయగిరి పట్టణంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో కొలతలు సేకరించారు. నివేదికలు తయారు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. భూగ ర్భ డ్రైనేజీతో తమ సమస్యలు తీరుతాయని పట్టణవాసులు ఎంతో ఆశపడ్డారు. కానీ ఆ పనులు ప్రతిపాదనలకే పరిమితం కావడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఏ వీధిలో చూసినా సిమెంట్ రోడ్లు నామ రూపాల్లేకుండా పోయా యి. మోకాటిలోతు గుంతలతో లేచిన కంకరరాళ్లతో అధ్వాన్నంగా తయారయ్యాయి. పైపులైన్‌లు, కొళాయిల ఏర్పాటుకు ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేయడంతో ఈ దుస్థితి నెలకొంది. పంచాయతీ బస్టాండ్ నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్ అధికారులు గతంలో రూ.3కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో దెబ్బతిన్న రోడ్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



వలేటివారిపాలెంలో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద కేంద్రం

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారం
- మూలనపడ్డ సేకరణ కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు

చెత్తతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగం!

వలేటివారిపాలెం, జూన్ 2 : పంచాయతీలకు ఆర్థిక వనరులు పెంచడమే లక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వం విరివిగా సంపద కేంద్రాలను నిర్మించింది. ఇందుకు కోట్లాది రూపాయలు వెచ్చించింది. 2019 తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మందుబాబులకు ఆవాసాలుగా తయారయ్యాయి. వలేటివారిపాలెం మండలంలో అయ్యవారిపల్లె, కూనిపాలెం, అంకభూ పాలపురం, బడేవారిపాలెం పంచాయతీలు మినహా మిగిలిన 17 పంచాయ తీలలో చెత్త సంపద కేంద్రాలను గత టీడీపీ ప్రభుత్వం కోట్లు వెచ్చించి నిర్మించింది. అయితే ప్రస్తుతం ఈ కేంద్రాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

వైసీపీ పాలనలో సంపద సృష్టి కేంద్రాలు నిర్వీర్యం

చెత్తతో సంపద సృష్టి కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అవి నిర్వీర్యంగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయంతో గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేశారు. అప్పట్లో ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్త బుట్టలను కూడా పంపిణీ చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని పట్టించుకునే నాధుడే లేకపోవడంతో అవి పాడైపోయాయి. మండల కేంద్రంలో చెత్త సంపద కేంద్రం ఉన్నప్పటికీ వినియోగించకపోవడంతో చెత్త సమీపంలో పడేస్తున్నారు. ఆ చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని గ్రామ పంచాయతీలలో అయితే అసలు చెత్త సేకరణ ఊసే లేదు. గ్రామాల్లో రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. వర్షాకాలం సమీపిస్తుండడంతో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో చెత్తసేకరణ కేంద్రాలు

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చెత్తను సేకరించి ఊరి బయటకు తరలించేందుకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలకు చెత్త సేకరణ రిక్షాలను అందించింది. కాగా, వాటిని వినియోగించకుండా మూలన పడేయడంతో అవి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

- కావలి ఆర్వో శీనానాయక్



మాట్లాడుతున్న కావలి ఆర్వో శీనానాయక్



సమావేశానికి హాజరైన కౌంటింగ్ ఏజెంట్లు

కావలి, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు వివిధ రాజకీయ పార్టీల తరుపున హాజరయ్యే ఏజెంట్లు నిబంధనలు పాటించాలని కావలి రిటర్నింగ్ అధికారి శీనానాయక్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఆదివారం కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలగురించి ఆయన వివరించారు. కావలి నియోజకవర్గంలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించారని, అదేవిధంగా కౌంటింగ్ కూడా ప్రశాంతంగా జరిగే విధంగా సహకరించాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి వివాదాలకు ఆస్కారంలేకుండా చూడాలన్నారు. వివాదాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో సంబరాలు చేసుకోవడం, గొడవలు పడటం లాంటివి జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా వివాదాలు జరిగితే అందులో ఉన్న వారందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కౌంటింగ్ హాల్‌కు పెన్, కాగితం తప్ప ఎలాంటి వస్తువులు తీసుకురాకూడదన్నారు. సెల్‌ఫోన్‌లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అసలు అనుమతి లేదన్నారు. టిఫిన్, భోజనం ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కావలి తహసీల్దారు నగేష్ పాల్గొన్నారు.

జనసేనకు 'అళహరి' ద్రోహం : సిద్ధు



మాట్లాడుతున్న జనసేన నేత సిద్ధు

కావలిటౌన్, జూన్ 2: కావలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆ పార్టీకి తీరని ద్రోహం చేశారని ఆ పార్టీ మరో నేత సిద్ధు ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన నేతలతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో అళహరి సుధాకర్ జనసేన కార్యకర్తలు, పవన్‌కల్యాణ్ అభిమానుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించారన్నారు. నిజమైన పార్టీ శ్రేణులను విస్మరించి కొంతమంది కిరాయి మనుషులను పక్కన పెట్టుకుని వారే నిజమైన పార్టీ అంటూ వైసీపీతో వ్యాపారం చేసి పార్టీకి ద్రోహం చేశారన్నారు. నిజమైన పార్టీ శ్రేణులు కూటమి అభ్యర్థులకు అండగా నిలబడి వేమిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డిల గెలుపు కోసం శక్తివంచన లేకుండా శ్రమించారన్నారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కావ్య కృష్ణారెడ్డి, వేమిరెడ్డిలు తొలిసారి పోటీ చేశారని, అభివృద్ధి చేసిన వారికే ఓటు వేయమని అళహరి పిలుపునివ్వడంలో అంతర్యం వైసీపీ అభ్యర్థులకు ఓట్లు వేయమనేకదా అన్నారు. అళహరికి ఇన్‌చార్జిగా పనిచేసే నైతికత కోల్పోయారని, అతనే రాజీనామా చేసి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. అళహరిపై ఆధారాలతో జనసేన అధిష్టానానికి ఫిర్యాదు చేశామని, త్వరలో అతనిపై చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. సమావేశంలో జనసేన నేతలు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయుడి గ్రామోత్సవం



ఒంటె వాహనంపై ఊరేగుతున్న ఆంజనేయస్వామి

కావలిటౌన్, జూన్ 2: ఒంటె వాహనంపై ఆంజనేయ స్వామి గ్రామోత్సం కనుల పండువగా జరిగింది. మునునూరు హనుమత్ క్షేత్రం ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న హనుమత్ జయంతోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి ఆంజనేయస్వామి ఒంటె వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగుతూ ప్రజలకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా గ్రామోత్సవానికి బ్రహ్మరథం పడుతూ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, నిత్యహోమం, పంచముఖ హనుమత్ గాయత్రి హోమం, మహా నివేదన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. వారం రోజులపాటు నిర్వహించిన హనుమత్ జయంతోత్సవాలను విజయవంతం చేసిన భక్తజనానికి అర్చక స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

విస్తరిస్తారా... విస్మరిస్తారా?

- కలిగిరిలో కానరాని జాతీయ రహదారి విస్తరణ పనులు



కలిగిరిలో కానరాని రహదారి విస్తరణ పనులు

కలిగిరి, జూన్ 2: కావలి నుంచి దుత్తలూరు -సీతారామపురం మార్గాన్ని ఎన్‌హెచ్-16బీజీ జాతీయ రహదారిగా ప్రకటించి పనులు ప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా కలిగిరి పట్టణంలో రోడ్డు విస్తరణకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పట్టణం మీదుగా జాతీయ రహదారి విస్తరణ జరుగుతుందా.. లేదా కలిగిరి పట్టణానికి కూడా బైపాస్ మార్గం మంజూరవుతుందా అనే విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు నేటికీ చెప్పకపోవ డంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కావలి-దుత్తలూరు-సీతారామపురం రహదారి విస్తరణలో భాగంగా ఈ మార్గంలో రహదారి పనులు రెండేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. రహదారి విస్తరణలో ముందుగా కావలి నుంచి దుత్తలూరు వరకు రోడ్డు వెంబడి భూములు ఎంతమేర కోల్పోవడం జరుగుతుందో, ఆక్రమణలు ఏమేర తొలగించాల్సి వస్తుందో అనే విషయమై ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికా రులు కసరత్తు పూర్తి చేసి పనులు ప్రారభించారు. ఈ క్రమంలో మండలంలోని పెదకొండూరు రెవెన్యూ పరిధిలోని పోలంపాడు గ్రామం, కలిగిరి రెవెన్యూ పరిధిలోని భూముల యజమానులకు రహదారి విస్తరణలో కోల్పోతున్న భూములకు నేటికీ నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందించలేదు. తమ భూముల్లో హద్దులు వేసి కొలతలు తీస్తుండటంతో హక్కు పత్రాలు తీసుకొని సంబంధిత రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూరా తిరుగుతున్నారు. అదేవిధంగా కావలి నుండి దుత్తలూరు వరకు ఉన్న జాతీయ రహదారి జలదంకి, కలిగిరి, వింజమూరు పట్టణాల గుండా వెళ్తుంది. జలదంకి వద్ద బైపాస్ రోడ్డు మంజూరవడం, వింజమూరు పట్టణంలో ప్రధాన మార్గం వద్ద రహదారి విస్తరణకు తగినంత స్థలం ఉండటంతో అక్కడ పనులు సాఫీగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేవలం కలిగిరి పట్టణంలో రహదారి విస్తరణకు సంబంధించి రెండేళ్ళ నుండి నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కలిగిరి పట్టణానికి సంబంధించి కావలి మార్గంలో కలిగిరి శివారు ప్రాంతం నుంచి తహసీల్దారు కార్యాలయ కూడలి ప్రాంతం మీదుగా హెచ్‌పీ పెట్రోల్‌బంకు కూడలి వరకు రోడ్డుకు ఇరువైపులా 40 అడుగుల చొప్పున ఆక్రమణలు తొలగించాలని సంవత్సరం క్రితం మార్కింగ్ ఇచ్చి నష్టపరిహారం చెల్లించి, ఆరు నెలల క్రితమే రోడ్డు వెంబడి దుకాణాలు, ఇళ్ల తొలగించేశారు.

పాత్రికేయులకు సన్మానం

బిట్రగుంట, జూన్ 2: బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు ఆధ్వర్యంలో మనఊరు మన పాత్రికేయులకు సన్మాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పాత్రికేయులను సన్మానించి అసోసియేషన్ మెడల్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ గౌరవఅధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, ఫౌండర్ అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులు, కార్యదర్శి పి.జీవన్‌కుమార్, సభ్యులు జిలానిబాషా, శ్యాంసుధాకర్, మన్నెం శ్రీనివాసులు, ఎస్.మనోహర్, రైల్వే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రాంగణాల అభివృద్ధికి చర్యలు



జడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో తోలిన మట్టి

కందుకూరు, జూన్ 2: కందుకూరు పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ఆటస్థలాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. అనువుగా లేని ఒకటిన్నర ఎకరం స్థలంకు మట్టితోలి చదును చేయించడంతో పాటు వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను అభివృద్ధి చేసేందుకు దాతల తోడ్పాటుతో చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ఆదివారం తెలిపారు. వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ వారు ఆటస్థలం ఆవరణలో గుంతలుగా ఉన్న ప్రాంతానికి మట్టితోలి చదును చేసేందుకు ముందుకు వచ్చారని, మరోదాత బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుచేసేందుకు సిద్ధం కాగా అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఆటస్థలం ఆవరణలో అసంపూర్తిగా నిర్మాణం జరిగి ఉన్న ఇండోర్ స్టేడియంను కూడా పూర్తిచేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. గతంలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా చేపట్టదలచిన పలు అభివృద్ధి పనులకు దాతలు అందించిన నిధులు అప్పటి కమిటీ వారి వద్ద ఉన్నందున వారు ముందుకొస్తే ఇండోర్ స్టేడియంను కూడా పూర్తి చేసుకుని పట్టణ ప్రజలకు అందుబాటులోకి తేవచ్చని ఆయన తెలిపారు.

సీతారాముల 16 రోజుల పండుగ

బిట్రగుంట, జూన్ 2: బోగోలు పంచాయతీ పాతదళితవాడలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి.

చిరుజల్లులకే రోడ్డు గుంతల్లో నిలిచిన నీరు

కొండాపురం, జూన్ 2: మండల పరిధిలో ఆదివారం చిరుజల్లులు కురిశాయి. ఈ చిరుజల్లులకే మండలకేంద్రంలోని చర్చి సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి రహదారిపై వెళ్లే వాహనచోదకులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డుపై ఇంతకుమునుపు ప్రయాణం చేయని వ్యక్తులు గుంత ఎంత లోతుంటుందోనని భయపడుతున్నారు. మండలకేంద్రంలోని ప్రధాన రహదారి పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన గ్రామాలలో అంతర్గత రోడ్ల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకొని రోడ్డు వేయకున్నా కనీసం గుంతలనైనా పూడ్చి ప్రయాణికుల సమస్యలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



కొండాపురంలో ప్రధాన రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు